



www.navabhoomi.in | epaper.navabhoomi.in | RNI No:TELTEL:82083

# నవభూమి

ANUKSHANAM
NAVABHOOMI TELUGU DAILY
నవతరం తెలుగు దినపత్రిక






Published from Hyderabad and Vijayawada
ఎడిటర్ : అజీద్
హైదరాబాద్ | 04 బుధవారం | జూన్,2025 | పేజీలు 12 | వెల: రూ.6 | సంపుటి:2 సంచిక: 260
Navabhoomi daily fallows..
Circulated at: Hyderabad, Rangareddy, Adilabad, Karimnagar,Warangal,Khammam, Nalgonda, Mahabubnagar,Medak, Nizamabad, Krishna,Guntur,Easrt Godavari, West Godavari,Prakasam, Nellore,Srikakulam,Vizianagaram,Visakhapatanam,Kurnool,Chittoor,Kadapa,and Anantapur


# భారత్‌పై పాక్ పన్నాగం

- భారత్ మోకరిల్లేలా, రక్తమోడేలా చేయాలనుకున్న పాక్
- సీడీఎస్ అనిల్ చౌహాన్ సంచలన వ్యాఖ్యలు
- పాక్ జరిపిన వైమానిక దాడుల్లో భారత ఆర్మీకి చెందిన
- కొన్ని ఎస్టాబ్లిష్మెంట్స్ దెబ్బతిన్నాయన్నది నిజమే
- ప్రతీకారం తీర్చుకుంటామని పాకిస్తాన్‌కు సమాచారం

2



న్యూఢిల్లీ-నవభూమిబ్యూరో

పాకిస్తాన్, పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లో తిష్టవేసిన ఉగ్రవాదులను ఏరిపారేయడానికి భారత్ చేపట్టిన ఆపరేషన్ సింధూర్‌పై చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ అనిల్ చౌహాన్ సంచలన ప్రకటన చేశారు. పాకిస్తాన్ పై రెండు రోజుల పాటు కొనసాగిన యుద్ధంలో భారత ఆర్మీ కూడా నష్టపోవడం పట్ల స్పందించారు. యుద్ధం జరుగుతున్నప్పుడు ఎదురయ్యే నష్టాలకు ఎలాంటి ప్రాధాన్యత లేదని అనిల్ చౌహాన్ తేల్చి చెప్పారు. ఆ యుద్ధం ఫలితం ఎలాంటిదనేదే ఇక్కడ ప్రధానంగా మారుతుందని వ్యాఖ్యానించారు. పాక్ జరిపిన దాడుల్లో భారత ఆర్మీ నష్టపోయిన విషయాన్ని అంగీకరించారు. పుణేలో డిపార్ట్ మెంట్ ఆఫ్ డిఫెన్స్ అండ్ స్ట్రాటజిక్ స్టడీస్ లో ఏర్పాటైన ఓ కార్యక్రమానికి అనిల్ చౌహాన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆపరేషన్ సింధూర్‌ను ఆయన ప్రస్తావించారు. పాక్ జరిపిన వైమానిక దాడుల్లో భారత ఆర్మీకి చెందిన కొన్ని ఎస్టాబ్లిష్మెంట్స్ దెబ్బతిన్నాయని పేర్కొన్నారు. దీనికి ప్రతీకారం తీర్చుకుంటామని పాకిస్తాన్‌కు ముందుగానే సమాచారం ఇచ్చామని అనిల్ చౌహాన్ చెప్పారు. ప్రతిదాడులు తీవ్రంగా ఉంటాయని ముందుగానే చెప్పి మరీ దెబ్బకొట్టామని పేర్కొన్నారు. పాకిస్తాన్‌పై సర్జికల్ స్ట్రైక్స్ నిర్వహించనున్నట్లు మే 7వ తేదీ

# డేంజర్ బెల్స్!

- గ్లోబల్ వార్మింగ్ ముప్పు: భూమి వేడి పెరుగుతోంది
- వాతావరణ విపత్తుల శాఖ హెచ్చరిక
- మంచు కరిగిపోతోంది: జలప్రళయ భయం
- సముద్ర మట్టం పెరగడం వల్ల తీరప్రాంతాలకు ముప్పు
- 2024: చరిత్రలోనే హాట్‌టెస్ట్ ఇయర్
- ప్రభావిత ప్రాంతాలు -ఎక్కడ ఎక్కువ వేడి?

2



**న్యూఢిల్లీ-నవభూమిబ్యూరో:** మారుతున్న వాతావరణ పరిస్థితులు, గ్లోబల్ వార్మింగ్, క్లైమేట్ ఛేంజ్ కారణంగా భూమి ఉపరితల ఉష్ణోగ్రతలు భారీగా పెరిగిపోతాయని వరల్డ్ మెటిరియోలాజికల్ ఆర్గనైజేషన్ అంచనా వేసింది. 2024తో పోల్చితే 2025-2029 మధ్య అధిక ఉష్ణోగ్రతలు పెరగడానికి 80 శాతం అవకాశం ఉందని తాజాగా రిలీజ్ చేసిన రిపోర్టు స్పష్టం చేసింది.గ్లోబల్ వార్మింగ్ తీవ్రస్థాయిలో పెరిగిపోతోందని తెలిపింది. వరల్డ్ మెటిరియోలాజికల్ ఆర్గనైజేషన్(. తాజాగా గ్లోబల్ యానువల్ టూ డికేడల్ క్లైమేట్ అప్డేట్(2025-2029) అనే పేరుతో ఓ రిపోర్టును బయటపెట్టింది. రానున్న ఐదేళ్లలో వాతావరణ మార్పుల కారణంగా ఉష్ణోగ్రతలు 1.5 డిగ్రీ సెంటిగ్రేడ్ మేర పెరుగుతాయని అంచనా వేసింది. వడగాలులు, కరవు, విపరీతమైన వాతావరణ మార్పులు సంభవిస్తాయని స్పష్టం చేసింది. 2024-2028 రిపోర్టుతో పోల్చితే 2025-2029 రిపోర్టు ప్రకారం 47 శాతం అధికంగా భూమికి విపత్తు వాటిల్లే ప్రమాదం ఉందని %ఔమీ% తాజా నివేదిక వెల్లడించింది. రాబోయో ఐదేళ్లు హాటెస్ట్ ఇయర్స్‌గా నమోదవుతాయని తెలిపింది. మరో వైపు అధిక ఉష్ణోగ్రతలు, వాతావరణ మార్పుల కారణంగా మంచు పర్వతాలు కరిగిపోయి.. జల ప్రళయం సంభవించే ప్రమాదం ఉందని

# త్వరలో పెన్షన్ల పెంపు

- ఫించన్‌దారులకు తెలంగాణ ప్రభుత్వం గుడ్‌న్యూస్
- ఎన్నికల్లో హామీ ఇచ్చిన విధంగానే పెన్షన్ల పెంపు
- చేయూత పథకం కింద వివిధ వర్గాలకు చెందిన వారికి ప్రతి నెలా రూ. 4000 అందించనున్న సర్కార్
- ఆసరా పెన్షన్‌లను రూ. 4వేలకు, దివ్యాంగుల పెన్షన్లను
- రూ.4వేలనుంచిరూ.6వేలకు పెంచనున్నట్లు సమాచారం
- స్థానిక సంస్థల ఎన్నికల ముందే దీనిపై సీఎం ప్రకటన

2



హైదరాబాద్-నవభూమిబ్యూరో

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ఎన్నికల హామీల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేస్తూ దూసుకెళ్తోంది. ప్రభుత్వంలోకి రాగానే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు, 500 రూపాయలకు గ్యాస్ సిలిండర్ పథకంతో పాటు తెల్ల రేషన్ కార్డు కలిగిన ప్రతి కుటుంబానికి సన్న బియ్యం పంపిణీ.. తదితర అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టింది రేవంత్ సర్కార్. తెలంగాణలోని సంక్షేమ పథకాల్లో అతి ముఖ్యమైనది పింఛన్లు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఆసరా పేరుతో ఫించన్ల పంపిణీ చేపట్టింది. అయితే తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ పథకం చేయూతగా మారింది. ఈ పథకం కింద రాష్ట్రంలోని వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు, బీడీ కార్మికులు, డయాలసిస్ రోగులు, ఎయిడ్స్, బోదకాలు వ్యాధిగ్రస్తులు.. తదితరులకు ఆర్థిక

# జగన్‌కు నిరసన సెగ

- తెనాలిలో ఉద్రిక్తత వాతావరణం
- రౌడీషీటర్ల హత్య తర్వాత జగన్ పర్యటన
- రాజకీయంగా వేడి పరిస్థితులు
- దళిత, ప్రజాసంఘాల బహిరంగ నిరసనలు
- నల్ల బెల్లూన్లు, "జగన్ గో బ్యాక్" నినాదాలు



**తెనాలి-నవభూమి ప్రతినిధి:** కూటమి వర్సెస్ వైసీపీగా సాగుతున్న ఏపీ రాజకీయాలు రోజురోజుకూ ఉద్రిక్తతల్ని పెంచుతున్నాయి. తెనాలిలో నడిరోడ్డుపై ముగ్గురి రౌడీ షీటర్లను పోలీసులు బహిరంగంగా చావబాదిన ఘటనపై స్పందించిన వైసీపీ అధినేత వైఎస్ జగన్ ఇవాళ అక్కడికి వెళ్లి వారి కుటుంబాల్ని పరామర్శించేందుకు సిద్దమయ్యారు. ఈ ఉదయం తెనాలికి జగన్ వస్తున్నారన్న సమాచారంతో టీడీపీతో పాటు కూటమి పార్టీల శ్రేణులు నిరసనలకు రంగం సిద్ధం చేసుకున్నాయి. తెనాలిలో జగన్ పర్యటనను వ్యతిరేకిస్తూ దళిత, ప్రజాసంఘాలతో పాటు కూటమి పార్టీల కార్యకర్తలు నిరసనలు చేపట్టారు. తెనాలిలోని ఐతానగర్ సెంటర్లలో జగన్?ను అడ్డుకున్న ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు...నినాదాలు చేశారు. తెనాలి మార్కెట్ సెంటర్ లో మానవహారంగా ఏర్పడి నిరసన తెలిపారు. రౌడీషీటర్లకు జగన్ మద్దతుగా నిలిచారంటూ దళితసంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వీరికి కూటమి పార్టీలు మద్దతుగా నిలిచాయి. "ఆ ఆందోళన సక్సెస్ చేసే బాధ్యత సజ్జలకే" జగన్ పర్యటనకు నిరసనగా తెనాలిలో దళిత, ప్రజాసంఘాలతో పాటు కూటమి పార్టీల కార్యకర్తలు నల్ల బెల్లూన్లతో ఆందోళన చేపట్టారు. జగన్ గో బ్యాక్ అంటూ నినాదాలు చేసారు. అయితే జగన్ టూర్ పోలీసుల భద్రత మధ్య కొనసాగుతోంది. తెనాలిలో బాధితుల్ని పరామర్శించేందుకు వచ్చిన జగన్ ను వైసీపీ నేతలు, కార్యకర్తలు ఆహ్వానించారు. వీరితో కలిసి జగన్ బాధితుల పరామర్శకు వెళ్లారు. వీరిని పరామర్శించడం కరెక్ట్ కాదని కూటమి నేతలు చెప్తున్నారు. ఇప్పటికే రౌడీ షీటర్లు, గంజాయ్ బ్యాచ్ ను పోలీసులు కొట్టడాన్ని ప్రభుత్వం, హోంమంత్రి సమర్ధించుకున్నారు. పోలీసులు పనిచేయాలంటారని, పనిచేస్తే తప్పు పడతారా అంటూ హోంమంత్రి నిన్న ప్రశ్నించారు. ఈ నేపథ్యంలో తెనాలి టూర్ లో జగన్ ను అడ్డుకునేందుకు నిరసనకారులు ప్రయత్నించడం ప్రాధాన్యం సంతరించుకుంది. ప్రభుత్వం అండతోనే వీరు జగన్ టూర్ కు ఆటంకాలు కల్పిస్తున్నారని వైసీపీ నాయకులు ఆరోపిస్తున్నారు.



# తెలుగు రాష్ట్రాల్లో జోరుగా సెక్స్ వ్యాపారం

- దేశవ్యాప్తంగా పెరుగుతున్న సెక్స్ వ్యాపారం
- తెలుగు రాష్ట్రాల్లో మరీ ఎక్కువైనట్లు సర్వే వెల్లడి
- దేశవ్యాప్తంగా సెక్స్‌వృత్తిలో 10లక్షల మంది
- అందులో 40శాతం మంది తెలుగు రాష్ట్రాల్లోనే..
- పీఎంపీఎస్ఇ సర్వే ప్రకారం ఏపీకి 2స్థానం
- సెక్స్ వ్యాపారంలో తెలంగాణకు 5వ స్థానం

2



న్యూఢిల్లీ-నవభూమిబ్యూరో

పేదరికం, కుటుంబ సమస్యలు, ఆర్థిక ఇబ్బందులు.. ఇలా కారణం ఏదైనా కానీ మహిళలు సెక్స్ వర్కర్లుగా మారుతున్న

# మాన్‌సూన్ రియల్ ఎస్టేట్!

- చిత్ర విచిత్రంగా హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్
- నేల చూపులు చూస్తున్న రియల్‌ఎస్టేట్
- మందగమనంలో ఇళ్ల అమ్మకాలు..కొనుగోళ్లు
- విచిత్రంగా కోటిపైనున్న ఇళ్ల అమ్మకాల్లో పెరుగుదల
- రిజిస్ట్రేషన్ల ఆదాయం కూడా పెరుగుదల

2



హైదరాబాద్-నవభూమిబ్యూరో

చిత్ర విచిత్రంగా హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్, హైదరాబాద్ రియల్ ఎస్టేట్ నేల చూపులు చూస్తోంది. ఏళ్ళ తరబడి స్థిరమైన వృద్ధిని సాధించిన హైదరాబాద్ రియల్ ఎస్టేట్ రంగం ప్రస్తుతం దీర్ఘకాలిక మందగమన సంకేతాలను చూపుతోంది. తాజాగా ఏప్రిల్ నెలలో హైదరాబాద్‌లో ఇళ్ల అమ్మకాలు తగ్గాయి. ఇక హౌస్ రిజిస్ట్రేషన్లు కూడా సంవత్సరానికి 12 శాతం వరకు తగ్గాయి. ఏప్రిల్ 2024తో పోలిస్తే రిజిస్టర్డ్ ఆస్తుల విలువ కూడా దాదాపు 4 శాతం తగ్గింది. అయితే ఇళ్ల అమ్మకాలు తగ్గినప్పటికీ ఏప్రిల్ నెలలో నమోదైన ఇళ్ల రేటు

# బనకచర్లపై తెలంగాణ మంత్రి తీవ్ర అభ్యంతరం

- ఏపీ బనకచర్ల ప్రాజెక్టును తీవ్రంగా వ్యతిరేకిస్తున్న తెలంగాణ
- ప్రాజెక్టును ఎట్టిపరిస్థితుల్లోనూ ఒప్పుకోబోమని ఉత్తమ్ స్పష్టీకరణ
- సముద్రంలో కలిసే నీటిని వాడుకుంటామనడంపై ఆగ్రహం

హైదరాబాద్-నవభూమిబ్యూరో



కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్‌కు, జీఆర్ఎంబీకి లేఖలు రాసినట్లు వెల్లడి

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిపాదించిన బనకచర్ల ప్రాజెక్టుపై తెలంగాణ ప్రభుత్వం మరోమారు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ ప్రాజెక్టును ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించేది లేదని తెలంగాణ రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తేల్చి చెప్పారు. హైదరాబాద్‌లో విలేకరులతో ఆయన మాట్లాడుతూ, సముద్రంలోకి వృథాగా పోయే జలాలనే వినియోగిస్తామని ఆంధ్రప్రదేశ్ నేతలు పేర్కొనడం విస్మయం కలిగిస్తోందన్నారు.

ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, "బనకచర్ల ప్రాజెక్టు నిర్మాణాన్ని నిలువరించేందుకు మేం అన్ని విధాలా ప్రయత్నిస్తున్నాం. ఇప్పటికే ఈ విషయంపై గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు (జీఆర్ఎంబీ)కి, కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌కు లేఖలు రాశాం. అంతేకాకుండా, కేంద్ర మంత్రితో స్వయంగా మాట్లాడి, ఈ ప్రాజెక్టును నిలిపివేయాలని విజ్ఞప్తి చేశాం. మాకున్న అభ్యంతరాలన్నింటినీ కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లాం" అని వివరించారు.తెలంగాణ ప్రయోజనాలకు నష్టం కలిగించే ఇటువంటి ప్రాజెక్టుల విషయంలో ఏ మాత్రం రాజీపడేది లేదని ఆయన స్పష్టం చేశారు. ఈ విషయంపై తగిన సమయంలో సముచిత రీతిలో స్పందిస్తామని ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.

# టెర్రరిస్టులకు అధికారుల సాయం

- వేటేసిన సర్కార్, దేశద్రోహం కింద కేసులు
- ముగ్గురు ప్రభుత్వ ఉద్యోగులపై జమ్ము కాశ్మీర్ ప్రభుత్వం కీలక నిర్ణయం

2



**న్యూఢిల్లీ-నవభూమిబ్యూరో:** ఏప్రిల్ 22న జమ్ము కాశ్మీర్ అనంత్ నాగ్ జిల్లా బైసరన్ లోయలోని పహల్గాంలో జరిగిన ఉగ్ర దాడిలో 26 మంది ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. అయితే మన దేశంలోనే ఉంటూ పాకిస్థాన్ కు ప్రత్యక్షంగా లేదా పరోక్ష్యంగా సపోర్ట్ చేస్తున్నవారిపై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. ఇప్పటికే యూట్యూబర్ జ్యోతి మల్హోత్రా లాంటివారిని అరెస్ట్ చేసి దేశ ద్రోహం కింద కేసులు నమోదు చేసింది పోలీసు యంత్రాంగం. తాజాగా ఉగ్రవాదులతో సంబంధం ఉన్న ముగ్గురు ప్రభుత్వ ఉద్యోగులపై జమ్ము కాశ్మీర్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. లష్కర్ ఏ తోయిబా, హిజ్ బుల్ ముజాహిదీన్ లాంటి ఉగ్ర సంస్థలతో సంబంధాలు ఉన్న ముగ్గురు ప్రభుత్వ ఉద్యోగులను జమ్ము కాశ్మీర్ పోలీసులు గుర్తించారు. వారిని విధుల నుంచి బహిష్కరిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది జమ్ము కాశ్మీర్ ప్రభుత్వం. గత ఐదేళ్లలో ఉగ్రవాదులతో రిలేషన్ ఉన్న 83 మందిని గుర్తించి వారిని సెక్షన్ 311 కింద విధుల నుంచి

# అక్షరాలా లక్ష రూపాయలు

- హైదరాబాద్‌లో ఆల్ టైమ్ రికార్డ్ కొట్టిన బంగారం ధరలు..
- ఇది బంగారం ధరల చరిత్రలోనే అత్యధికమన్న మార్కెట్ వర్గాలు
- ప్రస్తుతం పెళ్లిళ్ల సీజన్ కారణంగా పెరిగిన బంగారం కొనుగోళ్లు

2



హైదరాబాద్-నవభూమిబ్యూరో

భారతదేశంలో ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల్లో బంగారానికి ఉన్న డిమాండ్ గురించి ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. మహిళలకు బంగారు ఆభరణాలపై ఉండే ఇష్టం అంతా ఇంతా కాదు. సీజన్లతో సంబంధం లేకుండా బంగారాన్ని కొనుగోలు చేస్తూనే ఉంటారు. ఈ క్రమంలోనే గత కొంతకాలంగా పసిడి ధరలు మరింత పైపైకి పోతూనే ఉంటున్నాయి. అయితే తాజాగా హైదరాబాద్ లో బంగారం ధరలు ఆల్ టైమ్ రికార్డు సృష్టించాయి. హైదరాబాద్ నగరంలో బంగారం ధరలు ఈరోజు మధ్యాహ్నం 12 గంటల సమయానికి.. 10 గ్రాముల 24 క్యారెట్ల స్వచ్ఛమైన బంగారం ధర ఏకంగా రూ.1,00,110 కి చేరింది. ఇది బంగారం ధరల చరిత్రలోనే

# కోరలు చాస్తున్న కరోనా

- 24 గంటల్లో ఐదుగురి మృతి..ప్రజల్లో భయాందోళనలు
- దేశవ్యాప్తంగా యాక్టివ్ కొవిడ్ కేసుల సంఖ్య 4 వేలు

2



న్యూఢిల్లీ-నవభూమిబ్యూరో

ప్రపంచ వ్యాప్తంగా కరోనా మళ్లీ కోరలు చాస్తోంది. రోజురోజుకీ కోవిడ్ పాజిటివ్ కేసుల సంఖ్య పెరుగుతూ ఒక్కో దేశానికి విస్తరిస్తుండడం ప్రజల్లో భయాందోళన కలిగిస్తోంది. ఇక మన దేశంలో సైతం చాపకింద నీరులా కోవిడ్ కేసులు పెరుగుతున్న తరుణంలో.. దేశవ్యాప్తంగా కరోనా పాజిటివ్ కేసుల సంఖ్య అనూహ్యంగా పెరుగుతుండటం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ విడుదల చేసిన తాజా గణాంకాల ప్రకారం.. నేటికీ ( జూన్ 3, 2025 ) నాటికి దేశవ్యాప్తంగా యాక్టివ్ కొవిడ్ కేసుల సంఖ్య 4 వేల మార్కును దాటినట్టు అధికారులు స్పష్టం చేశారు. అయితే మరోవైపు యాక్టివ్ కేసుల సంఖ్య పెరుగుతుండటంతో పాటు మరణాలు కూడా నమోదవుతుండడం ప్రజలను భయభ్రాంతులను

# వేములవాడ రాజన్న ఆలయ కోడెల మృతి ఘటనపై ప్రభుత్వం కీలక ఆదేశాలు



**హైదరాబాద్-నవభూమి:** వేములవాడ రాజన్న ఆలయంలో ఇటీవల కోడెలు మృతిచెందాయి. ఈ సంఘటన తెలంగాణలో చర్చనీయాంశంగా మారింది. భక్తులు ఇచ్చిన కోడెలు మృతిచెందడంపై పలు అనుమానాలు వ్యక్తం అయ్యాయి. అయితే ఈ సంఘటనపై వెంటనే తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంబంధిత అధికారులతో మాట్లాడారు. కోడెల రక్షణకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అయితే కోడెలు మృతిచెందిన సంఘటనపై తెలంగాణ ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ స్పందించారు. ఇవాళ(మంగళవారం) సీఎల్పీ మీడియా పాయింట్‌లో ఆది శ్రీనివాస్ మాట్లాడారు. రాజన్న ఆలయంలో కోడెల మృతిపై సమీక్ష చేశామని ఆది శ్రీనివాస్ తెలిపారు. వర్షాకాలం వ్యాధుల వల్ల కోడెలు చనిపోవడం బాధాకరమని తెలిపారు. కొందరు భక్తులు పాలు కూడా మరువని కోడెలను తీసుకువస్తున్నారని చెప్పారు. ఇలాంటి సంఘటనలు మళ్లీ పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకుంటామని చెప్పారు. వేములవాడ రాజన్న ఆలయాన్ని విస్తరణ చేస్తున్నామని వెల్లడించారు. పాత ఆలయం, పాత మండపాలు యధావిధిగా ఉంటాయని ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. హరీష్‌రావు మధ్య పెడుతున్నారు..బీఆర్ఎస్ బీజేపీలో విలీనం అవుతుందని ఎమ్మెల్సీ కవిత లేఖలో పేర్కొందని ఆది శ్రీనివాస్ తెలిపారు. పొత్తు పెట్టుకోకుండా ఉండటానికి బీఆర్ఎస్ ఉండాలి కదా అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ కేడర్‌ను మభ్య పెట్టేందుకే మాజీ మంత్రి హరీష్‌రావు మాట్లాడుతున్నారని అన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ నేతలు కలిసి కాంగ్రెస్‌ని దొంగదెబ్బ తీయాలని చూస్తున్నారని ఆరోపించారు. కవిత చెప్పిన దెయ్యాలు ఎవరో హరీష్‌రావు సమాధానం చెప్పాలని అన్నారు. పార్టీ ఇంటర్నల్ విషయాలు బయటకి చెప్పిన కవితపై చర్యలు తీసుకుంటారా అని నిలదీశారు.



## ఒకే రోజు 141 లారీలు.. రాష్ట్రంలోకి భారీగా ఉల్లిగడ్డ దిగుమతి



**హైదరాబాద్-నవభూమి:** రాష్ట్రంలో మునెప్పుడూ లేనివిధంగా భారీగా ఉల్లి దిగుమతి అయ్యింది. ఉల్లిగడ్డ పంట దిగుబడి సీజన్ అయిన ఏప్రిల్, మే నెలల్లో పొరుగు రాష్ట్రాలు మహారాష్ట్ర, కర్ణాటక నుంచి దిగుమతి కావడం సహజమే. అయితే ఈసారి జూన్ నెలలో కూడా భారీగా ఉల్లి దిగుమతులు జరుగుతున్నాయి. సోమవారం ఒక్కరోజే హైదరాబాద్‌లో ప్రధాన మార్కెట్ అయిన మలక్‌పేట గంజ్‌కు 141 లారీల ఉల్లిగడ్డ దిగుమతి జరిగినట్టు అధికారులు తెలిపారు. %అయితే అందులో 105 లారీల ఉల్లి ఒక్క మహారాష్ట్ర నుంచి దిగుమతి కావడం గమనార్హం. వివిధ రాష్ట్రాల నుంచి దాదాపు 43 వేల ఉల్లి బస్తాలు నగరానికి చేరాయి. కాగా ఈ దిగుమతి అయిన ఉల్లి క్వింటాలుకు రూ.1500 నుంచి రూ .1800గా పలుకుతోంది. అయితే బహిరంగ మార్కెట్లో మాత్రం అంతకురెట్టింపు ధరకు కొనుగోలు చేయవలసి వస్తున్నదని వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## రాష్ట్రంలో ఎలక్ట్రిక్ వాహనాల జోరు.. రెండు లక్షలు దాటిన ఈవీలు



**హైదరాబాద్-నవభూమి:** తెలంగాణలో పర్యావరణహిత ఎలక్ట్రిక్ వాహనాల సంఖ్య 2 లక్షల మైలురాయిని దాటింది. 2024-25 ఆర్థిక సంవత్సరం ముగిసే (మార్చి 31) నాటికి రవాణాశాఖ లెక్కల ప్రకారం రాష్ట్రవ్యాప్తంగా 1.96 లక్షలకుపైగా ఎలక్ట్రిక్ వాహనాలు రిజిస్టర్ అయ్యాయి. ఏప్రిల్ నెలాఖరునాటికి ఆ సంఖ్య 2 లక్షలు దాటినట్లుగా రవాణాశాఖ వర్గాలు తెలిపాయి. మొత్తం ఎలక్ట్రిక్ వాహనాల్లో అత్యధికంగా (80 శాతంపైగా) బైక్‌లు ఉండగా తర్వాత స్థానంలో కార్లు ఉన్నాయి. ఈవీలతో అటు వాటి యజమానులతోపాటు ఇటు పర్యావరణానికీ మేలు జరుగుతోంది.

## గచ్చిబౌలిలో కారులో మంటలు



**హైదరాబాద్-నవభూమి:** గచ్చిబౌలిలో కారులో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయం ఎదుగా ఈ ఘటన జరిగింది. కారు రన్నింగ్‌లో ఉండగానే మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంపై సమాచారం అందుకున్న వెంటనే అక్కడకు చేరుకున్న పోలీసులు అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చారు. ఈ క్రమంలో గచ్చిబౌలి వేళ్లే మార్గంలో ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. కారు పూర్తిగా దగ్ధం..అగ్ని ప్రమాదంలో కారు పూర్తిగా దగ్దమైంది. కారులో ఉన్న ఇద్దరు వ్యక్తులు సురక్షితంగా బయటపడ్డారు. కారు ఇంజన్ నుంచి మంటలు రావడం గమనించిన ప్యాసింజర్లు వెంటనే అప్రమత్తమై కారు నుంచి దిగిపోయారు. కొన్ని నిమిషాల వ్యవధిలోనే మంటలు కారు మొత్తం వ్యాపించాయి. పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది సంఘటన ప్రదేశానికి వచ్చేలోపే కారు పూర్తిగా కాలిపోయింది. ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## బీఆర్ఎస్‌కు షాక్.. మాజీ ఎమ్మెల్యేపై కేసు నమోదు



**మహబూబాబాద్-నవభూమి:** డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ సీనియర్ నేత రెడ్యానాయక్‌పై పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. రెడ్యానాయక్‌తో సహా 17 మందిపై కేసులు పెట్టారు. నిన్న(సోమవారం) డోర్నకల్‌లో బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతలు ఘర్షణకు దిగారు. ఈ ఘటనలోనే పోలీసులు బీఆర్ఎస్ నేతలపై కేసు నమోదు చేశారు. పోలీసుల విధులకు ఆటంకం కలిగించారనే కారణంతో డోర్నకల్ పోలీసులు కేసులు నమోదు చేశారు. కాగా సోమవారం నాడు డోర్నకల్ పట్టణంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతలు పోటాపోటీగా ర్యాలీ నిర్వహించారు. దీంతో డోర్నకల్‌లో ఉద్రిక్త వాతావరణ పరిస్థితులు నెలకొన్నాయి. అయితే రెండు పార్టీల్లోని నేతలనూ నియంత్రించేందుకు పోలీసులు ఇబ్బంది పడ్డారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతల ఘర్షణతో డోర్నకల్ నియోజకవర్గం మళ్లీ హాట్ టాపిక్‌గా మారింది. పోలీసుల సూచనలు అతిక్రమించడంతో శాంతిభద్రతల సమస్య ఉత్పన్నమైందని డోర్నకల్ పోలీసులు తెలిపారు. విచారణ అనంతరం మరికొంతమందిపై కేసులు నమోదు చేసే అవకాశం ఉంది. పోలీసు కేసులతో డోర్నకల్ రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. ప్రతిఒక్కరిని గుర్తుపెట్టుకుంటానని, వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలిచి మంత్రి అయిన తర్వాత అందరి సంగతి తెలుస్తానని రెడ్యానాయక్ కాంగ్రెస్ నేతలను హెచ్చరించారు. రాజకీయ కక్షల్లో భాగంగానే తమ పార్టీ నేతలపై పోలీసులు కేసు పెట్టారని బీఆర్ఎస్ నేతలు ఆరోపిస్తున్నారు. పోలీసులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని చెప్పారు. తమ నేతలను వెంటనే విడుదల చేయాలని బీఆర్ఎస్ నేతలు కోరారు. అయితే ఇలాంటి పరిణామాలు ఇంకా కొనసాగితే డోర్నకల్ రాజకీయాలు మరింత సంక్లిష్టంగా మారే ప్రమాదం ఉందని పలువురు అంటున్నారు.

## బాలికపై అత్యాచారం కేసు: నిందితుడికి 20 ఏళ్ల కఠిన కారాగారం

**హైదరాబాద్-నవభూమి:** నగరంలోని సరూర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన మైనర్ బాలికపై అత్యాచారం కేసులో నిందితుడికి రంగారెడ్డి జిల్లా కోర్టు కఠిన శిక్ష విధించింది. ఈ దారుణానికి పాల్పడిన దర్శనం నాగరాజు అనే వ్యక్తికి 20 సంవత్సరాల జైలు శిక్షతో పాటు రూ.20,000 జరిమానా విధిస్తూ మంగళవారం తీర్పు వెలువరించింది. వివరాల్లోకి వెళితే, సూర్యాపేట జిల్లా నడిగూడెం మండలం రామచంద్రాపురానికి చెందిన నాగరాజు, అబ్దుల్లాపూర్‌మెట్‌లో నివాసం ఉంటూ తాపీమేస్త్రిగా పనిచేస్తున్నాడు. ఇతను 2024లో సరూర్‌నగర్ ప్రాంతానికి చెందిన ఒక మైనర్ బాలికను పెళ్లి చేసుకుంటానని నమ్మించి తన వెంట తీసుకెళ్లాడు. ఆ తర్వాత పలుమార్లు ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ ఘటనపై బాధిత కుటుంబ సభ్యులు సరూర్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

# గ్రేటర్ హైదరాబాద్‌లో ఓపెన్ ప్లాట్ ఉన్నవారికి షాక్




**హైదరాబాద్-నవభూమి:** గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో మీకు ఓపెన్ ప్లాట్ ఉందా..? అయితే మీకో షాకింగ్ న్యూస్. మీరు ఖాళీ స్థలానికి ట్యాక్స్ కట్టాల్సిందే. ఈ మేరకు గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ కార్యాలయం కీలక ఆదేశాలు జారీ చేసింది. నగరంలోని ఖాళీ స్థలాల యజమానులకు పన్ను చెల్లించాలని సూచించారు. ఈ మేరకు రిజిస్ట్రేషన్ల శాఖ నుండిచిపొందిన వివరాల ఆధారంగా.. వేకెంట్ ల్యాండ్ టాక్స్ బకాయిల వివరాలను అన్ని జోన్లు, సర్కిళ్లు, డివిజన్లకు అందించింది. ఈ బకాయిలను వసూలు చేయడానికి జోనల్ కమిషనర్లు, డిప్యూటీ కమిషనర్లకు ఆదేశాలు జారీ చేశారు. కింది స్థాయిలోని బిల్ కలెక్టర్లు, ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్లకు లక్ష్యం టార్గెట్లను నిర్దేశించి, రోజువారీ పురోగతిని పర్యవేక్షించాలని చెప్పారు. ఇక జీహెచ్‌ఎంసీ కమిషనర్ ట్రేడ్ లైసెన్సుల జారీ అధికారాన్ని ఇటీవల సర్కిల్ డిప్యూటీ కమిషనర్లకు బదిలీ చేశారు. గతంలో ఈ అధికారం గ్రేటర్ పరిధిలోని సహాయ వైద్యాధికారులు, పశువైద్యాధికారుల వద్ద ఉండేది. అవకతవకలు, జవాబుదారీతనం లోపం వంటి సమస్యలను నివారించడానికి ఈ నిర్ణయం తీసుకున్నారు. పన్ను వసూళ్ల బాధ్యత కూడా డిప్యూటీ కమిషనర్లదేనని జీహెచ్‌ఎంసీ కేంద్ర కార్యాలయం తాజా ప్రకటనలో స్పష్టం చేసింది. జీహెచ్‌ఎంసీ ఆస్తి పన్ను వసూళ్లలో గణనీయమైన పురోగతి సాధిస్తోంది. గత ఆర్థిక సంవత్సరం 2024-25లో జీహెచ్‌ఎంసీ రూ. 2,038 కోట్లకు పైగా ఆస్తి పన్నును వసూలు చేసి చరిత్ర సృష్టించింది. ఇది జీహెచ్‌ఎంసీ చరిత్రలోనే అత్యధిక వసూలు. గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఇది రూ. 121 కోట్లకు పైగా ఎక్కువ. 2025-26 ఆర్థిక సంవత్సరానికి జీహెచ్‌ఎంసీ రూ. 3,000 కోట్ల ఆస్తి పన్ను వసూలును లక్ష్యంగా పెట్టుకుంది. పౌరులు తమ ఆస్తి పన్నును జీహెచ్‌ఎంసీ వెబ్‌సైట్, మీసేవ కేంద్రాలు, లేదా నిర్దేశిత బ్యాంక్ శాఖల ద్వారా చెల్లించవచ్చు. సకాలంలో పన్ను చెల్లించకపోతే నెలకు 2శాతం వడ్డీ వర్తిస్తుందని జీహెచ్‌ఎంసీ అధికారులు తెలిపారు. పన్ను వడ్డీ భారం తప్పాలంటే బాధ్యతగా ట్యాక్స్ చెల్లించాలని సూచిస్తున్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు బంపర్ ఆఫర్




**హైదరాబాద్-నవభూమి:** తెలంగాణ రాష్ట్రంలో ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలు శరవేగంగా జరుగుతోంది. గృహనిర్మాణానికి అర్హులైన పేదలకు సొంత ఇళ్లు నిర్మించుకునే అవకాశం కల్పించడమే ఈ పథకం ముఖ్య ఉద్దేశ్యం. అయితే.. ఈ ప్రక్రియలో ఎలాంటి అవినీతికి తావులేకుండా పారదర్శకతను పెంచాలని ప్రభుత్వం దృఢ నిశ్చయంతో ఉంది. ఈ నేపథ్యంలో.. వరంగల్ పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి లబ్ధిదారులకు కీలక సూచనలు చేస్తూ.. లంచాల నిర్మూలనకు కఠిన హెచ్చరికలు జారీ చేశారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గం పరిధిలోని ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ అందజేసే కార్యక్రమంలో ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇళ్లు మంజూరు చేయిస్తామని లేదా బిల్లులు ఇప్పిస్తామని నమ్మించి, ఎవరైనా బ్రోకర్లు లేదా పైరవీ కారులు లబ్ధిదారుల వద్దకు వస్తే.. వారి మాటలు నమ్మి మోసపోవద్దని స్పష్టం చేశారు. అంతేకాకుండా.. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల వద్ద ఎవరైనా లంచం తీసుకున్నట్లు తెలిస్తే.. అలాంటి వారి వివరాలు తనకు తెలియజేసిన వారికి రూ.25 వేల కానుక ఇస్తానని ప్రకటించారు. సొంత పార్టీ కార్యకర్తలైనా, అధికారులైనా, ఎవరైనా సరే పేదల వద్ద లంచం తీసుకున్నట్లు రుజువైతే, వారిపై కఠిన చర్యలు ఉంటాయని ఆయన స్పష్టం చేశారు. వారిపై కేసులు నమోదు చేయడంతో పాటు.. పార్టీ నుండి కూడా సస్పెండ్ చేస్తామని హెచ్చరికలు జారీ చేశారు. ఈ వ్యాఖ్యలు ప్రభుత్వ పారదర్శకతకు, ప్రజల సంక్షేమం పట్ల ఉన్న నిబద్ధతకు నిదర్శనం. తెలంగాణలో ఇప్పటివరకు 4.5 లక్షలకు పైగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరైనట్లు ప్రభుత్వం ప్రకటించింది. మొదటి విడతలో 3.5 లక్షల ఇళ్లు, రెండవ విడతలో మరో 1.0 లక్ష ఇళ్లు మంజూరు కానున్నాయి. ఇళ్ల నిర్మాణానికి లబ్ధిదారులకు రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందజేస్తారు. ఈ మొత్తం ఒకేసారి కాకుండా, మూడు విడతలుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ అవుతుంది. గృహ నిర్మాణం ప్రారంభించినప్పుడు పునాదులు వేసిన తర్వాత రూ.1 లక్ష జమ అవుతుంది. గోడలు పూర్తైన తర్వాత 1.25 లక్షల రూపాయిలు.. స్లాబ్ దశకు నిర్మాణం చేరుకున్నప్పుడు రూ.1.75 లక్షలు జమ అవుతుంది. నిర్మాణం పూర్తయి, గృహ ప్రవేశానికి సిద్ధంగా ఉన్నప్పుడు మిగిలిన రూ.1 లక్ష జమ అవుతుంది. ఈ విడతలవారీగా నిధుల విడుదల, నిర్మాణ పురోగతిని పర్యవేక్షించడానికి, నిధుల దుర్వినియోగాన్ని నివారించడానికి ఉద్దేశించబడింది. అర్హులైన లబ్ధిదారులకు జూన్ 2వ వారం నుండి దశలవారీగా ప్రొసీడింగ్స్ అందజేసే ప్రక్రియ ప్రారంభం కానుంది. ఈ పథకం ద్వారా రాష్ట్రంలోని నిరుపేద కుటుంబాలు సొంత ఇంటి కలను నెరవేర్చుకోవడమే కాకుండా.. వారి జీవన ప్రమాణాలు కూడా మెరుగుపడతాయని ప్రభుత్వం ఆశిస్తోంది.

# త్వరలో పెన్షన్ల పెంపు

(1వపేజీ తరువాయి) సాయం అందిస్తారు. చేయూత పథకం కింద వివిధ వర్గాలకు చెందిన వారికి ప్రతి నెలా రూ. 4000 అందించనుంది రాష్ట్ర ప్రభుత్వం. ఎన్నికల్లో ప్రకటించిన విధంగా ఫించను పెంపునకు రేవంత్ సర్కార్ సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఈ మేరకు ఆసరా పెన్షన్‌లను రూ. 4వేలకు, దివ్యాంగుల పెన్షన్లను రూ. 4 వేల నుంచి రూ. 6వేలకు పెంచనున్నట్లు తెలుస్తోంది. దీనిపై త్వరలోనే రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకోనున్నట్లు సమాచారం. తెలంగాణ రాష్ట్రంలో త్వరలోనే పంచాయతీ ఎన్నికలు జరగనున్నాయి. దీంతో ఈ లోపే పెన్షన్ పెంచి ఆయా వర్గాల వారికి శుభవార్త అందించాలని రేవంత్ సర్కార్ భావిస్తోంది. పించను పెంపును అమలు చేసి ఎన్నికల్లోకి వెళ్లడమే శుభపరిణామంగా ప్రభుత్వం యోచిస్తోంది. దీంతో ఫించను పెంపుపై త్వరలోనే అధికారికంగా రేవంత్ సర్కార్ ఓ కీలక ప్రకటన చేయనున్నట్లు సమాచారం. ఇప్పటికే ఎన్నికల సమయంలో ఇచ్చిన పలు హామీలు నిలబెట్టుకుంది కాంగ్రెస్ ప్రభుత్వం. ఉచిత బస్సు దగ్గరి నుంచి ఇటీవల ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇళ్లు పథకం వరకూ రేవంత్ సర్కార్ వేగవంతంగా నిర్ణయాలు తీసుకుంటోంది. దీంతో ఫించన్ల పంపిణీ కూడా వెంటనే చేపట్టాలని స్థానిక సంస్థల ఎన్నికలకు ముందే పెన్షన్ల పెంపు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. ఇక 2024 సామాజిక సర్వే లెక్కల ప్రకారం తెలంగాణలో మొత్తం 42. 7 లక్షల మంది ఫించను లబ్ధిదారులు ఉన్నట్లు తెలుస్తోంది. ఆసరా పథకం కింద ప్రస్తుతం రాష్ట్రంలోని వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు, బీడీ కార్మికులు, డయాలసిస్ రోగులు, ఎయిడ్స్, బోదకాలు వ్యాధిగ్రస్తులు.. తదితరులకు ఆర్థిక సాయం అందిస్తున్నారు. వృద్ధులతో పాటు ఇతరులకు రూ. 2,016 ఇస్తుండగా.. దివ్యాంగులకు రూ. 4,016 అందిస్తోంది. వీటిని అతి త్వరలోనే పెంచేందుకుసర్కార్ సిద్ధమవుతోంది.

# తెలుగు రాష్ట్రాల్లో జోరుగా సెక్స్ వ్యాపారం

(1వపేజీ తరువాయి) ఘటనలను చూస్తూనే ఉంటున్నాం. అయితే ప్రస్తుతం ఈ సంఖ్య గణనీయంగా పెరగడం సర్వత్రా ఆందోళన కలిగిస్తోంది. 2025 జూన్ 2న విడుదలైన అధ్యయనం ప్రకారం.. దేశవ్యాప్తంగా 10 లక్షల మంది సెక్స్ వర్కర్లు ఉన్నట్టు అంచనా వేశారు. అందులోనే దాదాపు 53 శాతం మంది కేవలం ఐదు రాష్ట్రాల్లోనే ఉండడం చర్చనీయాంశంగా మారింది. పీఎంపీఎస్ఇ నివేదిక ప్రకారం.. ప్రస్తుతం దేశవ్యాప్తంగా మహిళా సెక్స్ వర్కర్ల సంఖ్య 9,95,499 గా అంచనా వేశారు. ఇందులో కేవలం ఐదు రాష్ట్రాల్లోనే మొత్తం సంఖ్యలో సగానికి పైగా, అంటే 53% సెక్స్ వర్కర్లు ఉన్నారని వెల్లడించారు. రాష్ట్రాల వారీగా టాప్ 5 జాబితాని పరిశీలిస్తే..1. కర్ణాటక - 15.4% 2. ఆంధ్రప్రదేశ్ - 12.0% 3. మహారాష్ట్ర - 9.6% ‘ 4. ఢిల్లీ - 8.9% 5. తెలంగాణ - 7.6% తాజా అధ్యయనాల ప్రకారం.. గతకొంత కాలంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో మహిళా సెక్స్ వర్కర్ల సంఖ్య గణనీయంగా పెరుగుతున్నట్లు తెలుస్తోంది. ఈ రెండు రాష్ట్రాలు దేశవ్యాప్తంగా అత్యధిక సెక్స్ వర్కర్లున్న రాష్ట్రాల జాబితాలో అగ్రస్థానాల్లో ఉండడం ఆందోళన కలిగిస్తోంది. అంతే కాకుండా రెడ్ లైట్ హాట్‌స్పాట్‌ల పరంగా.. అంటే సెక్స్ వర్క్ జరుగుతున్న స్థలాల సాంద్రతలో తెలంగాణ రాష్ట్రం అగ్రస్థానంలో ఉంది. ప్రతి హాట్‌స్పాట్‌లో సగటున 38 మంది మహిళా సెక్స్ వర్కర్లు ఉంటున్నారని అంచనా వేశారు. ఆ తర్వాత ఆంధ్రప్రదేశ్ రెండో స్థానంలో నిలిచింది. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాల తగ్గుదల వల్ల, అనేక మహిళలు ప్రత్యామ్నాయ ఆదాయ మార్గాల వైపు మొగ్గుచూపుతున్నారని భావిస్తున్నారు. అలానే ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన మహిళలు ఉద్యోగావకాశాలు లేకపోవడంతో ఈ వృత్తిలోకి వస్తున్నారని పేర్కొన్నారు. సెక్స్ వర్క్ చేసే మహిళల్లో హెచ్ఐవి, ఇతర లైంగిక వ్యాధుల వ్యాప్తి ప్రమాదం ఎక్కువగా ఉండటంతో.. సామాజిక ఆరోగ్య రంగానికి కూడా ఇది ఒక కీలకమైన ఛాలెంజ్ అవుతోందని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఇది కేవలం నంబర్లలో పెరుగుదల కాదని, ఆర్థిక, ఆరోగ్య, సామాజిక, మానవ హక్కుల కోణాల్లో సమగ్ర దృష్టి అవసరమని పలువురు ప్రముఖులు చెబుతున్నారు.

# మాన్‌సూన్ రియల్ ఎస్టేట్!

(1వపేజీ తరువాయి)విలువ చాలా ఎక్కువగానే ఉందని చెప్పవచ్చు. తక్కువ ఇళ్లు సేల్ అయినప్పటికీ దాదాపు రూ. 4 వేల కోట్లకు పైగానే విలువ గల అమ్మకాలు జరిగాయి. మేడ్చల్-మల్కాజ్‌గిరి, రంగారెడ్డితో పాటు సంగారెడ్డి లాంటి జిల్లాలో రియల్ ఎస్టేట్ దూసుకుపోతోంది. ఈ జిల్లాలో ప్రీమియం హౌస్‌ల అమ్మకాలు చాలా ఎక్కువ విలువతో జరిగాయి. ఈ ప్రాంతాల్లో కమర్షియల్ ఇళ్లకు డిమాండ్ బాగా పెరిగింది. హైదరాబాద్ నగరంలో మొత్తం ఇళ్ల రిజిస్ట్రేషన్లు సంఖ్య తగ్గినప్పటికీ, కోటి రూపాయల కంటే ఎక్కువ ధర ఉన్న ప్రీమియం ఇళ్లకు భారీగా రిజిస్ట్రేషన్లు జరిగాయి. ఈ విభాగంలో రిజిస్ట్రేషన్లు సంఖ్య ఏటా 2 శాతం పెరుగుతోంది. 2023లో దీని విలువ 17 శాతంగా ఉంది. ఏప్రిల్ 2025లో దీని విలువ 20 శాతంగా నమోదైంది. అంటే ఏడాదికేడాది ఈ సంఖ్య పెరుగుతూ వస్తోంది. భాగ్యనగరంలో మొత్తం రిజిస్ట్రేషన్లలో కోటి రూపాయల కంటే ఎక్కువ ధర ఉన్న ఇళ్ల వాటా కేవలం 20 శాతంగా నమోదైంది. అయినప్పటికీ ఏప్రిల్ 2025లో మొత్తం ఆస్తి రిజిస్ట్రేషన్ల విలువకు 51 శాతంగా నమోదైంది. దీని ప్రకారం చూసుకుంటే నికర విలువ ఏప్రిల్ 2024తో పోలిస్తే సంవత్సరానికి 14 శాతం పెరిగింది. కాగా మెజారిటీ రిజిస్ట్రేషన్లు వేయి నుంచి రెండు వేల చదరపు అడుగుల మధ్య ఉన్న ఇళ్లకు సంబంధించినవి. ఇక రెండు వేల చదరపు అడుగులకు పైగా ఉన్న ఇళ్లు కూడా భారీగానే వృద్ధిని నమోదు చేశాయి. ఈ ఇళ్లు మొత్తం రిజిస్ట్రేషన్లలో ఏప్రిల్ 2024లో 15 శాతం నుండి 18 శాతానికి పెరిగాయి. ఈ వివరాలను నైట్ ఫ్రాంక్ నివేదిక తెలిపింది. ఈ నివేదిక ప్రకారం.. మొత్తం రిజిస్ట్రేషన్లలో రంగారెడ్డి జిల్లా 48 శాతంతో అగ్రస్థానంలో నిలిచింది. మేడ్చల్-మల్కాజ్‌గిరి 36 శాతం వాటాతో రెండవస్థానంలో నిలవగా..మిగిలిన 15 శాతంతో హైదరాబాద్ జిల్లా మూడవ స్థానంలో నిలిచింది. హైదరాబాద్‌లో పడిపోయిన రియల్ ఎస్టేట్ బూమ్, వచ్చే 5 ఏళ్లు లేవడం కష్టమే.. ప్రధాన కారణాలు ఇవే.. ఇదిలా ఉంటే హైదరాబాద్ రియల్ ఎస్టేట్‌లో ప్రస్తుతం ఊపు రాకపోవడానికి ప్రధాన కారణాల్లో ఒకటి ఎక్కువ ధరలు. ఇప్పటికే అత్యధిక రేట్ల స్థాయికి హైదరాబాద్ మార్కెట్ చేరుకుంది.

## డేంజర్ బెల్స్!

(1వపేజీ తరువాయి)ఇప్పటికే 2024 ను హాటెస్ట్ ఇయర్ ఆఫ్ ది రికార్డుగా పేర్కొన్నారు. ట్రాఫికల్ ప్రాంతాల్లో ఈ ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతున్నాయి. నార్త్ అమెరికా, నార్త్ ఆఫ్రికా, యూరోప్, ఆసియాలోని కొన్ని ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు పెరిగాయి. 2020 నుంచి 2024 మధ్య లానినో వాతావరణ మార్పుల కారణంగా ఆర్కిటిక్ ఖండంలో మంచు కరిగి నీటిమట్టం భారీగా పెరిగిపోయింది. 2024-2029 మధ్య అధిక ఉష్ణోగ్రతలు కారణంగా 2024 రికార్డును అధిగమించడానికి 80 శాతం అవకాశం ఉందని తాజా నివేదిక వెల్లడించింది. గతేడాదితో పోల్చితే ఒక్క శాతం పెరిగినా మానవాళికి పెను ముప్పుగా భావించవచ్చని పేర్కొంది. పారిస్ వాతావరణ ఒప్పందం, 2015 ప్రకారం ప్రపంచ ఉపరితల ఉష్ణోగ్రతలు 1.5 డిగ్రీలకు మించకూడదని తీర్మానించాయి. కానీ రానున్న సంవత్సరాల్లో ఈ పరిధిని దాటే ప్రమాదం ఉంది. తీవ్రమైన ఉష్ణోగ్రతలు, కార్చిచ్చులు, తుపానులు, తీవ్రమైన వరదలు.. కారణంగా రానున్న ఐదేళ్లు మానవాళికి తీవ్ర విపత్తు పొంచి ఉందని %ఔమీ% తాజా నివేదిక స్పష్టం చేసింది.

## టెర్రరిస్టులకు అధికారుల సాయం

(1వపేజీ తరువాయి)తొలగించి కఠిన చర్యలు తీసుకున్నట్లు అధికార యంత్రాంగం పేర్కొంది. మంగళవారం తాజాగా తొలగించిన ముగ్గురు ప్రభుత్వ ఉద్యోగులకు ఉగ్రవాద సంస్థలతో సంబంధాలు ఉన్నాయి. పోలీసులు విధుల నుంచి తొలగించిన వారిలో మాలిక్ ఇష్ ఫక్ నజీర్(పోలీసు కానిస్టేబుల్), అజాజ్ అహ్మద్(టీచర్), వసీమ్ అహ్మద్ ఖాన్(జూనియర్ అసిస్టెంట్) ఉన్నట్లు అధికారులు తెలిపారు. వీళ్లంతా లష్కర్ ఏ తోయిబా, హిజ్ బుల్ ముజాహిదీన్ లాంటి ఉగ్ర సంస్థలకు గూఢచారులుగా పనిచేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. అంతేకాక పహల్గాం ఉగ్రావాదులతోనూ ఈ ముగ్గురు ఉద్యోగులకు సత్సంబంధాలు ఉన్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. పహల్గాం ఉగ్రవాదులకు వీళ్లు సాయం చేసినట్లు పోలీసులు భావిస్తున్నారు. విధుల నుంచి తొలగించి అరెస్ట్ చేశారు. వీళ్లను పూర్తిస్థాయిలో దర్యాప్తు చేస్తున్నారు. ఇప్పటికే యూట్యూబర్ జ్యోతి మల్హోత్రా లాంటి గూఢచారులను అధికారులు అరెస్ట్ చేశారు. మరికొంత మంది యూట్యూబర్లు, ప్రభుత్వ ఉద్యోగులపైనా కేంద్ర ప్రభుత్వం నిఘా పెట్టింది.

## కోరలు చాస్తున్న కరోనా

(1వపేజీ తరువాయి)చేస్తోంది. గడిచిన 24 గంటల్లోనే ఐదుగురు ఈ మహమ్మారికి బలయ్యారని వైద్యులు ప్రకటించారు.
ప్రస్తుతం దేశంలో మొత్తం 4,026 యాక్టివ్ కొవిడ్ కేసులు ఉండగా.. కేరళలో మాత్రమే యాక్టివ్ కేసుల సంఖ్య 1,416కి చేరింది. ఈరోజు ఇప్పటి వరకు కేరళలో 171 కొత్త కేసులు వెలుగుచూసినట్టు స్పష్టం అవుతోంది. మరోవైపు ఢిల్లీలో 393, మహారాష్ట్రలో 69 కొత్త కేసులు 494, పశ్చిమ బెంగాల్‌లో 372 యాక్టివ్ కేసులు ఉన్నట్టు తెలుస్తోంది. అయితే దేశంలో కోవిడ్ కేసుల పెరుగుదలకు ఒమిక్రాన్ సబ్ వేరియంట్లే కారణమని ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ (ఐసీఎంఆర్) డైరెక్టర్ జనరల్ రాజీవ్ బహల్ ధ్రువీకరించారు. ప్రస్తుతానికి ప్రజలు పరిస్థితిని గమనిస్తూ అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. నిపుణుల సూచనల మేరకు తగిన జాగ్రత్తలు పాటిస్తూ.. కొవిడ్ వ్యాప్తిని అరికట్టడంలో ప్రజలు సహకరించాలని అధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు.
కోవిడ్-19 1 వేరియంట్ కారణంగా రోగులకు జ్వరం, అలసట, తలనొప్పి గొంతు నొప్పి ఉన్నట్లు గుర్తించామన్నారు. అయితే ప్రస్తుతం వ్యాప్తి చెందుతున్నకొత్త వేరియంట్‌లు.. గతంలో ఉన్న వాటి కంటే ఎక్కువ వ్యాప్తి చెందేలా లేవని అంటున్నారు.

## అక్షరాలా లక్ష రూపాయాలు

(1వపేజీ తరువాయి)అత్యధికమని మార్కెట్ వర్గాలు పేర్కొంటున్నాయి. గతంతో పోలిస్తే ఇది గణనీయమైన పెరుగుదల అని నిపుణులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది ఏప్రిల్ 22వ తేదీన 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,00,015 వద్ద గరిష్ఠ స్థాయిని తాకింది. ఇప్పుడు ఆ రికార్డును బ్రేక్ చేసి బులియన్ మార్కెట్‌లో కొత్త రికార్డును క్రియేట్ చేయడం హాట్ టాపిక్ గా మారింది. ప్రస్తుతం పెళ్లిళ్ల సీజన్ కారణంగా బంగారం కొనుగోళ్లు పెరగడంతో రానున్న రోజుల్లో ఈ ధరలు మరింత పెరిగే ఛాన్స్ ఉందని అంటున్నారు. అంతే కాకుండా అంతర్జాతీయ మార్కెట్‌లో బంగారం ధరలు పెరగడం, డాలర్‌తో రూపాయి మారకం విలువలో చోటుచేసుకుంటున్న హెచ్చుతగ్గులు, పెరుగుతున్న ద్రవ్యోల్బణం సహా ఇతర కారణాలు సైతం ధరలను ప్రభావితం చేస్తుందని అంటున్నారు.

## జైషే మహ్మద్ కీలక ఉగ్రవాది ఖతం

**సింధ్-నవభూమి:** భారత్‌ను నాశనం చేస్తా.. ధ్వంసం చేస్తానంటూ బెదిరింపులకు పాల్పడిన జైష్ ఏ మహమ్మద్ ఉగ్రవాది మౌలానా అబ్దుల్ అజీజ్ ఎసార్ పాకిస్థాన్ లో అనుమానాస్పదంగా మృతి చెందాడు. పాకిస్థాన్ లోని సింధ్ జిల్లాలో ఈ ఘటన జరిగింది. అజీజ్ మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది. అజీజ్ మృతికి సంబంధించిన వార్త పలు అంతర్జాతీయ ఛానెళ్లలో ప్రసారం అవుతోంది.
జైషే ఏ మహమ్మద్ కీలక ఉగ్రవాది మౌలానా అజీజ్ ఎసార్ పాకిస్థాన్ లోని సింధ్ ప్రావిన్స్ లో మృతి చెందాడు. అనుమానాస్పద రీతిలో అజీజ్ హతం అయ్యాడు. భారత్ లో ఉగ్రమూకలు జరిపిన అనేక దాడుల్లో అజీజ్ హస్తం ఉన్నట్లు నిఘా వర్గాలు వెల్లడించాయి. పాకిస్థాన్ మీడియా కథనాల ప్రకారం అజీజ్ జూన్ 2న మృతి చెందాడు.
అజీజ్ స్వస్థలం అష్రఫ్ వాలా గ్రామం, కల్లూర్ కోట్, భక్కర్ జిల్లా. జైషే ఏ మహమ్మద్ సంస్థ ప్రకారం అతడు హార్ట్ ఎటాక్ తో మృతి చెందాడట. కానీ ఆయన శరీరంపై బుల్లెట్ గాయాలున్నట్లు తెలుస్తోంది. అయితే అధికారిక వర్గాల ప్రకారం ఆయన మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది.
అయితే పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత్ చేపట్టిన ఆపరేషన్ సింధూర్ లో అజీజ్ కు సంబంధించి కీలకమైన ఉగ్రస్థావరం కూడా పూర్తిగా ధ్వంసమైనట్లు సమాచారం. ఈ క్రమంలో భారత్ ను బెదిరిస్తూ అజీజ్ చేసిన వ్యాఖ్యలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ గా మారాయి. అయితే ఈ ఘటన జరిగిన కొన్ని రోజులకే ఆయన హతం కావడం గమనార్హం. భారత్ ను ముక్కలు ముక్కలుగా చేస్తానంటూ అజీజ్ సంచలన వ్యాఖ్యలు చేశాడు. భారత్ పై బాంబుల దాడి చేస్తామని హెచ్చరించాడు. భారత్ ను ముక్కలు చేస్తానని.. కుక్క చావు చచ్చాడు అంటూ సామాజిక మాధ్యమాల్లో నెటిజెన్లు కామెంట్స్ చేస్తున్నారు. ఉగ్రవాదులను ఏరి పారేయడంలో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ సింధూర్ కార్యక్రమాన్ని ప్రశంసిస్తున్నారు. ఆపరేషన్ సింధూర్ కార్యక్రమం వల్లనే ఉగ్రవాదులు హతం అవుతున్నారని కామెంట్స్ చేస్తున్నారు.

## 16 మంది మావోయిస్టుల లొంగుబాటు



చర్ల- నవభూమి: ఛత్తీసగఢ్‌లోని సుకుమా జిల్లా ఎస్పీ కిరణ్ చవాన్ ఎదుట సోమవారం 16 మంది మావోయిస్టులు లొంగిపోయారు. వీరందరిపై సుమారు రూ.26 లక్షల రివార్డు ఉంది. లొంగిపోయినవారిలో సెంట్రల్ రీజనల్ కమిటీకి చెందిన రిటా అలియాస్ సుక్కీ, రాహుల్ పునెం, లెకం లఖ్మా ఉన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ లొంగిపోయిన మావోయిస్టుల్లో పీఎల్‌జీఏ చెందిన ఇద్దరు మోస్ట్ వాంటెడ్ ఉన్నారని, గతంలో ఛత్తీసగఢ్‌లో జరిగిన పలు విధ్వంసకర ఘటనలు, దాడుల్లో నిందితులుగా ఉన్నారని తెలిపారు. తాజాగా లొంగిపోయినవారిలో 9 మంది మావోయిస్టులు చింతలనూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కెర్లపెండ గ్రామానికి చెందినవారు. వీరి లొంగుబాటుతో కెర్లపెండ గ్రామం మావోయిస్టుల నుంచి విముక్తి పొందింది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం తరఫున కోటి రూపాయల అభివృద్ధి పనులను గ్రామంలో చేపట్టనున్నారు.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
3
హైదరాబాద్
బుధవారం
04 । జూన్ । 2025

## ఆపరేషన్ సిందూర్ విజయం తర్వాత - నిజం ఏంటి?

ఆపరేషన్ సిందూర్ విజయానికి దేశం మోజులో ఉన్న సమయంలో, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మాటల దాడి మరింత ఉగ్రరూపం దాల్చింది. సాధించిన విజయాన్ని చర్చించాల్సిన చోట, పాకిస్థాన్‌పై మరింత ఘాటు వ్యాఖ్యలతో ప్రజల్లో ఉత్సాహం నింపే ప్రయత్నం సాగుతోంది. ఇది దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ప్రశ్న ఇదే ం విదేశీ వ్యూహాల కన్నా, ఇది స్వదేశీ ఓటర్లను లక్ష్యంగా చేసుకున్న ఒక వ్యూహమా?ఆపరేషన్ సిందూర్ విజయానికి దేశమంతా మేళతాళాలు మోగిస్తుంటే, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఉపయోగిస్తున్న ఉగ్రభాష ప్రజలను ఆశ్చర్యానికి గురిచేస్తోంది. పాకిస్థాన్‌పై విజయం సాధించినట్టు కేంద్రం ప్రకటించినప్పటికీ, మోదీ వ్యవహారశైలి అసాధారణంగా మారినట్టు విశ్లేషకులు వ్యాఖ్యానిస్తున్నారు. సాధించిన విజయాన్ని సూటిగా వినిపించక, రోజు విడిచి రోజు తీవ్ర స్వరం, గుండెలు బాదే ప్రసంగాలు ఎందుకు చేస్తున్నారు? అనే ప్రశ్న ఇప్పుడు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది.

ప్రధాని మోదీ ప్రసంగాల్లో వినిపించే సాంకేతికతా దూకుడు, దేశభక్తి కలగలిపిన సినీ డైలాగుల శైలికి విశేష స్పందన లభిస్తోంది. టీవీ ఛానళ్లకు, పత్రికలకు పతాక శీర్షికలు దొరుకేలా ఆయన పదేపదే కొత్త వ్యాఖ్యలతో ముందుకు వస్తున్నారు. అయితే ఇవన్నీ దేశవ్యాప్తంగా మద్దతుదారులకి ఉద్దేశించిన ప్రచార యంత్రాంగమేనని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

ఈ పరిణామాలన్నీ వచ్చే బీహార్ అసెంబ్లీ ఎన్నికలతో నేరుగా సంబంధం కలిగి ఉన్నాయని రాజకీయ పరిశీలకుల అభిప్రాయం. బీజేపీని ఏకైక అతిపెద్ద పార్టీగా గెలిపించాలన్న ఆరాటం మోదీ ప్రసంగాల్లో స్పష్టంగా కనిపిస్తోంది. ముఖ్యంగా, ప్రస్తుతం అధికారంలో ఉన్న జనతాదళ్ (యునైటెడ్) అధినేత నితీశ్ కుమార్ శారీరక, మానసికంగా మళ్లీ బాధ్యతలు చేపట్టగలరా అన్న సందేహాల మధ్య, బీజేపీ తనను తనంతట తానే తిరిగి రుజువు చేసుకోవాలనుకుంటోంది.

కుల సమీకరణలే ప్రధానంగా తీర్పు నిర్ణయించే బీహార్‌లో, బాహ్య సమస్యలపై హైపుని సృష్టించడం ద్వారా మోదీ ప్రజల దృష్టిని ఆంతర్య విషయాలనుంచి మళ్లించే ప్రయత్నం చేస్తున్నారని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. పాకిస్థాన్‌పై కఠిన వ్యాఖ్యలతో దేశభక్తిని కలిగించేలా మోదీ చేసిన ప్రసంగాలు, వాస్తవంగా ఓటర్ల హృదయాలను గెలుచుకోవడానికే గుణాత్మక మార్గమని రాజకీయ వ్యూహకర్తలు అభిప్రాయపడుతున్నారు.

ఇకనైనా ప్రజలు దేశవిదేశాల తేడాను గుర్తించి, అసలు సమస్యలపై దృష్టి పెట్టాలన్నది పౌరసమాజ వాదం. ఒకవేళ ఈ వాగాడంబర వ్యూహం విజయవంతమైతే, అది దేశ రాజకీయ శైలిలో మరో దశను సూచించగలదని విశ్లేషకుల అంచనా.

ఆపరేషన్ సిందూర్ తర్వాత ప్రధాని మోదీ ఉపయోగిస్తున్న భాష చాలా మందిని దిగ్భ్రాంతికి గురిచేస్తున్నది. ఆపరేషన్ సిందూర్‌లో పాకిస్థాన్‌పై విజయం సాధించినట్టు భారత్ ప్రకటించింది. ఆ తర్వాత మోదీ ఆ కీర్తికాంతుల్లో దర్జాగా ఓలలాడాలి. కానీ, అలా జరగడం లేదు. అందుకు విరుద్ధంగా రోజు విడిచి రోజు పాకిస్థాన్‌పై భారత్ కఠిన వైఖరి గురించి గుండెలు బాదుకుంటూ ఆవేశపూరిత ప్రసంగాలు ఎందుకు చేస్తున్నట్టు? మోదీ ఉపయోగిస్తున్న వైవిధ్యభరితమైన భాష అనాలోచితమైందిగా భావించడానికి వీల్లేదు. 32 దేశాలకు ఏడు అఖిలపక్ష ప్రతినిధివర్గాలతో దౌత్య రాయబారాలు పంపించిన తర్వాత అం దుకు భిన్నంగా ఈ ఆవేశకావేశాలు ఏమిటా? అని విస్మయం కలుగుతున్నది. మోదీ దూకుడు ను ప్రపంచ నేతలు సానుకూలంగా తీసుకోరు. అదేవిధంగా జైషే మహమ్మద్, లష్కరే తోయి బా వంటి ఉగ్రవాద సంస్థలకు ఆశ్రయం ఇవ్వ డం ద్వారా భారత్‌పై పాక్ యుద్ధం జరుపుతున్నదనే సందేశానికి తోడ్పాటునూ అందించరు.

మోదీ వాగాడంబరం స్థానిక ఒత్తిళ్లతో స్వదేశీ ప్రజల కోసం ఉద్దేశించినట్టుగా కనిపిస్తున్నది. ఇంతకూ ఏమిటవి? టీవీలకు, పత్రికలకు పతా క శీర్షికలు సమకూర్చాలనే దుగ్ధ కారణమా? ఆయన ఉపయోగిస్తున్న సినీ ఫక్కీ డైలాగుల కొత్తదనం పదేపదే ఉపయోగించే రొడ్డకొట్టుడు ప్రసంగాలు చేసే రాజకీయ నాయకుల కంటే మోదీని భిన్నంగా నిలబెడుతున్నది. ప్రతి ప్రసంగంలో ఆయన కథనాన్ని మార్చి మీడియాకు రోజుకో పతాక శీర్షికను సమకూరుస్తున్నారు. కీలకమైన బీహార్ ఎన్నికల్లో బీజేపీని ఏకైక అతిపెద్ద పార్టీగా గెలిపించాలన్న ఉద్దేశంతో మోదీ అలా మాట్లాడుతున్నారనేది మరో వివరణ. కీలకం ఎందుకంటే, జనతాదళ్ (యునైటెడ్) నేత నితీశ్‌కుమార్‌కు రాష్ట్రానికి మరో విడత సారథ్యం వహించే శారీరక, మానసిక క్షమత ఎంతమాత్రం లేనట్టుగా కనిపిస్తుండటం. ఏదేమైనప్పటికీ, బీహార్ ఎన్నికలు మాత్రం కుల సమీకరణాల ఆధారంగా జరుగుతాయి. కాబట్టి, మోదీ చేస్తున్న గుండెలు బాదుకునే ప్రసంగాలు ప్రధానంగా బీహార్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని చేస్తున్నవి కాకపోవచ్చు.

పాకిస్థాన్‌పై సైనిక చర్య ప్రారంభించిన భారత్.. పీవోకేను చేజిక్కించుకోలేదని మితవాదవర్గాలు అసంతృప్తితో ఉన్నాయి. భారత రక్ష ణ దళాలు విజయం సాధిస్తున్నాయని, పాక్ రక్షణ వ్యవస్థలను బద్దలు కొడుతున్నాయని మే 7-10 వరకు మీడియా సమావేశాల్లో ప్రభు త్వం చెప్తూ వచ్చింది. ఈ నేపథ్యంలో హఠాత్తు గా కాల్పుల విరమణకు అంగీకరించడం వారిని విస్మయానికి గురిచేసింది. కాల్పుల విరమణ అనేది పాకిస్థాన్ బెదిరిపోయి అడిగినందుకా లేక ట్రంప్ బెదిరింపులు, వాణిజ్య ప్రోత్సాహకాల కోసమా? అనే వివరణలతో వారికి నిమిత్తం లేదు. ఉన్నపళంగా యుద్ధాన్ని ఆపివేయడం వారికి నచ్చలేదు.

ఈ నేపథ్యంలో ప్రభుత్వ సైనిక, రాజకీయ వ్యూహం గురించి తన మద్దతుదారులను ఒప్పించేందుకు తగిన బహిరంగ వైఖరిని మోదీ రూపొందించుకోవాల్సిన అవసరం ఏర్పడింది. సైనిక చర్య కొనసాగుతుందని ఆయన ఇస్తున్న హామీ రెండు దేశాల మధ్య శత్రుత్వాన్ని, ఉద్రిక్తతలను పెంచుతుంది. ఆయన మద్దతుదారులు కోరుకునేది అదే. అందుకే 'సిందూర్'కు ఇప్పటికీ కొనసాగుతున్న మిలిటరీ ఆపరేషన్‌గానే ముద్రవేస్తున్నారు. చర్య కొనసాగుతున్నదని, దీర్ఘకాలిక యుద్ధం జరుగుతున్నదని భరోసా ఇస్తే మద్దతుదారుల్లో మోదీ తరహా దుందుడుకు నాయకత్వ శైలికి ప్రాసంగికత, ఆవశ్యకత ఉన్నాయన్న నమ్మకం ఏర్పడుతుంది. పార్లమెంటులో గుచ్చిగుచ్చి అడిగే ప్రశ్నలను తప్పించుకునేందుకు 'కొనసాగుతున్న ఆపరేషన్' వెనుక దాక్కునేందుకు వీలు కలుగుతుంది.


మితవాద మద్దతుదారుల వంటి వారి నుంచి వచ్చే స్వదేశీ ఒత్తిళ్లు రెండు దేశాల మధ్య మరో విడత సైనిక ఘర్షణకు దారితీస్తుందా? అనేది ఇక్కడ అసలు ప్రశ్న. ఈ నేపథ్యంలో ఈ దుందుడుకు మాటలు ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చి, శత్రుత్వాన్ని పెంచి, ఉద్రిక్తతలకు ఆజ్యం పోయకుండా చూడాల్సి ఉంది. ఎందుకంటే పహల్గాం పాకిస్థాన్‌లో లేదు.

# ప్రజాయుద్ధ నౌక గద్దర్ అవార్డులపై విమర్శలు

## ఒక్క అవార్డు కూడా గద్దర్ ఆలోచనకు దగ్గర లేదని ప్రజా సంఘాల ఆందోళనలు



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రజాయుద్ధనౌక , తాత్విక వేత్త , కవి, రచయిత, పేద ప్రజల గుండెచప్పుడు గద్దర్ పేరుపైన రాష్ట్ర ప్రభుత్వం తెలుగు సినీ అవార్డులను ప్రధానం చేస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జనవరి 2024 గద్దర్ జయంతి వేడుకలు సందర్భంగా రవీంద్రభారతిలో జరిగిన కార్యక్రమంలో ఆయన స్వయంగా పాల్గొని ప్రకటించారు. ఒక్కసారిగా సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటనతో ఒక్కసారిగా అందరూ ఉలిక్కిపడ్డారు . నా మాటే శాసనం సినీ పరిశ్రమకు ప్రతి ఏటా ఉగాదికి ఇచ్చే నంది పురస్కారాలు స్థానంలో గద్దర్ అవార్డులను ఇస్తామని ప్రకటించారు. ముఖ్యమంత్రి ప్రకటనతో అప్పటికే మిశ్రమా స్పందన వచ్చింది. అనేక కమిటీల తర్వాత మే 29 న 2024 సంవత్సరం రాని గాను గద్దర్ సినీ అవార్డులను ప్రముఖ సినీ నటి జయసుధ ప్రకటించారు గద్దర్ సినీ అవార్డులో పుష్ప 2 చిత్రంలో నటించిన అల్లు అర్జున్ కు ఉత్తమ అవార్డు ను, రజాకార చిత్రానికి కూడా అవార్డులు రావడంతో ఒక్కసారిగా ప్రజా సంఘాలు గద్దర్ అభిమానులు పూర్తిగా వ్యతిరేకిస్తున్నారు. పుష్ప సినిమా కథనం చుట్టూ చట్టానికి వ్యతిరేకంగా ఎర్రచందనం స్మగ్లర్ కు సంబంధించిన కథనం ఉండడంతో స్మగ్లర్ల కథకు నటించిన హీరో అల్లు అర్జున్ కు అవార్డు ప్రకటించడం తో గద్దర్ ను అవమానపరిచారని ఆందోళన చెందుతున్నారు . మరోవైపు జూన్ 30న ప్రముఖ సినీ హీరో మురళీమోహన్ 2014 - 2023 వరకు గద్దర్ సినీ అవార్డులను ప్రకటించారు. పేరు మాత్రమే గద్దర్ ఆయన ఆశయం ఆశయాలు సామాజిక కోణం అవార్డుల ఎంపికలు ఎక్కడ కనిపించడం లేదని విమర్శలు ప్రారంభమైనాయి .



గద్దర్ జీవితకాలం కుటుంబాన్ని వదిలేసి ప్రజల కోసం తన జీవితాన్ని త్యాగం చేశారని అంతటి మహానుభావుడు పేరుమీద ఒక ఎర్రచందనం స్మగ్లర్ కథానాయకుడు కి, చరిత్రను వక్రీకరించి తీసిన రజాకార్ సినిమాకి అవార్డు రావడం ఆందోళన వ్యక్తం చేస్తున్నారు . రాష్ట్ర ముఖ్యమంత్రి గద్దర్ పేరు మీద సినీ అవార్డులు ఇస్తామని ప్రకటించిన నాటి నుండే సినీ ప్రముఖుల నుండి అంతగా ఆసక్తి కనబరచలేదు, వారి నుండి మిశ్రమ స్పందన వచ్చింది . 2024 ఆగస్టు లో కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన పద్మ అవార్డుల గ్రహీతలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేసింది. ఈ సమావేశంలో గద్దర్ పేరుపైన సినీ అవార్డులు ఇస్తామంటే సినీ దిగ్గజాలు ముందుకు రావడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఆయన ఆందోళనతో సినీ ప్రముఖులు ప్రముఖ సినీ హీరో చిరంజీవితో పాటు కొందరు తప్పనిసరిగా రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం కనుక స్వాగతిస్తున్నామని ప్రకటించారు. నాటి నుండి కార్యాచరణ ప్రారంభమైంది ప్రముఖ నటి జయసుధ మరియు ఫిలిం డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దిల్ రాజు సారథ్యంలోని కమిటీల బృందాలు నిశితంగా పరిశీలించి ఏ రకమైన ఒత్తిడిలు లేకుండా అవార్డులకు ఎంపిక చేస్తామని జయసుధ ప్రకటించారు. కానీ వారు ఎంపిక చేసిన విధానంలో త్యాగాలకు నిజ జీవితాలకు దూరంగా ఉన్న సినిమాలకే అవార్డులు వచ్చాయని విమర్శిస్తున్నారు. గద్దర్ ఒక ప్రళయం , గద్దర్ ఒక యుద్ధం, గద్దర్ ప్రపంచ ఖ్యాతి ప్రవక్త , గాయకుడు ఒక సాధారణ జీవనం గడిపిన సగటు మనిషి చరిత్ర కలిగిన పేరుమీద అవార్డులు ఇచ్చే సమయంలో ఆయన ఖ్యాతిని దిగజార్చకుండా ఉండే సినిమాలకు నటులకు ఇతర సాంకేతిక నిపుణులకు ఇస్తే స్వాగతిస్తామని ప్రజా సంఘాలు చెప్తున్నారు . తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత గత పది సంవత్సరాలుగా సినిమా ఇండస్ట్రీకి నంది అవార్డులను ఇవ్వడం మానివేశారు . 2023 డిసెంబర్ లో వచ్చిన కాంగ్రెస్ పార్టీ ప్రజా పాలన ప్రభుత్వం గద్దర్ పేరు మీద సినీ అవార్డులు ఇస్తామని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి 31 జనవరి 2024 ప్రకటించారు . అవార్డుల విషయంలో అంత క్లారిటీగా సినీ నటులు , సినీ పరిశ్రమకు చెందిన పెద్దలు ఎవరు ముందుకు రాకపోవడంతో అనేక చర్చలు అనేక కమిటీలను వేశారు . ఫైనల్ గా అవార్డులు ప్రకటించిన తర్వాత ప్రజా సంఘాలు గద్దర్ అభిమానులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తెలంగాణ సినిమా అవార్డుల్లో గందరగోళం ఉమ్మడి రాష్ట్రంలో ఉన్నప్పుడు నంది పురస్కారాలు అందించేవారు . ఇప్పుడు ఒకే సినిమా రెండు రాష్ట్రాల్లో విడుదల అవుతుంది మరి ఒకే సినిమాకు రెండు వేరు వేరు చోట్ల అవార్డులు ఎలా ఇస్తారు. అవార్డుల కమిటీ చైర్మన్ మురళీమోహన్ కథనం ప్రకారం ఒక సంవత్సరం ఆంధ్రప్రదేశ్ , మరో సంవత్సరం తెలంగాణ ప్రభుత్వాలు ఇవ్వాలని కోరుతున్నారు. మరి అలాంటప్పుడు 2014 నుండి 24 వరకు తెలంగాణ ప్రభుత్వం ఒక్కరే ఎందుకు అవార్డులు ఇవ్వాలని ప్రశ్నిస్తున్నారు .

**తెలంగాణ ఉద్యమాన్ని వ్యతిరేకించిన సినీ ఇండస్ట్రీ**

తెలంగాణ ఉద్యమాన్ని తెలంగాణ ఏర్పాటును పూర్తిస్థాయిలో సినీ ఇండస్ట్రీ వ్యతిరేకించిందని ప్రజా సంఘాలు ఆరోపిస్తున్నాయి . ఇప్పటివరకు తెలంగాణ ఏర్పడి పది సంవత్సరాలు గడిచిన సినీ ఇండస్ట్రీ వాళ్ళు వారి లాభాల కోసం చూస్తున్నారు కానీ ప్రభుత్వానికి , తెలంగాణ ప్రజలకు ఏ రకంగా కూడా సహకరించడం లేదని విమర్శిస్తున్నారు. రుద్రమదేవి సినిమాలో నేను ఆడ ఉంటా ఈడ ఉంటా అన్నట్టుగా సినీ పరిశ్రమ వ్యవహారం ఉంది. సినీ పరిశ్రమ కూడా బాధ్యత ఉంది. కరోనా టైంలో ఒక్క చిరంజీవి మినహా ఎవ్వరు కూడా సేవా భావంతో పనిచేయలేదని విమర్శలున్నాయి . తెలంగాణ ప్రాంత మట్టిబిడ్డ సాంస్కృతిక లెజెండరీ దిగ్గజం గద్దర్ పేరు మీద ప్రకటించిన అవార్డుల్లో ఒక్కటి కూడా ఆయన ఆలోచన ఆశయానికి దగ్గరలేదని గద్దర్ అభిమానులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

-అస శ్రీరాములు
సీనియర్ జర్నలిస్ట్
9440037196

# యుద్ధం వస్తే వ్యాపారమేనా?


పహల్గామ్ ఉగ్ర దాడి తరువాత సంభవించిన పరిణామాలు విస్తృత చర్చకు దారితీశాయి. పాక్ ఆక్రమిత కశ్మీర్‌ను కూడా స్వాధీనం చేసుకోడమే తమ ధ్యేయమన్న బీజేపీ నాయకుల సారథ్యంలో భారత్ వెనక్కి తగ్గిందనే ప్రచారం సాగింది. దీనిని తుడిచిపెట్టడానికి ఆపరేషన్ సిందూర్ విజయాన్ని చాటుతూ దేశమంతా ఊరేగింపులు జరిగాయి. వాస్తవంలో పూర్తిస్థాయి యుద్ధం దరిదాపులకు వెళ్లిన భారత, పాకిస్థాన్‌లు ఉన్నపళంగా ఘర్షణలను విరమించుకున్నాయి. ఇది సిమ్లా ఒప్పందం మేరకు రెండు దేశాల మధ్య చర్చల ద్వారానే జరిగిందని తాజాగా ప్రకటించుకున్నప్పటికీ అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ చొరవతోనే యుద్ధం ఆగిందన్న సమాచారం మెరుపు వేగంతో వ్యాపించింది. అప్పుడు దానిని రెండు దేశాల పాలకులూ తక్షణమే ఖండించలేదు. యుద్ధమే జరిగితే సంభవించబోయే ఘోర పరిణామాల గురించి వివరించనక్కరలేదు. అటువంటి భయానక స్థితిని తొలగించినందుకు, భారత పాకిస్థాన్ పాలకులను ఇందుకు ఒప్పించినందుకు అమెరికా అధ్యక్షుడిని అభినందించడంలో తప్పు లేదు. అయితే ఇంతటితో యుద్ధ భాష ఆగకపోడమే ఆందోళనకరం. పరస్పరం పిప్పి, పిండి చేసుకోవాలన్న 'మీసాల' మెలివేత కొనసాగుతూనే ఉంది. ఇది రెండు దేశాల పాలకులు తమ ప్రజల్లో పొరుగు దేశం పట్ల ద్వేషాన్ని మరింతగా పెంచి రాజకీయంగా లాభపడడానికి పాటిస్తున్న వ్యూహమే. దీనివల్లనే శాశ్వత చర్చలకు ఆటంకం కలుగుతున్నది.

ఇక్కడే మరొక బాధాకర పరిణామం1971లో బంగ్లాదేశ్ అవతరణకు దారితీసిన యుద్ధంలో అమెరికాను సైతం ధిక్కరించిన ఇందిరాగాంధీతో మోదీని పోల్చుతున్నారు. తూర్పు, పశ్చిమ పాకిస్థాన్ల మధ్య తలెత్తిన ఆ యుద్ధం వల్ల లక్షలాదిమంది తూర్పు పాకిస్థానీయులు మన దేశంలోకి పారిపోయి రాడంతో ఇందిరాగాంధీ భారత దళాలతో ముక్తిబాహినిని సృష్టించి బంగ్లాదేశ్ అవతరణకు తోడ్పడ్డారు. అయితే ఆ యుద్ధం వల్ల సంభవించిన మానవ శోకం చెప్పనలవి కానిది. మోదీ పాకిస్థాన్‌ను ఆ విధంగా ఓడించ లేకపోయారని అనడం యుద్ధ పిపాసనే సూచిస్తున్నది. ఇది తమ ఓటు బలాన్ని తగ్గిస్తుందని, చేరువలో ఉన్న బిహార్ ఎన్నికల్లో దెబ్బ తింటామని బీజేపీ భయపడుతున్నది. అంతేగాని పూర్తి స్థాయి యుద్ధానికి వెళ్లకుండా నిగ్రహం పాటించినందుకు సంతోషించడం లేదు. ఆపరేషన్ సిందూర్ ద్వారా మోదీ పాకిస్థాన్ పీచమణిచారన్న అభిప్రాయాన్నీ బలంగా నాటుతున్నారు. పాకిస్థాన్‌ను మోకాళ్ళ మీదకు తెచ్చామని ఆయన కూడా ప్రకటించారు. ఈ అవకాశం, ఈ స్వేచ్ఛ తమకు ఇచ్చినందుకు భారత దళాలు ప్రధాని మోదీకి మొక్కుతున్నాయి అనేవారూ బయలుదేరారు. భారత్, పాకిస్థాన్‌ల మధ్య ఇంతవరకూ జరిగిన నాలుగు యుద్ధాల్లో అసంఖ్యాకంగా సైనికులు మరణించారు. ఆయుధాలకోసం రెండు దేశాలు విశేషంగా డబ్బు తగలబెట్టాయి. భారత ఉపఖండంలో రాజకీయం ఇప్పటికీ మతోన్మాదం ప్రాతిపదికనే కొనసాగుతున్న మాట కాదనలేని సత్యం. కశ్మీర్ పరిణామాలకూ అదే ఇంధనమవుతున్నది. హిందూత్వ రాజకీయాల మత కోణం దేశ ప్రజల మధ్య సృష్టిస్తున్న విభజన గురించి వివరించనక్కరలేదు. మతపరంగానో, సరిహద్దు వివాదం పరంగానో యుద్ధం తలెత్తితే అవతలి దేశాన్ని చీల్చి చెండాడాలని, దాన్ని నామరూపాలు లేకుండా చేసేయాలని పళ్ళు పటపటా కొరకడాన్ని అటూ ఇటూ గల ప్రజలకు అలవాటు చేశారు.భారత సైనిక దళాల మాజీ అధిపతి జనరల్ మనోజ్ ముకుంద్ నరవానే యుద్ధాన్ని గురించి కొద్ది రోజుల క్రితమే మంచి మాటలు చెప్పారు. యుద్ధాలు బాలీవుడ్ సినిమాలు కావన్నారు, యుద్ధాల్లో ఎంతమంది చనిపోతారో, మరెంతమంది వికలాంగులై జీవితాంతం ఎడతెగని వ్యథను అనుభవిస్తారో గుర్తు చేశారు. కురుక్షేత్రం లాంటి యుద్ధ గాథలు సినిమాల్లో, నాటకాల్లో చూడ్డానికే బాగుంటాయి. ఒకరినొకరు నరుక్కోడం, శత్రువు రొమ్ము చీల్చి రుధిరమ్ము తాగడం వాస్తవంలో ఎంతమాత్రం కోరదగినవి కావు. ఇప్పుడు సరిహద్దుల రక్షణలో కన్నార్పకుండా కాపలా కాస్తున్నవారిలో, యుద్ధాల్లో ప్రాణాలు విడుస్తున్నవారిలో అత్యధికులు పేద బహుజనులే. ఉపాధి కరువై పొట్ట కూటి కోసం సైన్యంలో చేరుతున్నవారే ఎక్కువమంది. పహల్గాం ఉగ్ర దాడి బహు హేయమైనది. ఈ ఉన్మాదులు భారత, పాకిస్థాన్‌లు చేరువ కాకుండా అన్ని తంత్రాలను ప్రయోగిస్తున్నారు. రెండు దేశాల మధ్య మతపరమైన దూరాన్ని పెంచి దాన్ని అధిగమించడానికి వీలు లేని స్థాయికి తీసుకువెడుతున్నారు. భారత వ్యతిరేక ఉగ్రశక్తులకు పాకిస్థాన్ సైన్యం అండదండలు లభిస్తున్నాయి. అది పాక్ ప్రేరిత ఉగ్రవాదమే. అయితే ఈ విషయాన్ని మనం నమ్ముతున్నంతగా మిగతా ప్రపంచం నమ్మడం లేదు. మిగతా దేశాలు భారత్, పాకిస్థాన్లను ఒకేలా చూస్తున్నాయి. ఈ విషయాన్ని భారత పాలకులు తెలుసుకోవాలి. ఆపరేషన్ సిందూర్ ద్వారా పాక్‌ను భారత్ గట్టి దెబ్బే తీసింది. అంతటితో ఆగకుండా పాకిస్థాన్ నిజస్వరూపాన్ని తెలియజేయడానికి దేశ దేశాలకు పార్లమెంటు సభ్యుల బృందాలను పంపించడం బాగుంది. అయితే అది కూడా రాజకీయ విభేదాలకు దారి తీయడం బాధాకరం. పాకిస్థాన్‌పై బలంగా విరుచుకుపడ్డాం గాని పహల్గాం దాడి ముష్కరులను కనుక్కోడంలో జాప్యం జరుగుతున్నది. వారెవరో స్పష్టంగా తెలిస్తే బాగుంటుంది. ఆధునిక ప్రజాస్వామ్య వ్యవస్థలని భావిస్తున్న దేశాల ప్రజలు యుద్ధోన్మాదంతో వూగిపోడం సరైనది కానే కాదు. ఇది రక్షణ ఖర్చును ఆకాశానికి చేర్చి ప్రజలను కనీస విద్య, వైద్యం కూడా దొరకని దారిద్ర్యంలో కూరుకుపోయేలా చేస్తుంది. వాస్తవానికి టెర్రరిజం సమస్య చాలా లోతైనది. ప్రపంచ పాలకులు ముఖ్యంగా అమెరికా ఇజ్రాయెల్ వంటి దేశాలు చిత్తశుద్ధితో ఆలోచిస్తే వాటి అసలైన మూలాలు కనిపిస్తాయి. భారత పాకిస్థాన్‌లకూ ఇదే వర్తిస్తుంది. టెర్రరిజం గాని, వామపక్ష ఉగ్రవాదం గాని ఊరకే ఆకాశం నుంచి ఊడిపడేవి కావు. మెజారిటీ, మైనారిటీలు హాయిగా శాంతియుత సహజీవనం చేస్తున్న చోట సెక్యులరిజం వర్ధిల్లుతున్న దేశంలో మతపరమైన మెజారిటీని మైనారిటీల మీదికి రెచ్చగొట్టడం ప్రజాస్వామ్యమనిపించుకోదు. పాక్‌కు జీలం నది నీటిని ఆపడం గాని, ఘర్షణలకు కారణమయ్యారని భావించి వారి ఇళ్లు కూల్చి తల మీద కప్పు లేకుండా చేయడం గాని మానవీయమైన పనులు కావు. కక్ష కక్షనే ఇస్తుంది. ఉగ్రవాదానికి అది కూడా దారి తీస్తుంది. మన దేశంలో అధిక సంఖ్యాకుల మతస్వామ్యం వంటిదే రాజ్యమేలుతున్నది. వక్ఫ్ బిల్లులో మోదీ ప్రభుత్వం తేదలిచిన మార్పులను సెక్యులర్ రాజ్యాంగ రక్షకురాలైన సుప్రీంకోర్టు తీవ్రంగా ప్రశ్నించడమే ఇందుకు నిదర్శనం. ఉగ్రవాదం క్రూరమృగం కంటే ప్రమాదకరమైనది. దాని నిజమైన మూలాలు తెలుసుకొని వాటిని నిర్మూలించినంతవరకూ పేట్రేగుతూనే ఉంటుంది. బలమైన శత్రువు నేరుగా బరి మీదికి వస్తాడు. తగిన బలం లేనివాడు దొంగదెబ్బ తీస్తాడు. హమాస్ ఒకసారి తమపై దాడి చేసిందని ఇజ్రాయెల్ గాజాలో ఇప్పటివరకు దాదాపు అరవై వేలమందిని హతమార్చింది. వారిలో ముక్కుపచ్చలారని పసి పిల్లలు, మహిళలే అధికులు. అయినా హమాస్ కాకపోతే మరో ఉగ్రవాద సంస్థ పుడుతూ ఉండడానికే ఆస్కారం ఎక్కువ. యుద్ధాలు అత్యంత ఖరీదైన ఆధునిక ఆయుధాల కొనుగోలును పెంచుతున్నాయి. దాని వల్ల కోట్లాది ప్రజలు బలవుతున్నారు. అమెరికన్ ఆయుధ కంపెనీల ఆదాయం ఆకాశానికి అంటుతున్నది. ఉక్రెయిన్‌కు ఆయుధ సరఫరా వల్ల 2024లో అమెరికన్ లాక్ హీడ్ కంపెనీ లాభాలు 14శాతం పెరిగాయి. ట్రంప్ పర్యటనలో అమెరికా నుంచి 152 బిలియన్ డాలర్ల ఆయుధాల కొనుగోలుకు సౌదీ అరేబియా ఒప్పందం కుదుర్చుకున్నది.

ఈ కొనుగోలును 600బిలియన్ డాలర్ల వరకూ తీసుకుపోడానికి ఒప్పందం కుదిరింది. భారతదేశం కూడా ఈ ఉచ్చులో చిక్కుకున్నది. ప్రధాని మోదీ అమెరికా ఆయుధ మార్కెట్లో చక్కర్లు కొడుతున్నారు. 2020 నుంచి 2025 వరకు భారతదేశం రక్షణ కోసం 350 బిలియన్ డాలర్లు ఖర్చు చేసింది.

# కళ్ళెం మన చేతుల్లో ఉండాలి

భక్తి



"ఈ శరీరాన్ని విడిచిపెట్టకముందే... అంటే జీవించి ఉన్నప్పుడే కామం, క్రోధం లాంటి ఉద్వేగాలను అదుపులో ఉంచుకోవాలి. అలా చేసిన సాధకుడే యోగి. అతనే సుఖంగా ఉంటాడు" అని శ్రీకృష్ణుడు భగవద్గీతలో...

కళ్ళెం మన చేతుల్లో ఉండాలి
గీతాసారం

"ఈ శరీరాన్ని విడిచిపెట్టకముందే... అంటే జీవించి ఉన్నప్పుడే కామం, క్రోధం లాంటి ఉద్వేగాలను అదుపులో ఉంచుకోవాలి. అలా చేసిన సాధకుడే యోగి. అతనే సుఖంగా ఉంటాడు" అని శ్రీకృష్ణుడు భగవద్గీతలో చెప్పాడు. అలాంటి స్థితిని సాధించాలంటే సంతోషం, దుఃఖంతో సహా అన్ని భావోద్వేగాల మీద మనకు అదుపు ఉండాలి. కానీ చాలాసార్లు వాటిని వేరే వ్యక్తులు మన భావోద్వేగాలను అదుపు చేస్తూ ఉంటారు. వారి ప్రభావానికి మనం లోనవుతూ ఉంటాం. దీనివల్ల అంతిమంగా మనకు కలిగేది దుఃఖమే. కాబట్టి 'భావోద్వేగాల కళ్ళాలు మన చేతుల్లో ఉన్నాయా? ఇతరుల చేతుల్లో ఉన్నాయా?' అనేది ఆత్మవిశ్లేషణ చేసుకోవాలి. అంతా మన అదుపులోనే ఉందని భావిస్తూ ఉంటాం. కానీ తరచుగా అవి ఇతరుల చేతుల్లో ఉంటాయి.అది స్నేహితుడు కావచ్చు, కుటుంబ సభ్యులు కావచ్చు, సహోద్యోగి కావచ్చు... వారి మనస్థితి, భావాలు, మాటలు, పొగడ్తలు, విమర్శలు మనల్ని సంతోషానికి లేదా బాధకు గురి చేస్తాయి. ఆహారం, పానీయాలు, భౌతిక వస్తువులు, అనుకూల , ప్రతికూల పరిస్థితులు, చివరకు మన గతం, భవిష్యత్తు కూడా ఇలాంటి ప్రభావాలకు కారణం అవుతూ ఉంటాయి.

"అంతరాత్మలోనే సుఖించే, ఆత్మజ్ఞాని అయిన సాంఖ్య యోగి... పరబ్రహ్మమైన పరమాత్మతో ఏకీకృతమై, అత్యున్నతమైన నిర్వాణస్థితిని పొందుతాడు. అలాగే నిశ్చల స్థితిలో మనస్సును పరమాత్మమీద లగ్నం చేసే బ్రహ్మవేత్తలు కూడా నిర్వాణాన్ని పొందుతారు" అని శ్రీకృష్ణుడు వివరించాడు. "కామాన్ని, మోహాన్ని జయించి, క్రోధాన్ని అదుపులో పెట్టుకోవడమే మనకు మనం చేసుకొనే సాయం.ఇది సాధించిన తరువాతే సర్వప్రాణి హితం... అంటే ఇతరుల పట్ల దయగా వ్యవహరించడం, వారికి సహాయం చేయడం సాధ్యమవుతుంది" ఆయన స్పష్టం చేశాడు.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
4 | హైదరాబాద్
బుధవారం
04 । జూన్ । 2025



## పశ్చిమబెంగాల్‌లో కొత్తగా 41 మందికి కరోనా పాజిటివ్



**కోల్‌కల్తా-నవభూమి:**పశ్చిమబెంగాల్‌లో కరోనా మహమ్మారి వేగంగా విస్తరిస్తోంది. ఆ రాష్ట్రంలో ఒక్కరోజే కొత్తగా 41 మందికి కరోనా పాజిటివ్‌గా తేలింది. అదేవిధంగా కరోనాతో చికిత్స పొందుతున్న ఒక మహిళ ప్రాణాలు కోల్పోయింది. పశ్చిమబెంగాల్ ఆరోగ్య శాఖ అధికారులు ఈ విషయాన్ని వెల్లడించారు.హౌరా సిటీకి చెందిన ఒక మహిళకు కరోనా సోకడంతో కోల్‌కతాలోని ఓ ఆస్పత్రిలో చేరింది. ఆమెకు కరోనాతోపాటు హృదయ, మూత్రపిండ సంబంధ అనారోగ్య సమస్యలు కూడా ఉన్నాయని, చికిత్స పొందుతూ సోమవారం రాత్రి ఆమె మరణించిందని వైద్యులు తెలిపారు. కొత్తగా నమోదైన కరోనా కేసులతో కలిపి ఆ రాష్ట్రంలో మొత్తం కేసుల సంఖ్య 372కు చేరింది.

గడిచిన 24 గంటల్లో 11 మంది కరోనా పేషెంట్‌లు ఆ మహమ్మారి బారి నుంచి కోలుకున్నారని, కొత్తగా 41 మందికి కరోనా పాజిటివ్ వచ్చిందని, ప్రస్తుతం రాష్ట్రంలో కరోనా పేషెంట్‌ల సంఖ్య 372కు పెరిగిందని పశ్చిమబెంగాల్ ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ వెల్లడించింది.

## ఒకే విద్యార్థిని కోసం సర్కారు బడి..



**చెన్నై- నవభూమి:** తమిళనాడులోని రామనా థపురం జిల్లా తిరువాడనై యూనియన్ పరిధిలోని తలిర్‌మరుంగూర్ గ్రామంలో ఒకే విద్యార్థిని కోసం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల నడుస్తోంది. తిరువాడనై యూనియన్‌లో 112 ప్రభుత్వ, ఎయిడెడ్ ప్రాథమిక, మాధ్యమిక పాఠశాలలున్నాయి. వేసవి సెలవుల అనంతరం సోమవారం ఉదయం పాఠశాలలు పునఃప్రారంభమయ్యాయి. ఈ నేపథ్యంలో తొండి సమీపంలోని తలిర్‌మరుంగూర్ గ్రామంలో ఉన్న ప్రభుత్వ మాధ్యమిక పాఠశాల కూడా ప్రారంభమైంది.ఈ పాఠశాలలో గత ఐదేళ్ళుగా విద్యార్థులెవరూ చేరనందున గత ఏడాది 5వ తరగతిలో ఒక విద్యార్థి, 2వ తరగతిలో ఒక విద్యార్థి ఇద్దరు మాత్రమే చదువుకున్నారు. ఈ విద్యాసంవత్సరం 5వ తరగతి పూర్తయిన విద్యార్థి అక్కడి నుండి 6వ తరగతిలో చేరారు. ఇందువల్ల 2వ తరగతి నుండి 3వ తరగతికి వెళ్ళిన ఆ ఒక్క విద్యార్థిని మాత్రమే ప్రస్తుతం చదువుతోంది. ఈ సర్కారు బడిలో ఒక ప్రధానోపాధ్యాయుడు, ఒక టీచర్ మాత్రమే పనిచేసిన నేపథ్యంలో గత నెల ప్రధానోపాధ్యాయుడు పదవీవిరమణ పొందాడు. రాష్ట్ర వ్యాప్తంగా సోమవారం పునఃప్రారంభమైన పాఠశాలల్లో అడ్మిషన్లు జరుగుతుండగా, తలిర్‌మరుంగూర్ గ్రామ ప్రభుత్వ పాఠశాలలో మాత్రం ఒక్క విద్యార్థి కూడా చేరలేదు. తమ గ్రామంలోవున్న ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు లేకుంటే పాఠశాలను మూసివేస్తారనే కారణంగా పైవేటు పాఠశాలలో 1వ తరగతి చదువుకుంటున్న తన కుమార్తెను ఈ పాఠశాలలో చదివిస్తున్నట్లు ఆ విద్యార్థి తల్లిదండ్రులు తెలిపారు. పాఠశాలలో విద్యార్థులెవరూ లేనందువల్ల తన కుమార్తె కూడా భయపడుతోందని, ఇప్పటికైనా విద్యార్థులను చేర్పించేందుకు విద్యాశాఖ అధికారులు చర్యలు చేపట్టాలని తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.

## అమ్మో.... మేనమామ సారెనా... మజాకా..




**చెన్నై- నవభూమి:** వివాహ వేడుకల ఊరేగింపునకు ధీటుగా మేనమామ తీసుకొచ్చిన సారే ఊరేగింపు చూపరులను ఆశ్చర్యానికి గురిచేసింది. అక్క కుమార్తె, కుమారుడికి చెవులు కుట్టే సమయంలో మేనమామ సారె సమర్పించడం ఆనవాయితీ. ఆ ప్రకారం, దిండుగల్ గాంధీ మార్కెట్లో టమోటా వ్యాపారి అయిన సంతోష్ కుమారుడు యువన్ శ్రీహరికి చెవులు కుట్టే వేడుక దిండుగల్‌లోని ఓ కల్యాణ మండపంలో జరిగింది. యువన్ శ్రీహరి మేనమామ ముత్తుకుమార్ ప్రేమతో సారెగా 1,008 రకాల వస్తువులు తీసుకొచ్చారు.పది ఎడ్ల బండ్లు, పది ట్రాక్టర్లలో ఏడాదికి సరిపడా నిత్యావసర సరుకులు, బియ్యం బస్తాలు, స్వీట్లు, కూరగాయాలు, పలురకాల పండ్లు, కొత్త బట్టలు, నగదు, బంగారు ఆభరణాలతో ఊరేగింపుగా తరలివచ్చాడు. ఊరేగింపు ముందు పల్లకీలో యువన్ శ్రీహరిని కూర్చుండబెట్టి గరగాట్టం, ఓయిలాట్టం, చెక్క గుర్రం సహా పలు ప్రదర్శనలతో తరలివచ్చారు.అలాగే, పొన్ ముత్తురామలింగ దేవర్, ముఖ్యమంత్రి స్టాలిన్, నటులు రజనీకాంత్, కమల్‌హాసన్(, వడివేలు తదితర రుల వేషధారణతో కళాకారులు ముందు నిలిచారు. సారెలో మూడు జల్లికట్టు ఎద్దులు, గొర్రెలు, మేకలు కూడా ఉన్నాయి. అనంతరం యువన్ శ్రీహరిని మేనమామ ముత్తుకుమార్ ఒడిలో కూర్చోబెట్టి చెవులు కుట్టే కార్యక్రమం నిర్వహించారు.

## పాఠశాలలో ఏసీ తరగతి గది ప్రారంభం




**చెన్నై-నవభూమి:** స్థానిక విల్లివాక్కంలోని కనకదుర్గా తెలుగు పాఠశాలల ట్రస్ట్ (ఎస్‌కే డీటీ) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన ఏసీ తరగతి గదిని ఆ పాఠశాల చైర్మెన్, ఏఐటీఎఫ్ అధ్యక్షుడు డాక్టర్ సీఎంకే రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఈ విద్యాసంవత్సరానికి సంబంధించి అడ్మిషన్లకు శ్రీకారం చుట్టి, కొత్తగా పాఠశాలలో చేరిన చిన్నారులకు పూలదండలు వేసి, టీచర్లతో కలిసి ఆహ్వానం పలికారు.ప్రధానోపాధ్యాయురాలు ఎస్.రేణుక నేతృత్వంలో 1 నుండి 5వ తరగతి వరకు చదువుకుంటున్న విద్యార్థులందరికీ పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, యూనిఫాంపంపిణీ చేశారు. ఈ సందర్భంగా తరగతి గది కి ఏసీ సదుపాయం కల్పించిన 'నమో గాడ్' ట్రస్టీ డాక్టర్ ఎన్.నాగభూషణం, డాక్టర్ సీఎంకే రెడ్డిలను ఘనంగా సన్మానించారు. అనంతరం ఎస్‌కేడీటీ మహోన్నత పాఠశాలలో 6 నుండి ప్లస్‌టూ వరకు చదువుకుంటున్న విద్యార్థులకు పాఠ్యపుస్తకాలతో పాటు నిఘంటువు, యూనిఫాం ఉచితంగా అందజేశారు.

## 4 వేలకు పెరిగిన కొవిడ్ కేసులు




**న్యూఢిల్లీ-నవభూమి:** దేశవ్యాప్తగా కొవిడ్ మహమ్మారి విజృంభిస్తోంది. కొవిడ్ పాజిటివ్ కేసుల సంఖ్య 3,758 నుంచి క్రమేపీ పెరిగి సోమవారం నాటికి 3,961కి చేరింది. ఈమేరకు కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ఓ ప్రకటన చేసింది. పశ్చిమ బెంగాల్‌లో పాజిటివ్ కేసుల వ్యాప్తి ఎక్కువగా ఉంది. మొత్తం కేసుల సంఖ్య 280కి చేరింది. ఢిల్లీ, కేరళ, గుజరాత్‌లలో కూడా గుర్తించతగ్గ స్థాయిలో ఈ పెరుగుదల ఉంది. తాజాగా కర్ణాటక, కేరళలో ఇద్దరు మరణించారు. దీంతో కొవిడ్ మరణాల సంఖ్య 28కి చేరింది. కొవిడ్ వ్యాప్తికి ప్రధానంగా ఎన్‌బీ.1.8.1, ఎల్ఎఫ్ 7 రకాలే కారణమని మంత్రిత్వ శాఖ ప్రకటించింది.

# అయోధ్యలో పునఃప్రాణప్రతిష్ఠ



**అయోధ్య-నవభూమి:**అయోధ్యలోని శ్రీరామ జన్మభూమి ఆలయం మరోసారి ఆధ్యాత్మిక శోభతో వెలిగిపోతోంది. బాలరాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ గతేడాది విజయవంతంగా పూర్తి కాగా.. ఇప్పుడు అయోధ్యలో మరోసారి ప్రాణప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. అయితే ఇప్పుడు ఆలయం మొదటి అంతస్తులో రామ దర్బార్ ప్రాణ ప్రతిష్ఠ, ఇతర దేవాలయాల ప్రతిష్ఠాపన వేడుకలు సాగుతున్నాయి. ఈ పవిత్ర క్రతువు మంగళవారం ఉదయం 6:30 గంటలకు ప్రారంభం కాగా.. ఈనెల 5వ తేదీ వరకు కొనసాగనుంది. ఈ వేడుకల్లో ఉత్తర్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ పాల్గొననున్నారు.రామ దర్బార్ వేడుకలతో పాటు.. జూన్ 5వ తేదీన అయోధ్యలో సరియు జయంతి జన్మోత్సవ్ వేడుకలను నిర్వహించనున్నారు. ఈ సరియు జయంతి జన్మోత్సవాన్ని సీఎం యోగి ఆదిత్యనాథ్ జ్యోతిని వెలిగించి ప్రారంభిస్తారని శ్రీరామ్ వల్లభ్‌కుంజ్ అధిపతి మహంత్ రాజ్‌కుమార్ దాస్ మహారాజ్ వెల్లడించారు. అదే రోజు జరిగే రామ దర్బార్ ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమానికి కూడా యోగి ఆదిత్యనాథ్ హాజరు కానున్నట్లు తెలిపారు.


ఇక అయోధ్య రామాలయంలో జూన్ 5వ తేదీ నుంచి 11వ తేదీ వరకు వారం రోజుల పాటు సరియు జయంతి జన్మోత్సవ్ వేడుకలు జరుగుతాయి. ఆంజనేయ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఈ వేడుకల్లో భక్తి కార్యక్రమాలు, వివిధ పూజలు, ఆధ్యాత్మిక ఉపన్యాసాలు భక్తులను కనువిందు చేయనున్నాయి. జూన్ 11వ తేదీన పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక హారతి కార్యక్రమం నిర్వహించబడుతుందని మహంత్ రాజ్‌కుమార్ దాస్ మహారాజ్ తెలిపారు.ఇక ఆంజనేయ సేవా సమితి అధ్యక్షుడు మహంత్ శశికాంత్ దాస్ మాట్లాడుతూ.. సీఎం యోగి ఆదిత్యనాథ్ ఈ వేడుకకు హాజరు కావడం తమకు చాలా ప్రత్యేకమని తెలిపారు. ఈ సందర్భంగా రామ భక్తులందరూ ఈ కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు. యోగి ఆదిత్యనాథ్ నాయకత్వంలో అయోధ్య అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయని.. ఈ క్రమంలోనే ఆయన ఏవైనా కీలక ప్రకటనలు చేయవచ్చని మహంత్ శశికాంత్ దాస్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా అయోధ్య అధికారులు ఇప్పటికే రామ్‌పథ్, ధర్మ 14 కోసి మార్గ్ వంటి కీలక మతపరమైన మార్గాల్లో మాంసం విక్రయాలపై నిషేధం విధించే చర్యలు ప్రారంభించారు. సీఎం యోగి ఆదిత్యనాథ్ జనతా దర్బార్‌లో ఫిర్యాదులు వచ్చిన తర్వాత దుకాణదారులకు ఈ నోటీసులు జారీ చేశారు. అయోధ్య మేయర్ గిరీష్ పతి త్రిపాఠి శనివారం మాట్లాడుతూ.. మద్యం నిషేధం కూడా ప్రణాళికలో ఉందని.. ఈ విషయంపై చాలా కాలంగా చర్చలు జరుగుతున్నాయని తెలిపారు. అయోధ్యను పవిత్ర నగరంగా, ఆధ్యాత్మిక కేంద్రంగా మార్చేందుకు ఈ చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన స్పష్టం చేశారు.

## ఆపరేషన్ సిందూర్ ప్రభావం-పాక్‌కి భారీ నష్టం




**పహల్గాం-నవభూమి:**పహల్గామ్ ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత సైన్యం చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌తో దాయాది పాకిస్థాన్‌కు భారీ నష్టమే జరిగింది పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో అధికారికంగా ప్రకటించిన లక్ష్యాల కంటే కనీసం మరో ఎనిమిది ప్రాంతాలను కూడా టార్గెట్ చేసింది. ఈ విషయాన్ని సాక్షాత్తు పాకిస్థాన్ ప్రభుత్వపు పత్రాలు వెల్లడించడం గమనార్హం. ఆ దస్త్రాల్లోని మ్యాప్స్ ప్రకారం.. పేషావర్, జహంగ్, సింధ్‌లో హైదరాబాద్, పంజాబ్‌లోని గుజరాత్, గుజ్రన్‌వాలా, భవళ్‌నగర్, అటాక్, చోర్ వంటి నగరాలలోని ఉగ్రవాది శిబిరాలను ధ్వంసం చేసినట్టు చూపుతున్నాయి. ఆపరేషన్ సిందూర్ తర్వాత భారత సైన్యం తన అధికారిక ప్రకటనల్లో వీటి గురించి ప్రస్తావించలేదు. వాస్తవానికి పాకిస్థాన్‌లో భారత్ చాలా లోతైన దాడులు నిర్వహించినట్టు ఈ తాజా డాక్యుమెంట్లు బయటపెట్టాయి.భారత మిలిటరీ ఆపరేషన్స్ డైరెక్టర్ జనరల్ ప్రెస్ బ్రీఫింగ్‌లలో ఎనిమిది అదనపు ప్రాంతాలు (పై పేర్కొన్న నగరాలు) గురించి ఎలాంటి సమాచారం వెల్లడించలేదు. అయితే, భారత్ సైన్యం అనుకున్న దానికంటే చాలా లోతుగా దాడులు జరిపినట్టు తాజా పత్రాలు చాటిచెప్తున్నాయి. మే 7న భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్ అనంతరం.. ఇరు దేశాల మధ్య నాలుగు రోజుల పాటు సైనిక ఘర్షణలు కొనసాగాయి. ఉగ్రవాద శిబిరాలపై భారత సైన్యం దాడులను పాకిస్థాన్ జీర్ణించు కోలేకపోయింది. ప్రతీకారంగా సరిహద్దుల్లోని సైనిక స్థావరాలు, పౌరులపై దాడికి యత్నించడంతో వాటిని భారత్ తిప్పికొట్టింది.పాక్ డ్రోన్లు, క్షిపణులు, యుద్ధ విమానాలను కూల్చివేసి.. దాని వైమానిక స్థావరాలు, రాడార్ సెంటర్లపై విరుచుకుపడింది. పాక్ డాక్యుమెంట్లు భారత్ దాడితో భారీ నష్టం జరిగిందనేది తేటతెల్లమయ్యింది. భారీ నష్టంతోనే పాకిస్థాన్ కాళ్లబేరానికి వచ్చి.. కాల్పులు విరమణ ఒప్పందం ప్రతిపాదనలు తీసుకొచ్చింది.ఇక, పాక్ పత్రాలు భారత్ దాడి ఎంత తీవ్రంగా ఉందో పూర్వాపరాలను బయటపెట్టాయి. ఇప్పటికే మాక్సర్ టెక్నాలజీస్ విడుదల చేసిన ఉపగ్రహ ఫోటోలు ఆపరేషన్ సిందూర్‌తో పాక్ వనరుల ఏమేరకు ధ్వంసమయ్యాయో స్పష్టంగా తెలియజెప్పాయి. బహావల్పూర్‌లోని జైషే మహమ్మద్ ప్రధాన కార్యాలయం, మురీద్కేలోని , లష్కరే తొయిబా శిక్షణ శిబిరం, ముజఫరాబాద్, కొట్లి, రావల్‌కోట్, చక్స్వారి, భింబర్, నీలం లోయ, జహ్లమ్, చక్వాల్ తదితర ప్రాంతాలపై దాడిచేసినట్టు భారత్ సైన్యం ప్రకటించింది.మే 7 తెల్లవారుజామున ఆపరేషన్ సిందూర్ ప్రారంభించి.. పాకిస్థాన్, పీఓకేలోని తొమ్మిది ఉగ్రవాద శిబిరాలను ధ్వంసం చేసింది. ఆ తరవాత, పాకిస్థాన్‌కు చెందిన 11 ఎయిర్ బేస్‌లను లక్ష్యంగా చేసుకుని దాడులు జరిపింది. పహల్గామ్ ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత్ ఈ ఆపరేషన్ చేపట్టింది. నూరు ఖాన్, రఫీక్వి, మురిద్, సుక్కర్, సియాల్‌కోట్, పస్రూర్, చూనియాన్, సర్గోదా, స్కర్దూ, భోలారి, జాకొబాబాద్ తదితర ప్రాంతాల్లోని వైమానిక స్థావరాలు, రాడార్ కేంద్రాలు ధ్వంసమయ్యాయి.

## చైనా నీటిని ఆపితే భారత్‌కు నష్టం జరిగే అవకాశం ఉందా?



**పహల్గాం-నవభూమి:**పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత్.. దాయాది దేశానికి సింధూ నదీ జలాలను ఆపేసిన విషయం అందరికీ తెలిసిందే. ముఖ్యంగా సింధూ నదీ జలాల ఒప్పందాన్ని రద్దు చేసుకున్నప్పటి నుంచి పాక్ తీవ్ర వ్యాఖ్యలు చేస్తోంది. భారత్‌ను భయపెట్టేందుకు విపరీతంగా ప్రయత్నిస్తోంది. ఈనేపథ్యంలోనే పాకిస్థాన్ మిత్ర దేశమైన చైనా బ్రహ్మపుత్ర నది నీటిని ఆపేస్తుందంటూ ప్రచారం చేస్తోంది. అయితే తాజాగా దీనిపై అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ స్పందించారు. బ్రహ్మపుత్ర నీటిని ఆపేస్తే.. ఇండియాకు లాభం చేకూరుతుందా, నష్టం చేకూరుతుందా అనే దానిపై క్లారిటీ ఇచ్చారు. ముఖ్యంగా ఎక్స్ వేదికగా స్పందిస్తూ ఓ పెద్ద పోస్టునే పెటారు.సింధూ నదీ జలాల ఒప్పందం నుంచి భారత్ బయట పడ్డ తర్వాత పాకిస్థాన్.. ఇండియాకు బూచిని చూపించే ప్రయత్నం చేస్తుందని పోస్టులో రాసుకొచ్చారు. ఒకవేళ చైనా బ్రహ్మపుత్ర నీటిని భారత్‌కు రాకుండా ఆపేస్తే పరిస్థితి ఏంటంటూ చేస్తున్న ప్రచారంలో అసలు వాస్తవాలు ఇవేనంటూ వివరించే ప్రయత్నం చేశారు. ముఖ్యంగా బ్రహ్మపుత్ర నది భారత్‌లో ప్రవహించే కొద్దీ విస్తరిస్తుందని సీఎం హిమంత బిశ్వ శర్మ వెల్లడించారు. అయితే ఇది కుచించుకుపోదని.. చైనా నుంచి కేవలం 30 నుంచి 35 శాతం జలాలు మాత్రమే ఇండియాకు వస్తున్నాయన్నారు. వీటిల్లో చాలా వరకు మంచు కరగడం, టిబెట్‌లోని పరిమిత వర్షాల వల్లవల్ల లభిస్తాయన్నారు.ఇక మిగిలిన 65 నుంచి 70 శాతం నీరు భారత్ నుంచి వస్తోందని అన్నారు. అంతేకాకుండా అరుణాచల్ ప్రదేశ్, అస్సాం, నాగాలాండ్, మేఘాలయాలో రుతుపవనాల వల్ల కురిసే వర్షాలకు థాంక్స్ చెప్పాలని వ్యాఖ్యానించారు. శుభాంశ్రీ, లోహిత్, కమెంగ్, మానస్, ధన్ శ్రీ, జియా భరాలి, కోపిలి బ్రహ్మపుత్రకు ప్రధాన ఉపనదులు అని గుర్తు చేశారు. ఇవి మాత్రమే కాకుండా ఖాసీ గారో, జయంత హిల్స్ నుంచి కుల్సీ, కృష్ణాయ్, దిగారు నదుల నుంచి మిగిలిన జలాలు లభిస్తాయన్నారు. అవి భారత్-చైనా సరిహద్దుల్లో సెకనుకు 2 వేల నుంచి 3 వేల క్యూబిక్ మీటర్ల మేరకు నీరు ప్రవహిస్తుందని క్లారిటీ ఇచ్చారు. అదే అస్సాంలో రుతుపవనాల వల్ల ప్రతీ సీజన్‌లో 15 వేల నుంచి 20 వేల క్యూబిక్ మీటర్ల మేర నీరు ప్రవహిస్తుందని తెలిపారు.బ్రహ్మపుత్ర జలాల కోసం భారత్ ఎగువ నుంచి వచ్చే ప్రవాహం కోసం ఆధార పడాల్సిన అవసరం లేదని ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ తెలిపారు. అది వర్షాధారిత భారత నది అని.. భారత్‌లోకి వచ్చాకే అది మరింత బలపడుతుందని స్పష్టం చేశారు. అంతేకాకుండా ఇప్పటి వరకు పాకిస్థాన్ భయపెడుతున్నట్లుగా చైనా ఎక్కడా బెదిరింపులు చేయలేదని, బ్రహ్మపుత్ర నీటిని ఆపేస్తామని పేర్కొనలేదని అన్నారు. ఒకవేళ నీటిని ఆపినా అది భారత్‌కు చాలా లాభంగానే మారుతుందన్నారు. ముఖ్యంగా బ్రహ్మపుత్ర నీటిని ఆపడం వల్ల ప్రతీ ఏటా అస్సాంలో వచ్చే వరదలు తగ్గుతాయని, లక్షల మంది నిరాశ్రయులు కాకుండా ఉంటారని వెల్లడించారు. అలాగే పాకిస్థాన్ చాలా ఏళ్లుగా సింధూ జలాల ఒప్పందంలో లభించిన ప్రాధాన్యంతో భారత్‌ను దోచుకుంటుందని చెప్పారు. కానీ ఇప్పుడు ఇండియా తమకు రావాల్సిన హక్కును అడగ డంతో భయపడుతూ.. భయపెట్టే ప్రయత్నం చేస్తుందన్నారు. పాకిస్థాన్ ఓ విషయాన్ని గుర్తుంచుకోవాలని అన్నారు. బ్రహ్మపుత్ర నదితో కేవలం ఇండియాను నియంత్రించలేరని.. అది భౌగోళిక పరిస్థితు లతో, రుతుపవనాలతో బలోపేతమైందని హిమంత బిశ్వ శర్మ వ్యాఖ్యానించారు.

## మిజోరాంలో వర్షబీభత్సం.. 552 చోట్ల విరిగిపడ్డ కొండచరియలు



**న్యూఢిల్లీ-నవభూమి:**నైరుతి రుతుపవనాల ప్రభావంతో ఈశాన్య రాష్ట్రాల్లో ఎడతెరిపి లేకుండా భారీ వర్షాలు కురుస్తున్నాయి. సిక్కిం, అస్సాం, మణిపూర్, అరుణాచల్ ప్రదేశ్, త్రిపుర, మిజోరాం, నాగాల్యాండ్, మేఘాలయలో కుంభవృష్టి కురుస్తోంది. ఈ కుంభవృష్టి కారణంగా ఎక్కడికక్కడ కొండచరియలు విరిగిపడుతున్నాయి. ఈ వర్ష బీభత్సానికి ఈశాన్య రాష్ట్రాల్లో దాదాపు 34 మంది ప్రాణాలు కోల్పోయారు.గత 10 రోజుల్లో కురిసిన భారీ వర్షాల కారణంగా సంభవించిన ప్రమాదాల్లో మిజోరాంలో ఐదుగురు మరణించినట్లు రాష్ట్ర విపత్తు నిర్వహణ అధికారులు మంగళవారం తెలిపారు. చంపాయి జిల్లాలో ముగ్గురు, ఐజ్వాల్, సెర్చిప్ జిల్లాల్లో ఒక్కొక్కరు చొప్పున ప్రాణాలు కోల్పోయినట్లు చెప్పారు. కొండచరియలు విరిగిపడటం, ఆకస్మిక వరదల కారణంగా ఇళ్లు, గోడలు కూలిపోవడం వల్ల ఈ మరణాలు సంభవించినట్లు తెలిపారు.ఇక రాష్ట్రంలోని 552 చోట్ల కొండచరియలు విరిగిపడినట్లు విపత్తు నిర్వహణ అధికారులు వెల్లడించారు. 152 ఇళ్లు దెబ్బతిన్నాయనితెలిపారు. కొండచరియలు విరిగిపడటంతో పగుళ్ల కారణంగా 198 కుటుంబాలు తమ ఇళ్లను వదిలి సురక్షిత ప్రాంతాలకు తరలిపోయినట్లు చెప్పారు. మొత్తం 11 జిల్లాల్లో మయన్మార్‌తో సరిహద్దును పంచుకునే తూర్పు మిజోరాంలోని చంపాయి జిల్లాపై తీవ్ర ప్రభావం పడినట్లు పేర్కొన్నారు. ఇక్కడ 209 చోట్ల కొండచరియలు విరిగిపడినట్లు వివరించారు. తొమ్మిది ఇళ్లు దెబ్బతినగా.. 14 కుటుంబాలను ఖాళీ చేయించినట్లు చెప్పారు.ఇక సెర్చిప్ జిల్లాలో 75 చోట్ల కొండచరియలు విరిగిపడగా.. 27 ఇళ్లు దెబ్బతిన్నాయని, కొండచరియలు విరిగిపడటం, పగుళ్లు, వరదల కారణంగా 132 కుటుంబాలు తమ ఇళ్లను వదిలి వెళ్లిపోయినట్లు అధికారులు చెప్పారు. ఐజ్వాల్ జిల్లాలో 18 చోట్ల కొండచరియలు విరిగిపడ్డాయి. 13 ఇళ్లు కూలిపోయాయి. ఖాజ్వాల్ జిల్లాలో 75 చోట్ల కొండచరియలు విరిగిపడగా, లుంగ్లీ జిల్లాలో 60, దక్షిణ మిజోరాంలోని సియాహా జిల్లాలో 53 చోట్ల కొండచరియలు విరిగిపడినట్లు అధికారులు వెల్లడించారు. భారీ వర్షాల నేపథ్యంలో సైతువల్ జిల్లా మినహా రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాలలకు అధికారులు సెలవులు ప్రకటించారు. ఇక దక్షిణ జిల్లాలకు నిత్యావసర వస్తువులను తీసుకెళ్లే వందకు పైగా ట్రక్కులు సెర్చిప్‌లో చిక్కుకుపోయినట్లు అధికారులు తెలిపారు.

## పంజాబ్‌లోని ప్రభుత్వ పాఠశాలల్లో తెలుగు పాఠాలు



**న్యూఢిల్లీ-నవభూమి:**పంజాబ్ రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల్లో ) తెలుగు పాఠాలను చెబుతున్నారు. ఆశ్చర్యంగా ఉందా.. కానీ ఇది అక్షరాలా నిజం. కేంద్ర విద్యాశాఖ ఆదేశాల మేరకు దేశంలోని అన్ని సర్కారీ బడుల్లో భారతీయ భాషా వేసవి శిబిరాలను నిర్వహించారు ఇందులో భాగంగానే పంజాబ్‌లోని ప్రభుత్వ పాఠశాలల్లో వేసవి శిబిరాలు ఏర్పాటు చేశారు. ఆ క్యాంపుల్లో హాజరైన విద్యార్థులకు టీచర్లు తెలుగు నేర్పిస్తున్నారు. విద్యార్థులకు తెలుగు ఓనమాలు నేర్పించి, పాఠాలు బోధించారు.వారం రోజులపాటు సమ్మర్ క్యాంప్స్..కేంద్ర విద్యాశాఖ ఆదేశాల మేరకు పంజాబ్‌లోని ప్రభుత్వ పాఠశాలల్లో మే 26వ తేదీ నుంచి వారం రోజుల పాటు సమ్మర్ క్యాంప్స్ జరిగాయి. ఈ శిబిరాలకు 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులు హాజరయ్యారు. వారికి యూట్యూబ్‌లో చూసి తెలుగు వర్ణమాల నేర్పించారు. తెలుగులో కూరగాయల పేర్లు, పండ్లు, వంటకాలు ఇలా చాలా వాడుకపదాలను విద్యార్థులు నేర్చుకున్నారు.నేర్పిన పాఠాలు ఇవే..అలాగే తెలుగు భాషలోని ప్రముఖ దేశభక్తి గేయాలను విద్యార్థులతో పాడించారు. వాటి అర్థాన్ని ఉపాధ్యాయులు వివరించారు. బస్సు మీద ఉన్నపేర్లు ఎలా చదవాలి.. ఆయా వివరాలు ఎలా తెలుసుకోవాలి.. తదితర మెయిన్ సిలబస్‌గా విద్యార్థులకు టీచర్లు నేర్పించారు. ఆయా పేర్లను విద్యార్థులతో చదివించి, రాయించారు. ఇంకా తెలుగు భాషలోని నమస్కారం, ధన్యవాదాలు, అభినందనలు వంటి గౌరవపూర్వక పదాల గురించి తెలియజేసి.. తెలుగు రాష్ట్రాలకు వెళితే ఆటో డ్రైవర్లు, బస్సు కండక్టర్లు, డ్రైవర్లు, వ్యాపారులను తెలుగులో ఎలా సంబోధించాలి అనేది కూడా నేర్పించారు.తెలుగు భాషా తరగతులను నిర్వహించే క్రమంలోనే విద్యార్థులకు డిజిటల్ (యూట్యూబ్) మెటీరియల్‌తో పాటు ప్రింటెడ్ మెటీరియల్‌ను కూడా పంపిణీ చేశారు. వాటిని చూస్తూ విద్యార్థులు తమ తమ ఇళ్ల వద్ద ప్రాక్టీస్ చేసి, ప్రత్యేక లెర్నింగ్ షీట్లను రూపొందించారు. అయితే పంజాబ్‌లోని పలు ఉపాధ్యాయ సంఘాలు కేంద్ర విద్యాశాఖ ఆదేశాలను వ్యతిరేకిస్తున్నాయి. కాగా నెటిజన్లు మాత్రం ఈ చర్యను అభినందిస్తున్నారు. పిల్లలు రెండు మూడు బాషలు మాట్లాడడం చాలా బాగుంటుందని అంటున్నారు.

## సైనిక శిబిరంపై పడ్డ కొండచరియలు

**గ్యాంగ్‌టక్-నవభూమి:** సిక్కింలోని ఛటేన్‌లో సైనిక శిబిరంపై కొండచరియలు విరిగిపడడంతో ముగ్గురు భద్రతా సిబ్బంది మృతిచెందగా, ఆరుగురి జాడ గల్లంతయింది. ఆదివారం రాత్రి 7గంటల సమయంలో భారీ వర్షం పడడంతో ఈ దుర్ఘటన చోటు చేసుకున్నట్లు రక్షణ శాఖ అధికారి ఒకరు తెలిపారు. ఈ ప్రమాదంలో మరణించిన సిబ్బంది లఖ్విందర్ సింగ్, లాన్స్ నాయక్ మునీశ్ ఠాకూర్, అభిషేక్ లఖాడ మృతదేహాలను వెలికి తీశామని ఆయన వెల్లడించారు. మరో నలుగురు సైనికులు స్వల్ప గాయాలతో బయటపడ్డారని చెప్పారు. గల్లంతైన వారిని రక్షించేందుకు సహాయక బృందాలు శ్రమిస్తున్నాయన్నారు.


## అన్నా వర్సిటీ విద్యార్థినిపై రేప్ కేసు.. బిర్యానీ మాస్టరే దోషి




**న్యూఢిల్లీ-నవభూమి:** దేశవ్యాప్తంగా సంచలనం రేపిన అన్నా యూనివర్సిటీ విద్యార్థినిపై అత్యాచారం కేసులో చెన్నై మహిళా కోర్టు సంచలన తీర్పు వెలువరించింది. మొదటినుంచి నిందితునిగా ఉన్న వ్యక్తే దోషి అని తేల్చిన కోర్టు.. అతనికి యావజ్జీవ కారాగారశిక్ష, రూ.90వేల జరిమానా విధించింది. ఈ తీర్పు ప్రకారం ముద్దాయి జ్ఞానశేఖరన్ ఎలాంటి జైలు రాయితీలు లేకుండా 30 ఏళ్లపాటు ఏకబిగిన కఠినకారాగార శిక్ష అనుభవించాలని, అపరాధ సొమ్మును బాధిత విద్యార్థినికి అందజేయాలని స్పష్టం చేసింది. గత ఏడాది డిసెంబర్ 23 రాత్రి అన్నా విశ్వవిద్యాలయం ప్రాంగణంలో ఉన్న పీజీ ద్వితీయ సంవత్సరం విద్యార్థినిపై అదే ప్రాంతానికి చెందిన వ్యక్తి లైంగిక దాడికి పాల్పడి ఆ దృశ్యాలను మొబైల్‌లో వీడియో తీశాడు. ఈ ఘటనపై బాధిత విద్యార్థిని కోట్టూరుపురం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, ఆ ప్రాంతంలో బిర్యానీ షాపు నడుపుతున్న జ్ఞానశేఖరన్(37)ను డిసెంబర్ 24న అరెస్టు చేశారు. నిందితునికి డీఎంకే నేతలతో సంబంధాలు ఉన్నాయని ఆరోపిస్తూ కేసును సీబీఐకి అప్పగించాలని అన్నాడీఎంకే హైకోర్టును ఆశ్రయించగా.. మహిళా ఐపీఎస్ అధికారులు స్నేహప్రియ, బృందా, ఐమాన్ జమాల్‌తో కూడిన ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని నియమించారు. ఆ దర్యాప్తు బృందం విచారణ జరిపి గత ఫిబ్రవరి 24న సైదాపేట 9వ క్రైం కోర్టులో ఛార్జిషీటు సమర్పించింది. విద్యార్థినిపై జరిగిన అత్యాచారం కేసులో జ్ఞానశేఖరన్ తప్ప ఇతరులెవరికీ సంబంధంలేదని నివేదించింది. గత మార్చి 7న ఈ కేసు విచారణను చెన్నై మహిళా కోర్టుకు బదిలీ చేశారు. అక్కడ కేసు విచారణ ముగియడంతో న్యాయాధికారి ఎం.రాజలక్ష్మి సోమవారం తీర్పు వెలువరించారు.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
5
హైదరాబాద్
బుధవారం
04 । జూన్ । 2025

# ఆస్ట్రేలియాలో భార్యాభర్తల గొడవ.. గౌరవ్‌పై పోలీసుల దాడి.. ఐసీయూలో భర్త



**న్యూఢిల్లీ-నవభూమి:** భారతీయ సంతతికి చెందిన ఓజంట.. ఆస్ట్రేలియాలోని( అడిలైడ్ వీధులో గొడవ పడ్డారు. అటుగా వెళ్తున్న పోలీసులు ఆ ఇద్దర్నీ ఆపే ప్రయత్నం చేశారు. ఈ ఘటనలో 42 ఏళ్ల గౌరవ్ కుండి అనే వ్యక్తి తీవ్ర గాయాలకు గురయ్యాడు. అతన్ని ఆస్పత్రిలో చేర్పించారు. ఆస్ట్రేలియా పోలీసులు అతన్ని తీవ్రంగా కొట్టినట్లు ఆరోపణలు ఉన్నాయి. గౌరవ్ కుండి, అమృతపాల్ కౌర్ దంపతులకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. పోలీసుల దాడిలో గాయపడ్డ గౌరవ్ కుండి.. ప్రస్తుతం ఐసీయూలో చికిత్స పొందుతున్నాడు. అతని బ్రెయిన్, మెడకు గాయాలయ్యాయి. అడిలైడ్ వీధుల్లో కుండి, కౌర్ ఇద్దరూ గట్టిగా అరుచుకున్నారు. భార్యాభర్తలు గొడవపడుతున్నట్లు గ్రహించిన పోలీసులు రంగప్రవేశం చేశారు. గృహ హింస కేసుగా భావించిన పోలీసులు ఆ జంటను అడ్డుకునే ప్రయత్నం చేశారు. కుండిని అరెస్టు చేసే సమయంలో .. పోలీసులు అతన్ని గట్టిగా నొక్కి పెట్టారు. ఆ సమయంలో ఆ ఘటనను కౌర్ తన మొబైల్‌లో బంధించారు. నేనేమీ తప్పుచేయలేదని కుండి బిగ్గరగా అరిచాడు. అతని వదిలేయాలని కౌర్ పోలీసుల్ని వేడుకున్నది. కానీ వాళ్లు వినిపించుకోలేదు. గౌరవ్‌ను పట్టుకుని, మెడలు వంచేశారు. తలను కారుకు నెట్టేశారు. దీంతో గౌరవ్ స్పృహ కోల్పోయాడు. ప్రస్తుతం రాయల్ అడిలైడ్ ఆస్పత్రిలో అతన్ని చేర్పించారు. బ్రెయిన్ డ్యామేజ్, మెడకు గాయాలు అయినట్లు డాక్టర్లు చెప్పారు. దక్షిణ ఆస్ట్రేలియా పోలీసులు ఈ కేసును దర్యాప్తు చేస్తున్నారు. పోలీసు బాడీ కెమెరాలకు చెందిన వీడియోలను కూడా సమీక్షిస్తున్నారు.

# సంధికి అమెరికా-చైనా ప్రయత్నాలు?



**న్యూయార్కు-నవభూమి:** అమెరికా - చైనా మధ్య వాణిజ్య సంబంధాలు మరోసారి హాట్‌టాపిక్‌గా మారాయి. ఇటీవల ట్రంప్ చేసిన ఆరోపణల నేపథ్యంలో రెండు దేశాల మధ్య ఘర్షణాత్మక వాతావరణం నెలకొంది. అమెరికా - చైనా మధ్య వాణిజ్య సంబంధాలు మరోసారి హాట్‌టాపిక్‌గా మారాయి. ఇటీవల ట్రంప్ చేసిన ఆరోపణల నేపథ్యంలో రెండు దేశాల మధ్య ఘర్షణాత్మక వాతావరణం నెలకొంది. ఈ నేపథ్యంలో అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ , చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ త్వరలో భేటీ కానున్నట్లు సమాచారం వెలువడటంతో అంతర్జాతీయ స్థాయిలో తీవ్ర ఆసక్తి నెలకొంది. -వారం రోజుల్లో ట్రంప్, జిన్‌పింగ్ మాటామంతి! వైట్‌హౌస్ ప్రెస్ సెక్రటరీ కరోలిన్ లివిట్ తెలిపిన ప్రకారం, రెండు దేశాల మధ్య ఇటీవల చోటుచేసుకున్న వాణిజ్య సమస్యలపై చర్చలు జరగనున్నాయి. ముఖ్యంగా, కీలకమైన ఖనిజాల ఎగుమతులపై చైనా విధించిన ఆంక్షలు, అమెరికా విధించిన అధిక సుంకాలు వంటి అంశాలు ఈ చర్చల్లో ప్రధానంగా ఉండనున్నాయి. అయితే, భేటీకి సంబంధించి ఖచ్చితమైన తేదీని మాత్రం వెల్లడించలేదు. కొన్ని వర్గాల సమాచారం ప్రకారం, వారం రోజుల్లోనే ఈ భేటీ జరిగే అవకాశం ఉందని తెలుస్తోంది. అమెరికా-చైనా మధ్య మరో కీలక సమావేశం? ఇటీవల ట్రంప్ ప్రభుత్వం చైనాపై విధించిన 145 శాతం సుంకాలు, అలాగే ప్రతీకారంగా చైనా విధించిన 125 శాతం దిగుమతి సుంకాలు, రెండు దేశాల మధ్య వాణిజ్య యుద్ధాన్ని మళ్లీ రేకెత్తించాయి. ఈ పరిణామాలు అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థలపై తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నాయి. ఇటువంటి ఉద్రిక్త పరిస్థితుల్లో ట్రంప్-జిన్‌పింగ్ భేటీకి సిద్ధమవడం ప్రాధాన్యతను సంతరించుకుంది. స్విట్జర్లాండ్ వేదికగా ఇటీవల జరిగిన రెండు రోజుల చర్చల సందర్భంగా అమెరికా-చైనా వాణిజ్య ఒప్పందం కుదిరింది. అయితే, ఈ ఒప్పందాన్ని చైనా ఉల్లంఘిస్తోందని ట్రంప్ ఆరోపించారు. "అతి మంచితనం పనికిరాదు" అంటూ ట్రంప్ చేసిన వ్యాఖ్యలు ఈ అంశానికి మరింత తీవ్రతను జోడించాయి. ఇప్పుడే జరగనున్న ట్రంప్-జిన్‌పింగ్ మాటామంతి ఈ ఉద్రిక్తతలను నివారించగలదా? వాణిజ్య సంబంధాలు మళ్లీ పాత బాట పడతాయా? అనే అంశాలపై అంతర్జాతీయ వేదికలు ఉత్కంఠగా ఎదురు చూస్తున్నాయి. ఈ భేటీ ప్రపంచ వాణిజ్య భవిష్యత్తును ఏ విధంగా ప్రభావితం చేస్తుందో వేచి చూడాలి.

# ఆర్సీబీదే ఐపీఎల్ టైటిల్..రూ.11 కోట్ల బెట్


**న్యూఢిల్లీ-నవభూమి:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) తుది అంకం మొదలుకానుంది. ఇంకొన్ని గంటల్లో 18వ సీజన్ విజేత ఎవరో తేలిపోనుంది.. ఆపై ఏడాది పాటు కొత్త చాంపియన్ పేరు రికార్డుల్లో కొనసాగనుంది. ఐపీఎల్ మొదలవుతుంటూనే బెట్టింగ్ ల సీజన్ కూడా మొదలవుతుంది. తెలుగు రాష్ట్రాలు సహా భారత్ లోని చాలా రాష్ట్రాల్లో బెట్టింగ్ పై నిషేధం ఉంది. అయినా, దొంగచాటుగా బెట్టింగ్ నడుస్తూనే ఉంది. రూ.కోట్ల మొత్తం చేతులు మారుతోంది. రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ), పంజాబ్ కింగ్స్ మధ్య అహ్మదాబాద్ లోని నరేంద్రమోదీ స్టేడియంలో జరగనున్న ఐపీఎల్ ఫైనల్ లో ఎవరు గెలుస్తారని కూడా పందేలు పెద్దఎత్తున సాగుతున్నట్లు తెలుస్తోంది. - అపర దాన కర్ణుడు రోహిత్ శర్మ.. కిట్ లోని బ్యాట్లన్నీ మాయం అయితే.. అన్ని బెట్టింగ్ లలోకి తాత అన్నట్లు ఒక వ్యక్తి పెద్ద బెట్టింగ్ కాశాడు. అతడు తెలుగువాడో.. ఇండియనో కాదు.. కెనడా వాడు. ఆ దేశానికి చెందిన ప్రముఖ ర్యాపర్ డ్రేక్ గ్రాహమ్ ఆర్సీబీ టైటిల్ కొడుతుందంటూ 7.5 లక్షల డాలర్ల పందెం కాశాడు. ఇది భారత కరెన్సీలో రూ.6.5 కోట్లు. ఒకవేళ ఆర్సీబీ టైటిల్ కొడితే డ్రేక్ కు రూ.11 కోట్లు (రూపాయికి రూపాయి) వస్తాయన్నమాట. లక్కీ ర్యాపర్ డ్రేక్ ఈ డ్రేక్ మామూలు వాడు కాదు. బాగా పాపులర్. వయసు 38 ఏళ్లు. అబ్రే డ్రేక్ గ్రాహమ్ ఇతడి పూర్తి పేరు. నటుడు, గాయకుడు కూడా. హిప్ హాప్ సంగీతంలో ఎప్పటికప్పుడు కొత్త స్టయిల్స్ తో ప్రజలను ఆకట్టుకుంటుంటాడు.

# ఉగ్రవాదాన్ని ప్రోత్సహించడాన్ని పాకిస్థాన్ ఆపేయాలి : సీడీఎస్ చౌహాన్




**శ్రీనగర్-నవభూమి:** ఉగ్రవాదం విషయంలో పాకిస్థాన్ తీరుపై భారత 'చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ అనిల్ చౌహాన్ తీవ్ర విమర్శలు చేశారు. ఉగ్రవాదాన్ని ప్రోత్స హించడాన్ని పాకిస్థాన్ ఆపేయాలని ఆయన డిమాండ్ చేశారు. పహల్గాం దాడి లాంటి ఉగ్రదాడుల ను భారత్ సహించదని స్పష్టం చేశారు. ఉగ్రవాదం పడగ కింద భారత్ ఉండబోదని తేల్చిచెప్పారు. న్యూక్లియర్ బ్లాక్ మెయిల్‌ను భారత్ ఎట్టిపరిస్థితుల్లో సహించబోదని సీడీఎస్ అన్నారు. పాకిస్థాన్.. ఉగ్రవాదాన్ని ప్రోత్సహించడమే తన విధానంగా మార్చుకుందని విమర్శించారు. కాల్పుల విమరణను ముందుగా పాకిస్థానే కోరిందని, కానీ నీరు రక్తం కలిసి పారవని ఆయన వ్యాఖ్యానించారు. పాకిస్థాన్ తీరు మారాల్సిందేనని చెప్పారు. ఆపరేషన్ సింధూర్ సందర్భంగా చిన్నచిన్న నష్టాలు జరిగాయని సీడీఎస్ అనిల్ చౌహాన్ తెలిపారు. అయితే ఈ నష్టాలు భారత సైన్యంపై పెద్దగా ప్రభావం చూపవని అన్నారు. పొరపాట్లను తాము సరిదిద్దుకుంటామని చెప్పారు. అయినా ఇలాంటి సందర్భాల్లో జరిగిన నష్టం కంటే సాధించిన విజయాన్నే చూడాలని సూచించారు.

# 6న చీనాబ్ రైల్వే బ్రిడ్జ్‌ను ప్రారంభించనున్న మోదీ



**శ్రీనగర్-నవభూమి:** జమ్మూ: ప్రధాని మోదీ జూన్ 6వ తేదీన జమ్మూకశ్మీర్‌లో పర్యటించను న్నారు. ఆ రోజు ఆయన ప్రపంచంలోని అత్యంత ఎత్తైన రైల్వే బ్రిడ్జ్‌ను ప్రారంభించను న్నారు. చీనాబ్ నదిపై ఆ బ్రిడ్జ్(ను నిర్మించిన విషయం తెలిసిందే. ఏప్రిల్ 22వ తేదీన పెహల్గామ్ ఉగ్రదాడి జరిగిన తర్వాత తొలిసారి ఆయన జమ్మూకశ్మీర్‌కు వెళ్తున్నారు. చీనాబ్ నదిపై రైల్వే బ్రిడ్జ్ ఓపెనింగ్ అంశాన్ని పీఎంవో సహాయ మంత్రి జితేంద్ర సింగ్ వెల్లడించారు. మరో మూడు రోజుల్లో చరిత్ర చోటుచేసుకోనున్నట్లు చెప్పారు. ఉదంపూర్.. శ్రీనగర్.. బారాముల్లా రైల్వే లింక్ రూట్‌లో చీనాబ్ నదిపై బ్రిడ్జ్‌ను నిర్మించారు. ప్రకృతి విపత్తులను తట్టుకునే రీతిలో దాన్ని దృఢంగా తయారు చేశారు. నవ భారతానికి చెందిన శక్తికి, విజన్‌కు ఆ బ్రిడ్జ్ చిహ్నంగా నిలుస్తుందని మంత్రి జితేంద్ర సింగ్ తెలిపారు. చీనాబ్ నదిపై సుమారు 358 మీటర్ల ఎత్తులో బ్రిడ్జ్‌ను నిర్మించారు. ఇది పారిస్‌లోని ఈఫిల్ టవర్ కన్నా 35 మీటర్లు ఎత్తుగా ఉంటుంది.

# ఈశాన్య రాష్ట్రాల్లో వరదలు




**న్యూఢిల్లీ-నవభూమి:** ఈశాన్య రాష్ట్రాల్లో భీకర వర్షాలు కురిశాయి. దీంతో అక్కడ వరదలు వస్తున్నాయి. అస్సాం, సిక్కిం, మణిపూర్ రాష్ట్రాల్లో వర్షాలతో జనజీవనం స్తంభించింది. వరదల వల్ల సుమారు 34 మంది మృతిచెందారు. ఈ నేపథ్యంలో అస్సాం సీఎం హిమంత బిశ్వ శర్మ, సిక్కిం సీఎం ప్రేమ్ సింగ్ తమాంగ్, మణిపూర్ గవర్నర్ అజయ్ భల్లాతో ఇవాళ ప్రధాని మోదీ మాట్లాడారు. వరద విపత్తును ఎదుర్కొనేందుకు సహాయం అందించనున్నట్లు చెప్పారు. ప్రస్తుత పరిస్థితి తెలుసుకునేందుకు ప్రధాని మోదీ ఫోన్ చేసినట్లు అస్సాం సీఎం హిమంత బిశ్వ శర్మ తెలిపారు. ఏకధాటిగా కురుస్తున్న వర్షాల వల్ల అస్సాంతో పాటు పొరుగు రాష్ట్రాల్లోనే వరద పరిస్థితి నెలకొన్న విషయాన్ని మోదీకి వివరించినట్లు బిశ్వశర్మ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన రిలీఫ్ ఆపరేషన్ గురించి కూడా చెప్పినట్లు తన ఎక్స్‌లో ఆయన వెల్లడించారు. కొన్ని చోట్ల వరదల వల్ల కొండచరియలు విరిగిపడ్డాయి.

# భారతదేశ అధికారిక భాష ఏంటి..? డీఎంకే ఎంపీ కనిమొళి సమాధానమిదే



**చెన్నై- నవభూమి:** పాకిస్థాన్ చేపడుతున్న ఉగ్రవాదం గురించి ప్రపంచ దేశాలకు భారతీయ ఎంపీలు వివరిస్తున్న విషయం తెలిసిందే. ఆపరేషన్ సిందూర్ తర్వాత కొన్ని ఎంపీ బృందాలు విదేశాల్లో పర్యటిస్తున్నాయి. అయితే ప్రస్తుతం డీఎంకే ఎంపీ కనిమొళినేతృత్వంలోని అఖిపలక్ష దౌత్య బృందం స్పెయిన్‌లో ఉన్నది. ఈ సందర్భంగా మాడ్రిడ్‌లో ప్రవాస భారతీయులతో జరిగిన సమావేశంలో ఎంపీ కనిమొళికి ఆసక్తికర ప్రశ్న ఎదురైంది. భారతదేశ జాతీయ భాష ఏంటి..? అని ఎంపీ కనిమొళిని ప్రశ్నించారు. దీనికి ఆమె స్పందిస్తూ భారతదేశ జాతీయ భాష 'భిన్నత్వంలో ఏకత్వం' అంటూ సమాధానమిచ్చారు. 'భారతదేశ జాతీయ భాష భిన్నత్వం, ఏకత్వం. ఇదే మా ప్రతినిధి బృందం ప్రపంచానికి ఇచ్చే సందేశం. నేడు ఇదే అత్యంత ముఖ్యమైన విషయం' అంటూ మాడ్రిడ్‌లోని భారతీయ సభ్యుడి ప్రశ్నకు సమాధానంగా చెప్పుకొచ్చారు. జాతీయ విద్యా విధానం విషయంలో తమిళనాడులోని డీఎంకే ప్రభుత్వానికి, కేంద్ర ప్రభుత్వానికి మధ్య ఇటీవల భాషా పరమైన విభేదాలు తలెత్తిన విషయం తెలిసిందే. ఈ వివాదం వేళ కనిమొళి సమాధానం ఆసక్తికరంగా మారింది. మరోవైపు మాడ్రిడ్‌లో మీడియాతో కనిమొళి మాట్లాడుతూ.. భారత్‌లో జరుగుతున్న ఉగ్రదాడులకు, మిగితా దేశాల్లో జరుగుతున్న దాడులకు తేడా ఉన్నట్లు ఆమె చెప్పారు. భారత్‌లో జరుగుతున్న ఉగ్రదాడులను ఓ దేశం స్పాన్సర్ చేస్తున్నట్లు ఆమె వెల్లడించారు. ఆ తేడాను ప్రపంచ దేశాలకు వివరిస్తున్నామని ఆమె తెలిపారు. కేంద్ర ప్రభుత్వం, ప్రధాని మోదీ చెప్పినట్లుగా ఉగ్రవాద స్పాన్సర్ దేశాల గురించి వివరిస్తున్నట్లు చెప్పారు. పరిస్థితిని అర్థం చేసుకున్న దేశాలు.. ఇండియాకు మద్దతు ఇస్తున్నాయని, ఎందుకంటే ఉగ్రవాదం హద్దులు దాటుతోందని ఆయా ఆదేశాలు అంగీకరిస్తున్నట్లు ఎంపీ కనిమొళి చెప్పారు.

# అనంత పద్మనాభ స్వామి ఆలయంలో అద్భుత ఘట్టం



**తిరువనంతపురం-నవభూమి:** దేశంలోనే అత్యంత సంపద కలిగిన దేవాలయం కేరళలోని అనంత పద్మనాభ స్వామి ఆలయం. ఎన్నో శతాబ్దాల చరిత్ర కలిగిన ఈ ఆలయంలో ఉన్న సంపద ఎంత ఉంది అనేది ఇప్పటివరకు లెక్కించనే లేదు. ఇక మన దేశంలో ఉన్న అత్యద్భుత ఆలయాల్లో కేరళ రాజధాని తిరువనంతపురం పట్టణంలో ఉన్న ఈ అనంత పద్మనాభ స్వామి ఆలయం ఒకటి కావడం గమనార్హం. అయితే ఈ అనంత పద్మనాభ స్వామి ఆలయం.. అందులో ఉన్న బంగారం, నగదు, ఇతర ఖరీదైన వస్తువుల కారణంగా దేశవ్యాప్తంగా పేరు మారుమోగిపోయింది. ఇక ఈ అనంత పద్మనాభ స్వామి ఆలయంలో దాదాపు 3 శతాబ్దాల తర్వాత అరుదైన ఉత్సవం జరగనుంది. 270 ఏళ్ల తర్వాత అనంత పద్మనాభ స్వామి ఆలయంలో మహా కుంభాభిషేకం నిర్వహించనున్నారు. పద్మనాభ స్వామి ఆలయ అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం.. ఈ మహా కుంభాభిషేకం క్రతువు ప్రధాన ఉద్దేశ్యం.. ఆధ్యాత్మిక శక్తిని పటిష్ఠం చేయడం, ఆలయ పవిత్రతను పునరుజ్జీవింపజేయడమేనని తేల్చి చెప్పారు. ఇన్ని 100 సంవత్సరాల తర్వాత ఇంతటి సమగ్ర పునరుద్ధరణ, పూజలు జరుగుతున్నాయని.. రాబోయే అనేక దశాబ్దాల్లో ఇది మళ్లీ జరగడం అరుదేనని ఆలయ మేనేజర్ బి. శ్రీకుమార్ వెల్లడించారు. ఈ మహా కుంభాభిషేకం క్రతువు జూన్ 8వ తేదీన ఆలయ ప్రాంగణంలో జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా కొత్తగా నిర్మించిన తళిక్కకుడమ్‌లు (గర్భగుడి పైన 3, ఒట్టక్కల్ మండపం పైన ఒకటి) ప్రతిష్ఠాపన.. విశ్వక్సేన విగ్రహం పునఃప్రతిష్ఠాపన.. ప్రధాన ఆలయ సముదాయంలో ఉన్న తిరువంబాడి శ్రీకృష్ణ ఆలయంలో అష్టబంధ కలశం వంటి వివిధ క్రతువులు జరుగుతాయని శ్రీకుమార్ వివరించారు. 2017లో సుప్రీంకోర్టు నియమించిన నిపుణుల కమిటీ ఆదేశాల ప్రకారం.. అనంత పద్మనాభ స్వామి ఆలయ పునరుద్ధరణ పనులు చేపట్టాయి. అయితే ఆ వెంటనే పనులు ప్రారంభమైనప్పటికీ.. కరోనా మహమ్మారి కారణంగా.. ఈ పనులు ఆలస్యం అయ్యాయి. ఆ తర్వాత 2021 నుంచి.. వివిధ పునరుద్ధరణ పనులు దశలవారీగా పూర్తైనట్లు ఆలయ వర్గాలు చెప్పాయి. వందల ఏళ్ల తర్వాత ఆలయంలో సమగ్ర పునరుద్ధరణ, సంబంధిత పూజలు జరుగుతున్నాయని ఆలయ మేనేజర్ శ్రీకుమార్ వెల్లడించారు. ఇన్నేళ్ల తర్వాత ఇలాంటి మహా కుంభాభిషేకం వీక్షించడం ప్రపంచవ్యాప్తంగా ఉన్న పద్మనాభ స్వామి భక్తులకు ఒక అరుదైన అవకాశమని పేర్కొన్నారు. పద్మనాభ స్వామి ఆలయ శతాబ్దాల నాటి సంప్రదాయాలకు కట్టుబడి, పవిత్ర క్రతువులు సజావుగా జరిగేలా ఆలయ నిర్వహణ చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ఆచార్య వరణం, ప్రసాద శుద్ధి, ధార, కలశం, ఇతర పూజలు జూన్ 8వ తేదీన జరిగే మహా కుంభాభిషేకంకు ముందు రాబోయే రోజుల్లో అనంత పద్మనాభ స్వామి ఆలయంలో జరుగుతాయని ఆలయ వర్గాలు తెలిపాయి. ఇక కేరళ రాజధాని తిరువనంతపురం పేరు శ్రీ పద్మనాభస్వామి ఆలయానికి విడదీయరాని సంబంధం కలిగి ఉంది. ఈ ఆలయంలో విష్ణుమూర్తి సర్పదేవుడు అనంతపై శయనించి ఉంటారు. తిరువనంతపురం నగరం ఈ అనంత పద్మనాభ స్వామి ఆలయం చుట్టూ అభివృద్ధి చెంది.. అక్కడ కొలువై ఉన్న అనంత అనే దేవత పేరు మీదుగా ఆ పేరు వచ్చింది.

# రైతు ఇంట్లో వందలకొద్దీ పాములు



**మీరట్-నవభూమి:** సాధారణంగానే పాములు అంటే అంతా భయపడిపోతుంటారు. కాస్తో కూస్తో ధైర్యం ఉన్న వాళ్లు అవి తమ ఇంట్లోకి చొరబడితో.. వాటిని చంపేందుకు ప్రయత్నిస్తుంటారు. తమ వల్ల కాకపోతే పాములు పట్టేవాళ్లకు ఫోన్ చేసి వాటిని అప్పజెపుతుంటారు. ఇదంతా మనకు తెలిసిందే. కానీ యూపీలోని ఓ రైతు ఇంట్లోకి మాత్రం ఒకటి కాదు రెండు కాదు.. ఏకంగా వందకు పైగా పాములు వచ్చాయి. అయితే ఏం చేయాలో పాలుపోని అతడు గట్టి గట్టిగా కేకలు వేయగా స్థానికులంతా అక్కడకు వచ్చారు. పాములను చూసి భయపడుతూనే.. వాటిని చంపడం ప్రారంభించారు. దాదాపు 50 వరకు చంపగా.. మరో 50 తప్పించుకున్నాయి. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియో నెట్టింట తెగ వైరల్ అవుతోంది. ఉత్తర ప్రదేశ్ మీరట్ జిల్లా సిమౌలీ గ్రామానికి చెందిన మహఫూజ్ సైఫీ తనకున్న వ్యవసాయ భూమిలోనే పంటలు పండిస్తూ జీవనం సాగిస్తున్నాడు. గ్రామంలోనే అతడికి సొంత ఇల్లు ఉండగా.. కుటుంబ సభ్యులు అంతా కలిసి అక్కడే హాయిగా జీవిస్తున్నారు. అయితే ఆదివారం రోజు రాత్రి సమయంలో మహఫూజ్ సైఫీ ఇంట్లోని పెరట్లో ఓ పాము కనిపించింది. దీంతో భయపడిన అతడు.. ఇంట్లోకి వస్తే సమస్య వస్తుందని అక్కడే చంపేశాడు. ఆ తర్వాత మరికొన్ని పాములు అటుగా రావడం గుర్తించాడు. ఒక్కసారిగా వంద వరకూ పాములు రావడంతో తీవ్రంగా భయపడిపోయాడు. ఏం చేయాలో పాలుపోక గట్టి గట్టిగా కేకలు వేశాడు. దీంతో స్థానికులంతా పరుపరుగు పరుగునా అక్కడకు వచ్చారు. పాములను చూసి విస్తుపోయారు. కుప్పలుగా రావడం గుర్తించి వాటిని కొట్టి చంపాలని నిర్ణయించుకున్నారు. వెంటనే చేతికి అందిన రాళ్లు, రప్పలు, కర్రలతో పాములపై దాడి చేశారు. దాదాపుగా 50కి పైగా పాములను చంపేశారు. ఈక్రమంలోనే మరో 50 వరకు పాములు అక్కడి నుంచి తప్పించుకున్నాయి. దీంతో చనిపోయిన పాములు అన్నింటినీ.. ఓ గుంత తవ్వి అందులో పూడ్చి పెట్టారు. ఈ సమయంలోనే కొందరు దీన్ని వీడియోగా తీసి సోషల్ మీడియాలో పెట్టగా.. వైరల్‌గా మారింది. ఇది చూసిన ప్రతీ ఒక్కరూ భయపడిపోతున్నారు. ఒళ్లు జలదరిస్తుందంటూ కామెంట్లు చేస్తున్నారు. ముఖ్యంగా ఈ వీడియో అటవీ శాఖ అధికారుల కంట పడగా.. వారు కూడా స్పందించారు. మీరట్ అటవీశాఖ డివిజనల్ అధికారి రాజేశ్ కుమార్ మాట్లాడుతూ.. మహఫూజ్ సైఫీ ఇంట్లోకి వచ్చినవన్నీ విషరహిత పాములు అని చెప్పారు. స్థానికులు చంపినవి కూడా అవేనని పేర్కొన్నారు. వన్యప్రాణి సంరక్షణం చట్టం-1972 కింద వాటికి రక్షణ కూడా ఉంటుందని తెలిపారు. ఈ వ్యవహారంపై దర్యాప్తు చేస్తున్నామని కూడా వెల్లడించారు.

# తుంగభద్రకు భారీగా ఇన్‌ఫ్లో.. పెరుగుతున్న నీటిమట్టం



**బళ్లారి(బెంగళూరు)-నవభూమి:** కర్ణాటక లోని తుంగభద్ర జలాశయంలో నీటినిల్వ పెరుగుతూ వస్తోంది. సోమవారానికి 18.86 టీఎంసీలకు చేరింది. జలాశయం పరీవాహక ప్రాంతంలో వర్షాలు బారీగా కురుస్తుండడంతో ఇన్‌ఫ్లో భారీగా చేరుతోంది. సోమవారం 20 వేల క్యూసెక్కులకుపైగా ఇన్‌ఫ్లో రావడంతో నీటి నిల్వ 18.86 టీఎంసీలకు చేరింది. ప్రస్తుతం జలాశయ నీటిమట్టం 1597.84 అడుగులుగా నమోదైంది. గతేడాది ఇదే సమయానికి జలాశయ నీటిమట్టం 1577.47 అడుగులు ఉండగా.. 3.360 టీఎంసీల నీటి నిల్వ నమోదైంది. ఈ ఏడాది జలాశయా నికి ముందస్తుగా వరద వస్తుండడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# ఇండియాకు బుద్ధుడి పవిత్ర అవశేషాలు

**న్యూఢిల్లీ-నవభూమి:** బుద్ధుడి పవిత్ర అవశేషాలను వియత్నాం నుంచి భారతదేశానికి ఒడిశా గవర్నర్ డాక్టర్ కంభంపాటి హరిబాబు తీసుకువచ్చారు. బుద్ధుడి పవిత్ర అవశేషాలను భారత్‌కు తీసుకురావడానికి గవర్నర్ హరిబాబుని వియత్నాంకు కేంద్రం ప్రభుత్వం పంపించింది. అంతర్జాతీయ బౌద్ధ సమాఖ్య, కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో వియత్నాంలో పవిత్ర బుదుని అవశేషాలను ప్రదర్శించిన తర్వాత వాటిని ఇండియాకు తీసుకువచ్చారు. దీనిపై గవర్నర్ కంభంపాటి హరిబాబు ఓ ప్రకటన విడుదల చేశారు. వియత్నాం పర్యటనలో భాగంగా క్వాంగ్ నామ్ ప్రావిన్స్‌లోని ప్రముఖ మై సన్ దేవాలయ సముదాయాన్ని గవర్నర్ కంభంపాటి హరిబాబు సందర్శించారు. మై సన్ ప్రాంతాన్ని వియత్నాంలో అత్యంత విలువైన సాంస్కృతిక స్థలాల్లో ఒకటిగా పరిగణిస్తున్నారు. యునెస్కో ప్రపంచ వారసత్వ ప్రదేశంగా గుర్తింపు పొందిన ఈ ప్రాంగణాన్ని భారత పురావస్తు సర్వే సహాయంతో పునరుద్ధరిస్తున్నారు. ఈ క్రమంలో గవర్నర్.. వియత్నాం పర్యటనకు ప్రాధాన్యం లభించింది. అలాగే ఇక్కడ ఉన్న కొన్ని హిందూ దేవాలయాలను 4వ శతాబ్దం నాటివిగా భావిస్తున్నారు. ఈ దేవాలయాలను చంపా రాజవంశం నిర్మించింది. ఇవి ఆగ్నేయాసియా సంయుక్త సాంస్కృతిక వారసత్వానికి గుర్తుగా ఉన్నాయి. ఈ పర్యటన సందర్భంగా ఇండియా సహకారంతో జరుగుతున్న పునరుద్ధరణ పనుల పురోగతిని గవర్నర్ సమీక్షించారు.

ఈ పురాతన నిర్మాణాలను సంరక్షించేందుకు ఉపయోగిస్తున్న ప్రత్యేక సాంకేతికత గురించి అధికారులు గవర్నర్ డాక్టర్ కంభంపాటి హరిబాబుకి వివరించారు. ఈ దేవాలయ సముదాయం ఒక అందమైన లోయలో ఉంది. చుట్టూ పచ్చని పర్వతాలు, ప్రవహిస్తున్న వన జలధారల మధ్య విస్తరించి ఉంది. ఇది 7వ శతాబ్దం నుంచి 13వ శతాబ్దం వరకూ చంపా నాగరికతకు ఒక ముఖ్యమైన ఆధ్యాత్మిక, సాంస్కృతిక కేంద్రంగా పనిచేసింది. ప్రస్తుతం మై సన్‌లో దాదాపు 70 దేవాలయ నిర్మాణాలు ఉన్నాయి. ప్రత్యేక శైలిలో వీటిని నిర్మించడంతో ఇవి శతాబ్దాలుగా స్థిరంగా నిలిచాయి. చరిత్రకారులు, వాస్తుశిల్ప నిపుణులను ఇవి నేటికీ ఆకర్షిస్తున్నాయి. ఈ స్థలం చంపా రాజ్యం, భారతదేశం, చైనాల మధ్య ఉన్న సాంస్కృతిక బంధాలనూ ప్రతిబింబిస్తోంది. ఒడిశా గవర్నర్ పర్యటన భారత్-వియత్నాం మధ్య ఉన్న సాంస్కృతిక బంధాన్ని, సంయుక్త వారసత్వాన్ని సంరక్షించడంలో కీలకపాత్ర పోషిస్తోంది.

# సత్యం ఎన్నటికీ తల వంచదు.. కన్నడ భాషపై వివాదం వేళ కమల్ హాసన్‌కు మద్దతుగా పోస్టర్లు

**చెన్నై- నవభూమి:** తమిళం నుంచి కన్నడ భాష ( పుట్టిందంటూ కమల్ హాసన్ చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదం అయ్యాయి. కమల్ వ్యాఖ్యలపై కన్నడ సంఘాలు భగ్గుమన్నాయి. ఈ వివాదం నేపథ్యంలో కమల్ హాసన్ తాజా చిత్రం 'థగ్‌లైఫ్' ప్రదర్శనను నిషేధిస్తున్నట్లు ది కర్ణాటక ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ వివాదం వేళ చెన్నైలో కమల్ హాసన్‌కు అనుకూలంగా పోస్టర్లు వెలిశాయి ఇటీవలే చెన్నైలో జరిగిన థగ్‌లైఫ్ సినిమా ఆడియో లాంఛ్‌లో 'కన్నడ భాష తమిళం నుంచి పుట్టింది' అంటూ వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కమల్ వ్యాఖ్యలను సమర్థిస్తూ ఆయన పార్టీ మక్కల్ నీది మయ్యం చెన్నైలోని ప్రముఖ ప్రాంతాల్లో పెద్ద ఎత్తున పోస్టర్లను అంటించింది. ఆ పోస్టర్లలో 'రెండు భాషల మధ్య సంబంధం ఏంటో ఆయన స్పష్టంగా చెప్పారు', 'ప్రేమ ఎప్పటికీ క్షమాపణలు చెప్పదు', 'సత్యం ఎన్నటికీ తల వంచదు' అని రాసి ఉంది. కమల్ వ్యాఖ్యల తర్వాత కన్నడ అనుకూల సంఘాలు కర్ణాటక వ్యాప్తంగా నిరసనలు తెలిపిన నేపథ్యంలో తమిళనాడు చెన్నైలో ఆయన పార్టీ ఇలా పోస్టర్లను అంటించింది.

**ఇంతకీ ఏం జరిగిందంటే..?**

కమల్ హాసన్ నటించిన థగ్ లైఫ్ చిత్రం త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో మంగళవారం చెన్నైలో జరిగిన సినిమా ప్రీ-రిలీజ్ ఈవెంట్‌లో కమల్‌హాసన్ మాట్లాడుతూ.. 'కన్నడం.. తమిళం నుంచి పుట్టింది' అని కామెంట్ చేశారు. ఇదే కార్యక్రమానికి కన్నడ సూపర్ స్టార్ శివరాజ్ కుమార్ కూడా హాజరయ్యారు. ఆయన ఎదుటే ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. ఉయిరే, ఉరవే తమిళే (నా ప్రాణం, నా బంధుత్వం తమిళం) అంటూ తన ప్రసంగాన్ని ప్రారంభించిన కమల్ హాసన్ అనంతరం కన్నడ స్టార్ శివరాజ్ కుమార్‌ని ఉద్దేశించి మాట్లాడారు. 'శివరాజ్‌కుమార్ వేరే రాష్ట్రంలో నివసిస్తున్నా నా కుటుంబ సభ్యుడు. అందుకే ఆయన ఈ రోజు ఇక్కడ ఉన్నారు. అందుకే నా ప్రసంగం మొదలుపెట్టేటప్పుడు.. నా జీవితం, నా కుటుంబం తమిళ భాష అని చెప్పా. మీ భాష (కన్నడ) తమిళ నుంచే పుట్టింది. ఆ విధంగా మీరు భాగస్వామి అయ్యారు' అని శివరాజ్‌కుమార్‌ను ఉద్దేశించి అన్నారు. అయితే తమిళం నుంచి కన్నడ పుట్టిందన్న కమల్ వ్యాఖ్యలపై కన్నడ సంఘాలు భగ్గుమన్నాయి. బెంగళూరులో థగ్‌లైఫ్ సినిమా బ్యానర్లను కొందరు ఆందోళనకారులు చించివేశారు. 'కర్ణాటకలో మీకు వ్యాపారం కావాలి.. కానీ కన్నడ భాషను అవమానిస్తారా?' అని ధ్వజమెత్తారు.

తప్పు చేస్తేనే క్షమాపణలు చెబుతాను.. కమల్ హాసన్ మరోవైపు తాజా వివాదంపై క్షమాపణ చెప్పడానికి కమల్‌హాసన్ నిరాకరించారు. తప్పు చేస్తేనే తాను క్షమాపణలు చెబుతానని ఓ ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. 'గతంలో కూడా నా మీద ఇలాంటి బెదిరింపులు చాలానే వచ్చాయి. తప్పుచేయని పక్షంలో నేను అస్సలు క్షమాపణలు చెప్పను. ఇది నా జీవన విధానం. నేను ప్రజాస్వామ్యాన్ని, దేశాన్ని, చట్టాన్ని నమ్ముతాను. ఈ విషయంలో ప్రజలు జోక్యం చేసుకోవద్దు' అని కమల్‌హాసన్ స్పష్టం చేశారు. మణిరత్నం డైరెక్ట్ చేసిన 'థగ్‌లైఫ్' జూన్ 5న విడుదలకానుంది.

**'థగ్‌లైఫ్'పై కర్ణాటకలో నిషేధం**

కర్ణాటక రక్షణ వేదికతో పాటు పలు ప్రజా సంఘాలు కమల్ హాసన్ వ్యాఖ్యలపై భగ్గుమన్నాయి. ఈ నెల 30లోగా కమల్‌హాసన్ క్షమాపణలు చెప్పకపోతే 'థగ్ లైఫ్'ను బహిష్కరిస్తామని కర్ణాటక ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అల్టిమేటం జారీచేసింది. అందుకు అనుగుణంగానే మే 30న కేఎఫ్‌సీసీ తన నిర్ణయాన్ని ప్రకటించింది. తాము విధించిన డెడ్‌లైన్ ముగిసినా కమల్ హాసన్ నుంచి సరైన స్పందన రాకపోవడంతో 'థగ్‌లైఫ్' చిత్రాన్ని బ్యాన్ చేస్తున్నట్లు ఫిల్మ్ ఛాంబర్ నిర్ణయం తీసుకుంది.

**కర్ణాటక హైకోర్టును ఆశ్రయించిన కమల్ హాసన్**

ఈ వివాదం నేపథ్యంలో కమల్ హాసన్ తాజా చిత్రం 'థగ్‌లైఫ్' ప్రదర్శనను నిషేధిస్తున్నట్లు ది కర్ణాటక ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రకటించిన విషయం తెలిసిందే.




నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
11
హైదరాబాద్
బుధవారం
04 । జూన్ । 2025

# విదేశీ కంపెనీలు ఉత్పత్తికి సై అంటే దిగుమతి సుంకం 15 శాతమే



**న్యూఢిల్లీ-నవభూమి:** దేశీయంగా విద్యుత్ వాహనాల (ఈవీ) తయారీకి ముందుకు వచ్చే విదేశీ కంపెనీలకు దిగుమతి సుంకాలు గణనీయంగా తగ్గించనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఈవీల స్థానిక తయారీని పటిష్ఠం చేయడం, ప్రపంచ పారిశ్రామికవేత్తలను ఆకర్షించడం లక్ష్యంగా రూపొందించిన కొత్త ఈవీ విధానం మార్గదర్శకాలను ప్రభుత్వం సోమవారం నోటిపై చేసింది. దీంతో ఈ పాలసీ ఇప్పుడు అమలులోకి వచ్చినట్లవుతుంది. దాని ప్రకారం ఈవీల తయారీలో కనీసం రూ.4,150 కోట్ల పెట్టుబడులు పెట్టే ఆటో తయారీదారులను 15% తగ్గింపు సుంకంపై 8,000 ఈవీలు దిగుమతి చేసుకునేందుకు అనుమతిస్తారు. అయితే అనుమతులు పొందిన తేదీ నుంచి మూడు సంవత్సరాల్లోగా ఉత్పత్తి కార్యకలాపాలు ప్రారంభించడంతో పాటు తయారీలో ఎంత శాతంలో స్థానిక ఉత్పత్తులు వినియోగించేది ప్రకటించాల్సి ఉంటుంది. ఈ పథకం కింద దరఖాస్తు చేసుకునేందుకు వీలుగా రెండు వారాల్లో ప్రత్యేక విభాగం ఏర్పాటవుతుందని, 120 రోజులు అది అందుబాటులో ఉంటుందని అధికారి ఒకరు తెలిపారు. ఆ తర్వాత కూడా వచ్చే ఏడాది మార్చి 15 వరకు ఎప్పుడు అవసరం అనుకుంటే అప్పుడు దరఖాస్తుల విభాగాన్ని తెరిచే అవకాశం ఉంది. ఈ స్కీమ్ కింద ఒక్కో దరఖాస్తుదారునిపై కోల్పోయే సుంకాల గరిష్ఠ పరిమితి రూ.6,484 కోట్లుగా ఉండనుందన్నారు.

## వాట్సాప్ యూజర్లకు గుడ్‌న్యూస్.. త్వరలో అందుబాటులోకి సూపర్ ఫీచర్..!



**న్యూఢిల్లీ-నవభూమి:** ప్రపంచ వ్యాప్తంగా అత్యధికంగా వినియోగిస్తున్న యాప్‌లో వాట్సాప్ ఒకటి. కోట్లాది మంది యూజర్లను దృష్టిలో పెట్టుకొని మెటా యాజమాన్యంలోని కంపెనీ ఎప్పటికప్పుడు కొత్త కొత్త ఫీచర్స్‌ని పరిచయం చేస్తూ వస్తున్నది. తాజాగా సరికొత్తగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఫీచర్‌ను పరీక్షిస్తున్నది. దాని సహాయంతో యూజర్లు సొంతంగా కస్టమ్ ఏఐ చాట్‌బాట్‌ను సృష్టించుకోవచ్చు. ప్రస్తుతం ఈ ఫీచర్ బీటా టెస్టర్ల కోసం విడుదల చేయగా.. త్వరలోనే మిగతా యూజర్లు అందరికీ అందుబాటులోకి తీసుకురానున్నది. ఈ ఫీచర్ ఇప్పటికే ఇన్‌స్టాగ్రామ్, మెసెంజర్‌లో అందుబాటులో ఉన్నది. యూజర్లు వారి చాట్‌బాట్ ఉద్దేశం, వ్యక్తిత్వం, లుక్‌ని సైతం డిజైన్ చేసుకోవచ్చు. చాట్‌బాట్ సిద్ధమయ్యాక యూజర్లు ఒకరితో ఒకరు సంభాషించుకునే వీలు సైతం ఉన్నట్లు సమాచారం. నివేదిక ప్రకారం.. మెటా ఇప్పుడు ఏఐ స్టూడియో ఆధారిత చాట్‌బాట్ క్రియేషన్ ఫీచర్‌ను వాట్సాప్‌కు జోడిస్తున్నది. ఈ ఫీచర్ ప్లే స్టోర్‌లో ఆండ్రాయిడ్ వెర్షన్ 2.25.18.4 వాట్సాప్ బీటాలో కనిపించింది. ఈ అప్‌డేట్‌లో కొందరు యూజర్ల కోసం 'క్రియేట్ ఎన్ ఏఐ' అనే ఫీచర్ కనిపించింది. ఈ ఫీచర్లో యూజర్లు కొత్త ఏఐ స్టూడియో ట్యాబ్ ఉంటుంది. ఇందులో ముందు రెడీగా ఉన్న చాట్‌బాట్‌లు అందుబాటులో ఉంటాయి. దాంతో ఒకరితో ఒకరు మాట్లాడుకోవచ్చు. లేదంటే కస్టమ్ ఏఐ చాట్‌బాట్‌ను సైతం తయారు చేసుకోవచ్చు. కస్టమ్ చాట్‌బాట్‌ను తయారు చేసుకునేందుకు ముందుగా ప్రాంప్ట్ రాయాల్సి ఉంటుంది. యూజర్లు మీ ఏఐ చాట్‌బాట్ ఉద్దేశం, రోల్‌ను తెలిపేలా గరిష్ఠంగా వెయ్యి అక్షరాలలతో వివరణ ఇవ్వాలి. అలాగే, వ్యక్తిత్వ లక్షణాలు ఉంచుకోవాల్సి ఉంటుంది. ఇందు కోసం వాట్సాప్ పలు సూచనలు ఇస్తుంది. కానీ, యూజర్లు సైతం ఓన్ చాయిస్ కూడా ఉంటుంది. ఆ తర్వాత మీ చాట్‌బాట్ రోల్‌ని సెలెక్ట్ చేసుకోవాల్సి ఉంటుంది. అంటే హెల్పర్, మెంటర్, టీచర్ తదితర రోల్‌ని ఎంచుకొని.. ఆ తర్వాత అవరాత్‌ను ఎంపిక చేసుకోవాల్సి ఉంటుం ది. ఇవన్నీ పూర్తయ్యాక ఏఐ స్టూడియో కొత్త చాట్‌బాట్‌ను రూపొం దిస్తుంది. ఆ తర్వాత వెంటనే మీరు మాట్లాడుకోవచ్చు. వాట్సాప్ యూజ ర్లు తమ చాట్‌బాట్‌లను ఇతరులతో షేర్ చేసుకోవచ్చా? లేదా అన్నది ఇంకా స్పష్టంగా తెలియరాలేదు. ఇన్‌స్టాగ్రామ్, మెసెంజర్‌లో షేర్ చేసు కునేందుకు అవకాశం ఉంది. ఇదిలా ఉండగా.. ఈ ఫీచర్ త్వరలోనే వాట్సాప్‌లోకి వచ్చే అవకాశం ఉంది. ప్రస్తుతం ఈ ఫీచర్ బీటా దశలో ఉండగా.. బీటా యూజర్లకు మాత్రమే అందుబాటులో ఉంది.

## మైక్రోసాఫ్ట్‌లో మరో రౌండ్ లేఆఫ్‌లు.. 300 మంది తొలగింపు



**న్యూఢిల్లీ-నవభూమి:** ప్రముఖ టెక్ సంస్థ మైక్రోసాఫ్ట్ మరోసారి ఉద్యోగులకు షాకిచ్చింది. దాదాపు 300 మందికిపైగా ఉద్యోగులకు లేఆఫ్స్ ప్రకటించింది. తాజా తొలగింపులు వాషింగ్టన్ కార్యాలయం నుంచి ఉన్నట్లు తెలుస్తోంది. తాజా కోతలు సంస్థలోని మొత్తం సిబ్బందిలో 1 శాతం కంటే తక్కువ అని ది సియాటిల్ టైమ్స్ నివేదిక తెలిపింది. 'మార్కెట్‌లో పైచేయి సాధించేలా సంస్థను ఉత్తమంగా ఉంచేందుకు అవసరమైన సంస్థాగత మార్పులను అమలు చేస్తున్నాం' అని మైక్రోసాఫ్ట్ తన అధికారిక ప్రకటనలో తెలిపింది. తాజా రౌండ్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు, ప్రాడక్ట్ మేనేజర్లు ఎక్కువగా ఎఫెక్ట్ అయినట్లు సమాచారం. కాగా, మైక్రోసాఫ్ట్ గత నెల మధ్యలో వేలాది మంది ఉద్యోగులను తొలగించిన విషయం తెలిసిందే. తమ సిబ్బందిలో మూడు శాతం మందికి లేఆఫ్‌లు ఇచ్చింది. అంటే దాదాపు 6వేల మందిని తొలగించింది. 2023లో 10 వేలమందికి ఉద్వాసన పలికిన అనంతరం ఇదే రెండో అతిపెద్ద తొలగింపు. మేనేజ్‌మెంట్ స్థాయిలను తగ్గించడం, సంస్థ కార్యకలాపాలను క్రమబద్ధీకరించడమే ముఖ్య లక్ష్యమని సంస్థ ప్రతినిధి ఒకరు చెప్పారు. ఇక ఈ ఏడాది జనవరిలో కూడా పనితీరు ఆధారంగా కొంతమందిని సంస్థ తొలగించిన విషయం తెలిసిందే.

## క్రెడిట్ కార్డుల గురించి 6 అపోహలు.. అసలు నిజం ఏంటంటే

**న్యూఢిల్లీ-నవభూమి:** ప్రస్తుత కాలంలో క్రెడిట్ కార్డుల వినియోగం భారీగా పెరిగింది. అనేక మంది ఉద్యోగులు, వ్యాపారులు సైతం వీటిని తెగ వాడేస్తున్నారు. డీమార్ట్ షాపింగ్, ఆన్‌లైన్ కొనుగోలు చేయాలన్నా కూడా క్రెడిట్ కార్డులను విరివిగా వాడుతున్నారు. దీంతోపాటు అత్యవసర పరిస్థితుల్లో డబ్బు అవసరం అయినా కూడా పలువురు క్రెడిట్ కార్డులను వినియోగిస్తున్నారు. క్రెడిట్ కార్డుతో షాపింగ్ చేయడం వల్ల పలు సందర్భాలలో డిస్కౌంట్లు, రివార్డ్ పాయింట్లు లభిస్తాయి. వీటిని క్యాష్‌బ్యాక్ చేసుకోవడం ద్వారా అనేక ప్రయోజనాలు లభిస్తాయి. రంగంలోకి దిగిన బ్యాంక్..కానీ ఇదే సమయంలో క్రెడిట్ కార్డులకు సంబంధించిన కొన్ని అపోహలు కూడా పలువురిలో ఉన్నాయి. ఈ అపోహల గురించి సోషల్ మీడియాలో ప్రచారం పెరిగిన నేపథ్యంలో ఇటీవల బ్యాంక్ స్వయంగా తన వెబ్‌సైట్‌లో ఈ అపోహలను తొలగించింది. అయితే ప్రధానంగా ఎలాంటి అపోహలు ఉన్నాయనే విషయాలను ఇప్పుడు తెలుసుకుందాం.

**కొత్త క్రెడిట్ కార్డ్ తీసుకుంటే క్రెడిట్ స్కోర్ తగ్గడం**

మీరు కొత్త క్రెడిట్ కార్డ్ కోసం అప్లై చేసుకున్నప్పుడు, బ్యాంక్ మీ క్రెడిట్ స్కోర్‌ను తనిఖీ చేస్తుంది. దీనిని "హార్డ్ ఎంక్వైరీ" అని పిలుస్తారు. ఇలా పదే పదే చేయడం వల్ల మీ స్కోర్‌కు కొద్దిగా ఇబ్బంది కలుగుతుంది. కానీ అది ఒకసారి జరిగితే, చింతించాల్సిన పని లేదు. మీ చెల్లింపులను సమయానికి చేస్తే స్కోరు మళ్లీ మెరుగుపడుతుంది.

ఒకటే క్రెడిట్ కార్డ్ బెటర్?..మీరు మీ ఖర్చులను నియంత్రించుకోగలిగితే, ఒకటి కంటే ఎక్కువ కార్డులు తీసుకోవచ్చు. ఎలాంటి ఇబ్బంది ఉండదు. అలాంటి సమయంలో మీకు అధిక క్రెడిట్ పరిమితి లభిస్తుంది. మీరు వేర్వేరు కార్డులపై వేర్వేరు రివార్డు పాయింట్లను కూడా పొందవచ్చు. ఉదాహరణకు కార్డ్ అంతర్జాతీయ ప్రయాణంలో చాలా ప్రయోజనాలను అందిస్తుంది.

ఉపయోగించని కార్డులను క్లోజ్ చేయడం..ఇది సరైన పద్ధతి కాదని చెబుతున్నారు. క్రెడిట్ పరిమితి ఎక్కువగా ఉంటే, మీ 'క్రెడిట్ వినియోగం' తక్కువగా ఉంటుంది. ఇది క్రెడిట్ స్కోర్‌కు మంచిది. పాత కార్డును క్లోజ్ చేయడం వల్ల మీ మొత్తం పరిమితి తగ్గుతుంది.


# డాల్బీ లాబొరేటరీస్‌తో భాగస్వామ్యంలో మహీంద్రా కొత్త ఆవిష్కరణ




**న్యూఢిల్లీ-నవభూమి:** భారతదేశంలోని ప్రముఖ ఎస్‌యూవీ తయారీదారు మహీంద్రా మహీంద్రా లిమిటెడ్ తమ నూతన వాహనం మహీంద్రా థార్ రాక్స్ వేరియంట్‌తో డాల్బీ అట్మోస్ అందుబాటులోకి వచ్చింది. లీనమయ్యే మనోరంజన అనుభవాన్ని అందించడంలో అగ్రగామిగా ఉన్న డాల్బీ లాబొరేటరీస్ సహకారంతో, ప్రపంచ ఎస్‌యూవీ మార్కెట్‌లో మొదటి ఆవిష్కరణగా, డాల్బీ అట్మోస్ ద్వారా 4-ఛానల్ ఇమ్మర్సివ్ ఆడియోను వాహనంలో ఈ సదుపాయాన్ని అందుబాటులోకి తీసుకువచ్చారు. ప్రయాణంలో సంగీతాన్ని ఆలకించే అనుభవాన్ని థార్ రాక్స్ పునర్నిర్వచిస్తుంది. మీరు పట్టణ వీధుల్లో లేదా మారుమూల ప్రాంతాలలో ప్రయాణిస్తున్నా, డాల్బీ అట్మోస్ ప్రతి ప్రయాణాన్ని ఉన్నతంగా చేస్తుంది. డాల్బీ అట్మోస్ నుంచి వచ్చే ధ్వని మీ చుట్టూ ఆవరించుకున్నట్లు, సహజంగా వినిపిస్తూ, స్వేచ్ఛగా ప్రయాణించేందుకు వీలు కల్పిస్తుందిఇన్ఫోటైన్‌మెంట్ సిస్టమ్‌లో గానా స్ట్రీమింగ్ నేరుగా విలీనం కావడంతో, థార్ రాక్స్ వాహనదారులు ఎప్పుడైనా డాల్బీ అట్మోస్‌లో సంగీతాన్ని ఆస్వాదించవచ్చు. ఇది ప్రతి ప్రయాణాన్ని మరపురానిదిగా చేస్తుంది. ఈ భాగస్వామ్యం గురించి డాల్బీ లాబొరేటరీస్ కమర్షియల్ పార్టనర్‌షిప్స్ - సీనియర్ డైరెక్టర్ కరణ్ గ్రోవర్ మాట్లాడుతూ, "మహీంద్రాతో మా భాగస్వామ్యం వినియోగదారులకు, ముఖ్యంగా భారతదేశంలోని వినియోగదారులకు అందుబాటులోకి తీసుకువస్తున్న అవకాశాల పట్ల మేము సంతోషంగా ఉన్నాము. థార్ రాక్స్ AX7Lలోని డాల్బీ అట్మోస్‌తో, ఇంటీరియర్ క్యాబిన్‌ను వాహనంలో పర్సనలైజ్ చేసిన కచేరీ హాల్‌గా మార్చడం ద్వారా మేము కారు ప్రయాణాన్ని పూర్తిగా సరికొత్త స్థాయికి తీసుకెళ్తున్నాము. ప్రతి రైడ్‌ను థార్ రాక్స్ సాహసోపేత స్ఫూర్తితో పూర్తి చేసేలా, లీనమయ్యే ఆడియో అనుభవంగా మారుస్తున్నాము" అని తెలిపారు. మహీంద్రా - మహీంద్రా లిమిటెడ్, ఆటోమోటివ్ టెక్నాలజీ ప్రొడక్ట్ డెవలప్‌మెంట్ ప్రెసిడెంట్ వేలుసామి ఆర్ మాట్లాడుతూ, "మహీంద్రాలో, ఆటోమోటివ్ ఆవిష్కరణలో అపరిమిత సరిహద్దులను అన్వేషించేందుకు మేము నిరంతరం ప్రయత్నిస్తుండగా, థార్ రాక్స్ ఆ స్ఫూర్తికి నిదర్శనం. ప్రీమియం 9-స్పీకర్ హర్మాన్ కార్డాన్ బ్రాండెడ్ ఆడియో సిస్టమ్‌లో 4 ఛానెళ్ల ఇమ్మర్సివ్ ఆడియోను అందించే డాల్బీ అట్మోస్‌ను కలిగిన, ప్రపంచంలోనే మొట్టమొదటి వాహనాన్ని అందుబాటులోకి తీసుకువచ్చి మేము డ్రైవింగ్ అనుభవాన్ని పునర్నిర్వచిస్తున్నాము. ప్రధాన రహదారులతో పాటు రహదారి పరిస్థితి ఎలా ఉన్నప్పటికీ, థార్ రాక్స్ దేశంలోని రహదారులపై విలక్షణంగా ఏ ఇతర ఎస్‌యూవీల్లో లేని విధంగా సెన్సరీ అనుభవాన్ని అందిస్తుంది. డాల్బీ అట్మోస్‌తో ఇప్పుడు అది ప్రతి క్షణానికి జీవాన్ని అందిస్తుంది" అని వివరించారు. మహీంద్రా మరియు డాల్బీ మధ్య ఈ భాగస్వామ్య సహకారం ఇన్-క్యాబిన్ టెక్నాలజీకి కొత్త బెంచ్‌మార్క్‌ను నిర్దేశిస్తుంది- ఇది పనితీరు, డిజైన్, లీనమయ్యే డిజిటల్ జీవనశైలిని కోరుకునే గ్లోబల్ భారతీయ వినియోగదారునికి ఉపయోగపడుతుంది. అలాగే, మహీంద్రా తన వినియోగదారుల డిమాండ్‌కు అనుగుణంగా డాల్బీ అట్మోస్‌తో కలిగిన థార్ రాక్స్ ఉత్పత్తిని పెంచింది. దీనితో వినియోగదారులు తక్కువ నిరీక్షణ సమయంతో 'ది ఎస్‌యువి' అందించే సాటిలేని థ్రిల్‌ను, ఆవిష్కరణలను ఆస్వాదించవచ్చు.

డాల్బీ గురించి :అనేది లీనమయ్యే వినోదంలో ప్రపంచ అగ్రగామి. సినిమాలు, టీవీ నుంచి సంగీతం, క్రీడలు, గేమింగ్ మరియు అంతకు మించి, డాల్బీ ప్రపంచవ్యాప్తంగా బిలియన్ల మంది ప్రజలకు వారి ఇష్టమైన అన్ని పరికరాలలో దృశ్యం, ధ్వనిని అద్భుతమైన అనుభవాలుగా మారుస్తుంది. మరియువంటి సంచలనాత్మక ఆవిష్కరణల ద్వారా వినోదం, డిజిటల్ అనుభవాలను మార్చడానికి మేము కళాకారులు, కథకులు మరియు మీరు ఇష్టపడే బ్రాండ్‌లతో భాగస్వామ్యం కలిగి ఉన్నాము. డాల్బీ, డాల్బీ అట్మోస్ మరియు డబుల్- చిహ్నం యునైటెడ్ స్టేట్స్ మరియు/లేదా ఇతర దేశాలలో డాల్బీ లాబొరేటరీస్, ఇంక్. ట్రేడ్‌మార్క్‌లు లేదా రిజిస్టర్డ్ ట్రేడ్‌మార్క్‌లు. ఇతర ట్రేడ్‌మార్క్‌లు వాటి సంబంధిత యజమానుల ఆస్తి.

# 30 పైసల స్టాక్ మాయాజాలం



**న్యూఢిల్లీ-నవభూమి:** భారత స్టాక్ మార్కెట్లు తీవ్ర ఒడుదొడుకులతో ట్రేడవుతున్నాయి. ఇంట్రాడేలో బొంబాయి స్టాక్ ఎక్స్ఛేంజి సూచీ సెన్సెక్స్ ఒక దశలో ఏకంగా 700 పాయింట్లకుపైగా పడిపోయింది. ప్రస్తుతం వార్త రాసే సమయంలో (మధ్యాహ్నం 2 గంటలకు) సెన్సెక్స్ 500 పాయింట్ల నష్టంతో 80,850 మార్కు వద్ద కదలాడుతుండగా.. నిఫ్టీ 140 పాయింట్ల పతనంతో 24,570 స్థాయిలో ట్రేడవుతోంది. అయితే మార్కెట్లు ఇలా భారీగా పడుతున్నా.. ఒక పెన్నీ స్టాక్ మాత్రం పెట్టుబడిదారులను ఆశ్చర్యపరిచింది. రూపాయిలోపు ధర ఉన్న 'థింకింక్ పిక్చర్జ్ లిమిటెడ్' షేర్లు ఒక్కరోజే 10 శాతం అప్పర్ సర్క్యూట్‌ను తాకి, రూ. 0.33కి చేరుకున్నాయి. 30 పైసల స్టాక్ ఇలా దూసుకెళ్లడానికి కారణం ఏంటి? తెలుసుకుందాం. ఈ అనూహ్య ర్యాలీకి ప్రధాన కారణం కంపెనీ తీసుకున్న ఒక కీలక నిర్ణయం. మీడియా అండ్ ఎంటర్‌టైన్‌మెంట్ రంగంలో 29 సంవత్సరాల అనుభవం ఉన్న శ్రీ చేతన్ చౌహాన్‌ను కొత్త సీఈఓగా నియమించినట్లు కంపెనీ ప్రకటించింది. ఇది భారతదేశంలోని రీజనల్ ఎంటర్‌టైన్మెంట్ మార్కెట్‌పై దృష్టి సారించి, దూకుడుగా వృద్ధి చెందడానికి, కంటెంట్ విస్తరణకు సంకేతంగా మార్కెట్ వర్గాలు భావిస్తున్నాయి. మీడియా, ఎంటర్‌టైన్‌మెంట్ పరిశ్రమలో సుదీర్ఘ అనుభవం ఉన్న చేతన్ చౌహాన్, గతంలో ది టైమ్స్ ఆఫ్ ఇండియా గ్రూప్ మిడ్-డే, రిలయన్స్, ప్యాంటలూన్స్ వంటి ప్రముఖ సంస్థల్లో పనిచేశారు. గుజరాతీ చిత్ర పరిశ్రమలో ఆయనకు అపార అనుభవం ఉంది. పబ్లిసిస్ట్‌గా 70కి పైగా ప్రాంతీయ చిత్రాలకు పనిచేశారు. ఇందులో భారతదేశం నుంచి ఆస్కార్‌కు అధికారికంగా ఎంపికైన 'లాస్ట్ ఫిల్మ్ షో' కూడా ఉంది. ఆయన నాయకత్వంలో, థింకింక్ పిక్చర్జ్ గుజరాతీ, మరాఠీ, ఇతర ప్రాంతీయ భాషల్లోకి విస్తరించాలని,, మంచి కంటెంట్ ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది.


**క్యూ4లో నిరాశపర్చినా!**

ఈ స్టాక్ ర్యాలీ ఉన్నప్పటికీ, Q4 FY25లో థింకింక్ పిక్చర్జ్ ఆశించిన దానికంటే బలహీన పనితీరును కనబరిచింది. కంపెనీ నికర నష్టం రూ. 155.74 లక్షలకు పెరిగింది. ఇది అంతకుముందు ఇదే సమయంతో పోలిస్తే 25 శాతం ఎక్కువ. అయితే, కార్యకలాపాల నుంచి వచ్చిన ఆదాయం మాత్రం ఏకంగా 410 శాతం పెరిగి రూ. 510 లక్షలకు చేరుకుంది. అంతకుముందు ఇది రూ. 100 లక్షలుగా ఉంది. మొత్తం ఆర్థిక సంవత్సరంలో కంపెనీ నికర నష్టం రూ. 5.46 లక్షలుగా నమోదైంది. గతేడాది వ్యవధిలో ఈ పెన్నీ స్టాక్ తీవ్ర ఒడుదొడుకుల్ని ఎదుర్కొంది. జూన్ మొదటి రెండు ట్రేడింగ్ సెషన్లలో దాదాపు 18 శాతం పెరిగినప్పటికీ, మే నెలలో 24 శాతం, ఏప్రిల్‌లో 5 శాతం తగ్గింది. అంతకుముందు మార్చిలో 30 శాతం పెరిగింది.

**పెన్నీ స్టాక్ అంటే ఏమిటి?**

సాధారణంగా, ఒక రూపాయి లేదా అంతకంటే తక్కువ ధరలో ట్రేడ్ అయ్యే షేర్లను పెన్నీ స్టాక్స్ అంటారు. వీటి మార్కెట్ క్యాపిటలైజేషన్ చాలా తక్కువగా ఉంటుంది. వీటిలో పెట్టుబడి పెట్టడం అధిక రిస్క్‌తో కూడుకున్నది, ఎందుకంటే అవి చాలా అస్థిరంగా ఉంటాయి. వాటి గురించి సమాచారం కూడా తక్కువగా లభిస్తుంది. అయితే, అవి అనూహ్యంగా పెరిగే అవకాశం కూడా ఉంటుంది.

## దడ పుట్టిస్తున్న బంగారం ధరలు..



**న్యూఢిల్లీ-నవభూమి:** పసిడికి మార్కెట్లో ఎల్లప్పుడూ డిమాండ్ ఉంటుంది. అయితే పసిడి ధరలు గత కొంత కాలం నుంచి పరుగులు పెడుతున్న సంగతి తెలిసిందే. గతంలో ఎన్నడూ లేని విధంగా వీటి ధరలు రికార్డు స్థాయికి చేరుకుంటున్నాయి. జూన్ నెల ప్రారంభంలోనే భారతదేశంలో బంగారం ధరలు భారీ ఎత్తున పెరిగాయి. ఉక్రెయిన్, రష్యా మధ్య పెరిగిన ఉద్రిక్తతలు అలాగే యుఎస్-చైనా మధ్య టారీఫ్ వార్‌తో బంగారం ధరలపై గట్టిగానే ఎఫెక్ట్ పడింది. ఈ క్రమంలో పసిడి ధరలు అమాంతం పెరుగుతూ వచ్చింది. మంగళవారం కూడా బంగారం ధర స్వల్పంగా పెరిగింది.

**భారతదేశంలో బంగారం ధరలు..**

ప్రస్తుతం 100 గ్రాముల బంగారం ధర 24 క్యారెట్లు రూ.9,88,400గా ఉంది. అదే 22 క్యారెట్ల బంగారం ధర రూ.9,06,000.. 18 క్యారెట్లు రూ.7,41,300గా ఉంది. అదే సమయంలో 10 గ్రాముల బంగారం ధర 24 క్యారెట్లు రూ.98,840.. 22 క్యారెట్లు రూ.90,600.. 18 క్యారెట్లు రూ.74,130గా ఉన్నాయి.

**హైదరాబాద్‌లో బంగారం ధరలు..**

నగరంలో 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ. 98,850.. 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం ధర రూ. 90,610.. 10 గ్రాముల 18 క్యారెట్ల బంగారం ధర రూ. 74,140గా ఉంది. ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖ, విజయవాడలోనూ ఇవే ధరలు కొనసాగుతున్నాయి.

దేశవ్యాప్తంగా బంగారం (24, 22 క్యారెట్ల) ధరలు ఎలా ఉన్నాయంటే..

కోల్‌కతా- రూ.98,850, రూ.90,610
చెన్నై- రూ.98,850, రూ.90,610
బెంగళూరు- రూ.98,850, రూ.90,610
పుణె- రూ. 98,850, రూ.90,610
అహ్మదాబాద్- రూ. 98,900, రూ.90,660
భోపాల్- రూ. 98,900, రూ.90,660
కోయంబత్తూర్- రూ. 98,850, రూ.90,610
పట్నా- రూ. 98,900, రూ.90,660
సూరత్- రూ. 98,900, రూ.90,660
పుదుచ్చేరి- రూ. 98,850, రూ.90,610

**వెండి ధరలు ఎలా ఉన్నాయంటే..**

హైదరాబాద్‌లో కేజీ వెండి రూ. 100 పెరిగి.. రూ. 1,11,100గా ఉంది. దేశ రాజధాని ఢిల్లీలో కిలో వెండికి రూ. 100 పెరిగి. రూ.1,00,100కు చేరింది. ఆర్థిక రాజధాని ముంబైలో కిలో వెండికి రూ. 100 పెరిగి. రూ.1,00,100 వద్ద కొనసాగుతోంది. ఇక విజయవాడలో కేజీ ధర రూ.1,11,100గా ఉంది, విశాఖపట్నంలో కిలో వెండి ధర రూ. 1,11,100 వద్ద కొనసాగుతోంది.

బంగారం స్వచ్ఛమైనదా కాదా, ఇలా చెక్ చేయండి..

బంగారం స్వచ్ఛతను గుర్తించడానికి (ఇండియన్ స్టాండర్డ్ ఆర్గనైజేషన్) హాల్ మార్కులను ఇస్తుంది. 24 క్యారెట్ల బంగారం 99.9 శాతం స్వచ్ఛమైనది. 22 క్యారెట్ల బంగారం దాదాపు 91 శాతం స్వచ్ఛమైనది. 22 క్యారెట్ల బంగారంలో రాగి, వెండి, జింక్ వంటి 9 శాతం ఇతర లోహాలను కలిపి ఆభరణాలు తయారు చేస్తారు. 22 క్యారెట్ల బంగారం 0.916 స్వచ్ఛతను కలిగి ఉండాలి (22/24 = 0.916). 24 క్యారెట్ల బంగారు ఆభరణాలపై 999 అని, 23 క్యారెట్ల బంగారు ఆభరణాలపై 958 అని, 22 క్యారెట్ల బంగారు ఆభరణాలపై 916 అని, 21 క్యారెట్ల బంగారు ఆభరణాలపై 875, 18 క్యారెట్ల బంగారు ఆభరణాలపై 750 అని రాసి ఉంటుంది. 24 క్యారెట్ల బంగారంలో ఎలాంటి కల్తీ ఉండదు.

# పీఎఫ్ ఖాతాతో ఉచితంగా రూ.7 లక్షలు




**న్యూఢిల్లీ-నవభూమి:** మీరు మీ శాలరీ నుంచి ఎంప్లాయీ ప్రావిడెంట్ ఫండ్ కు ప్రతి నెలా కొంత కంట్రిబ్యూట్ చేస్తున్నారా? మీకు ఉద్యోగుల భవిష్య నిధి సంస్థలో పీఎఫ్ అకౌంట్ ఉన్నట్లయితే మీరు ఉచితంగా రూ.7 లక్షల జీవిత బీమా పొందేందుకు అర్హులు అవుతారు. ఎంప్లాయీస్ డిపాజిట్ లింక్డ్ ఇన్సూరెన్స్ స్కీమ్ ద్వారా ఈపీఎఫ్ఓ ఈ లైఫ్ ఇన్సూరెన్సును ఉచితంగా అందిస్తోంది. అనుకోని సందర్భంలో పీఎఫ్ ఖాతాదారు ఉద్యోగంలో ఉండగా మరణించినట్లయితే ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ సదరు ఖాతాదారు నామినీలు లేదా చట్టపరమైన వారసులకు రూ. 7 లక్షల వరకు అందిస్తుంది. అయితే, అది ఉద్యోగి సర్వీస్ పీరియడ్, చివరి 12 నెలల శాలరీ పై ఆధారపడి ఉంటుంది. సాధారణంగా ఈపీఎఫ్ ఖాతాకు ఉద్యోగులు తమ శాలరీ నుంచి ప్రతి నెలా 12 శాతం కంట్రిబ్యూట్ చేస్తుంటారు. దీని ద్వారానే ఉచిత బీమా లభిస్తుంది. మీరు ఈడీఎల్ఐ పథకాన్ని ఒక్క రూపాయి ప్రీమియం కట్టాల్సిన అవసరం లేదు. ఇందుకోసం ప్రతి ఉద్యోగి పీఎఫ్ వేతనంపై 0.5 శాతం చొప్పున కంపెనీ యాజమాన్యాలు చెల్లిస్తాయి. గరిష్ఠంగా ఒక ఉద్యోగికి రూ.75 చొప్పున కంపెనీ ప్రీమియం కడుతుంది. ఈ ప్రీమియంను ఉద్యోగిపై వేయడానికి లేదు. శాలరీపై నుంచి కట్ చేయకూడదు. మరోవైపు.. ఈడీఎల్ఐ పథకానికి ఈపీఎఫ్ఓ ఇటీవలే కీలక మార్పులు చేసింది. ఒకసారి అమలులోకి వస్తే వేలాది మంది పీఎఫ్ ఖాతాదారులకు అదనపు బెనిఫిట్స్ లభిస్తాయి.

**అదనపు బెనిఫిట్స్ ఇవే..**

పీఎఫ్ ఖాతా ఉన్నట్లయితే అందులో జమ చేసే డబ్బులకు ఆదాయపు పన్ను మినహాయింపు ఉంటుంది. ఐటీ యాక్ట్ లోని సెక్షన్ 80సీ ప్రకారం ఏడాదికి రూ.1.50 లక్షల వరకు మినహాయింపు కోరవచ్చు. అయితే పాత పన్ని విధానం ఎంచుకున్న వారికే వర్తిస్తుంది. అలాగే, పీఎఫ్ అకౌంట్లో జమ అయ్యే డబ్బులకు ఈపీఎఫ్ఓ వడ్డీ ఇస్తుంది. ఇలా వచ్చే వడ్డీ ఆదాయానికి ఎలాంటి పన్ను ఉండదు. దీంతో పాటుగా పీఎఫ్ ఖాతా మెచ్యూరిటీ డబ్బులపైనా ఎలాంటి ట్యాక్స్ ఉండదు. చేతికి వచ్చే డబ్బులు మొత్తానికి ట్యాక్స్ మినహాయింపు ఉంటుంది. పీఎఫ్ చందాదారు పదవీ విరమణ తర్వాత పెన్షన్ వస్తుంది. ఒక వేళ చందాదారు మరణిస్తే కుటుంబ సభ్యులకు పెన్షన్ అందిస్తారు. అలాగే పీఎఫ్ ఖాతా నుంచి ముందస్తుగా డబ్బులు విత్ డ్రా చేయవచ్చు. ఇంటి నిర్మాణం, వైద్యం, విద్య, పెళ్లి వంటి వాటికి డబ్బులు ఇస్తారు. అలాగే పీఎఫ్ ఖాతాలో ఉండే డబ్బులకు ప్రతి ఏడాది వడ్డీ లభిస్తుంది. ప్రస్తుతం పీఎఫ్ ఖాతా వడ్డీ 8.25 శాతంగా ఉంది. ఇక్కడ కాంపౌండింగ్ మ్యాజిక్ కనిపిస్తుంది. అంటే వడ్డీపైన వడ్డీ జనరేట్ అవుతుంది.

# అదానీకి ఊహించని షాక్.. ఆ దిగుమతులపై అమెరికా దర్యాప్తు!



**న్యూఢిల్లీ-నవభూమి:** ప్రముఖ పారిశ్రామిక వేత్త గౌతమ్ అదానీ నేతృత్వంలోని దేశీయ దిగ్గజ వ్యాపార సంస్థ అదానీ గ్రూప్ మరో వివాదంలో చిక్కుకుంది. ఇప్పటికే అమెరికా షార్ట్ సెల్లర్ హిండెన్‌బర్గ్ ఆరోపణలతో ఇబ్బందులు ఎదుర్కొని ఇప్పుడిప్పుడే బయటపడుతున్న క్రమంలో కొత్త ఆరోపణలు వచ్చాయి. కొత్త వివాదంపై అమెరికా దర్యాప్తు చేపడుతున్నట్లు ప్రముఖ వార్తా సంస్థ వాల్ స్ట్రీట్ జర్నల్ ఓ కథనం ప్రచురించింది. గుజరాత్‌లోని అదానీ ఆధ్వర్యంలో ఉన్న ముంద్రా ఓడ రేవు ద్వారా కొన్ని కంపెనీలు ఇరాన్ ఎల్‌పీజీ దిగుమతి చేసుకుంటున్నాయని, ఇందుకు అదానీ గ్రూప్ సహరించిన క్రమంలో దర్యాప్తు చేపడుతున్నట్లు కథనంలో పేర్కొంది. అయితే, అదానీ గ్రూప్ ఈ కొత్త ఆరోపణలను తోసిపుచ్చింది. ఇరాన్ నుంచి ఏ నౌకలూ ఎల్‌పీజీతో గుజరాత్ ముంద్రా పోర్టుకు రాలేదని స్పష్టం చేసింది. ఆంక్షలు ఉన్న ఇరాన్ నుంచి ఎల్‌పీజీ దిగుమతులు చేసుకుంటున్నామని, దీనిపై అమెరికా దర్యాప్తు జరుపుతోందన్న విషయమే తమకు తెలియదని తెలిపింది. కొన్ని సంస్థలు కావాలనే దురుద్దేశంతో తమపై ఇలాంటి నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నాయని అదానీ గ్రూప్ వెల్లడించింది. 'మా ఓడ రేవుల్లో ఇరాన్ నుంచి వచ్చే ఎలాంటి ఎల్‌పీజీ సహా ఏ వస్తువుల దిగుమతులను అనుమతించడం లేదు. అది మా విధానపరమైన నిర్ణయం. ఇరాన్ నుంచి వచ్చే నౌకలన్నింటికీ ఇది వర్తిస్తుంది.' అని అదానీ గ్రూప్ అధికార ప్రతినిధి ఒకరు పేర్కొన్నట్లు జాతీయ మీడియాలు తెలిపాయి. గత ఏడాది అదానీ గ్రూప్‌పై అమెరికా షార్ట్ సెల్లర్ తీవ్ర ఆరోపణలు చేసిన సంగతి తెలిసిందే. కృత్రిమంగా షేర్లను పెంచేందుకు అడ్డదారులు తొక్కారని, విదేశాల్లో సెల్ కంపెనీలు నిర్వహించారంటూ అనేక ఆరోపణలు చేయడంతో అదానీ గ్రూప్ కంపెనీల షేర్లు కుప్పకూలాయి. గౌతమ్ అదానీ వ్యక్తిగత సంపద సైతం భారీగా తగ్గిపోయింది. అయితే, హిండెన్‌బర్గ్ ఆరోపణలను అదానీ గ్రూప్ బలంగా ఎదుర్కొంది. తమ ఇన్వెస్టర్లలో నమ్మకాన్ని పెంచుకునేందుకు గట్టి చర్యలు తీసుకుంది. ఆ తర్వాత పలు దర్యాప్తు సంస్థలు సైతం అదానీపై వచ్చిన ఆరోపణలకు ఆధారాలు లేవని తేల్చాయి. దీంతో అదానీ గ్రూప్ సంస్థలు వేగంగా పుంజుకున్నాయి.

ఇటీవలే అదానీ గ్రూప్ సంస్థల్లో పెట్టుబడులు ఉన్నాయన్న ఆరోపణలను తోసిపుచ్చుతు సెబీ మాజీ చీఫ్ మాధవి పురి బచ్‌కు క్లీన్ చిట్ ఇచ్చిన సంగతి తెలిసిందే. అయితే, ఇప్పుడు ఇరాన్ ఎల్‌పీజీ దిగుమతులు అంటూ కొత్త వివాదం వెలుగులోకి రావడం గమనార్హం. ఈ విషయం వెలుగులులోకి వచ్చిన క్రమంలో అదానీ గ్రూప్ షేర్లు ఫోకస్‌లో ఉంటాయని స్టాక్ మార్కెట్ నిపుణులు అంచనా వేస్తున్నారు.

## ప్రపంచంలో అత్యంత విలువైన టెక్ దిగ్గజాల్లో రిలయన్స్




**న్యూఢిల్లీ-నవభూమి:** భారత కుబేరుడు ముకేశ్ అంబానీకి చెందిన రిలయన్స్ ఇండస్ట్రీసకు మరో గౌరవం దక్కింది. ప్రపంచంలోని 30 అత్యంత విలువైన లిస్టెడ్ టెక్ దిగ్గజ కంపెనీల జాబితాలో రిలయన్స్‌కూ చోటు లభించింది. ఈ లిస్ట్‌లో స్థానం దక్కించుకున్న ఏకైక భారత కంపెనీ ఇదే. 'ట్రెండ్స్- ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్' పేరుతో సోమవారం విడుదలైన రిపోర్టు ప్రకారం.. 21,600 కోట్ల డాలర్ల (రూ.18.45 లక్షల కోట్లు) మార్కెట్ విలువతో రిలయన్స్ 23వ స్థానంలో నిలిచింది. కాగా, అమెరికాకు చెందిన మైక్రోసాఫ్ట్, ఎన్‌విడియా, యాపిల్, అమెజాన్, ఆల్ఫాబెట్, మెటా ప్లాట్‌ఫామ్స్, టెస్లా, బ్రాడ్‌కామ్ వరుసగా తొలి 8 స్థానాలను కైవసం చేసుకున్నాయి. తైవాన్‌కు చెందిన టీఎస్ఎంసీ 9వ స్థానంలో ఉంది. చైనా కంపెనీ టెన్సెంట్ 10వ స్థానంలో ఉంది.



# విజయ్ దేవరకొండ కింగ్ డమ్‌కి రిపేర్లు.. మళ్లీ పోస్ట్ పోన్

రౌడీ హీరో విజయ్ దేవరకొండకి హిట్ రాక చాలా రోజులు అవుతుంది. ఎలాంటి సినిమా చేసిన కూడా ఆ సినిమా బాక్సాఫీస్ దగ్గర బోల్తా పడుతుంది. అయితే ఈ సారి హిట్ కొట్టాలనే కసితో ఉన్నాడు విజయ్. ప్రస్తుతం విజయ్ దేవరకొండ..గౌతమ్ తిన్ననూరి డైరెక్ట్ చేస్తోన్న కింగ్‌డమ్ అనే చిత్రం చేస్తున్నాడు. ఇందులో భాగ్యశ్రీ బోర్సేకథానాయికగా నటిస్తుంది. సితార ఎంటర్టైన్మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ బ్యానర్స్ ఈ మూవీని నిర్మిస్తున్నాయి. ఆ మధ్య ఎన్టీఆర్ వాయిస్ ఓవర్ తో వచ్చిన టీజర్, రీసెంట్ గా వచ్చిన పాట మూవీపై అంచనాలను పెంచింది. జూలై 4న చిత్రాన్ని విడుదల చేయనున్నట్టు అప్పట్లో వార్తలు వచ్చాయి.కాని మూవీ వాయిదా పడే ఛాన్స్ ఉందని అంటున్నారు.విజయ్ దేవరకొండ కెరీర్ లో అత్యంత భారీ బడ్జెట్ చిత్రంగా రూపొందుతున్న కింగ్ డమ్ విడుదల దగ్గరపడుతుంది.

అయితే ఇటీవలే ఫైనల్ కట్ చూసిన దర్శకుడు గౌతమ్ తిన్ననూరి కొన్ని సన్నివేశాలను రీ షూట్ చేయాలని భావించడంతో ఇప్పుడు రీషూట్ గోవాలో జరుగుతున్నట్టు తెలుస్తుంది. దీనిపై అఫీషియల్ ప్రకటన రాలేదు కాని దీని మీద వర్క్ జరుగుతోందట. ఇది కాగానే బ్యాలన్స్ ఉన్న పోస్ట్ ప్రొడక్షన్ ని ఫినిష్ చేసి అనిరుద్ రవిచందర్ రీ రికార్డింగ్ కోసం ఫైనల్ కాపీ ఇవ్వాల్సి ఉంటుంది. సమయం లేకపోవడంతో టీమ్ పరుగులు పెట్టాల్సిన పరిస్థితి నెలకొంది. మరి చెప్పిన టైం వరకు మూవీని కంప్లీట్ చేసి రిలీజ్ చేస్తారా, లేదంటే పోస్ట్ పోన్ చేస్తారా అన్నది తెలియాల్సి ఉంది.

నవచిత్ర



# దీపికా ఇక్కడ తగ్గిందా?



అల్లు అర్జున్ నటిస్తున్న ' సినిమా టాలీవుడ్‌లో భారీ హైప్‌ను సృష్టిస్తోన్న విషయం తెలిసిందే. 'పుష్ప 2: ది రూల్' సక్సెస్ తర్వాత, అట్లీ డైరెక్షన్‌లో సన్ పిక్చర్స్ నిర్మిస్తున్న ఈ పాన్ ఇండియా యాక్షన్ డ్రామా రూ. 800 కోట్ల భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతోంది. 'పారలల్ యూనివర్స్' జానర్‌లో రూపొందుతోందని, అల్లు అర్జున్ ట్రిపుల్ రోల్‌లో కనిపించనున్నాడని ఇప్పటికే వార్తలు వైరల్ అవుతున్నాయి. ఈ సినిమా 2026 చివరిలో విడుదల కానుంది, దీని కోసం అల్లు అర్జున్ జూనియర్ ఎన్టీఆర్ ట్రైనర్ లాయిడ్ స్టీవెన్స్‌తో ఫిజికల్ ట్రైనింగ్‌లో బిజీగా ఉన్నాడు. ఇక దీపికా పదుకొణె హీరోయిన్‌గా నటిస్తున్నట్లు సమాచారం. ఇంతకుముందు సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో ప్రభాస్ సరసన 'స్పిరిట్' సినిమాలో నటించే అవకాశాన్ని దీపికా కోల్పోయింది. 'స్పిరిట్' నుంచి ఆమె తప్పుకోవడానికి రూ. 20 కోట్ల రెమ్యునరేషన్, 15% షేర్ డిమాండ్ చేయడమే కారణమని చర్చలు జరిగాయి. 'అఖండ 2' జార్జియా షెడ్యూల్ అప్‌డేట్ ఆమె డిమాండ్స్‌ను వంగా తిరస్కరించడంతో ఆమె ఈ ప్రాజెక్ట్ నుంచి తప్పుకుందని సమాచారం. ఈ నేపథ్యంలో అల్లు అర్జున్-అట్లీ సినిమాలో చేరడం దీపికాకు మరో భారీ అవకాశంగా మారింది. ఈ సినిమాలో జాన్వీ కపూర్, మృణాల్ ఠాకూర్, భాగ్యశ్రీ బోర్సే వంటి హీరోయిన్లు కూడా నటిస్తున్నారని సమాచారం. స్టార్ హీరోయిన్లతో రూపొందుతున్న ఈ సినిమాలో చేరడానికి దీపికాకు ఎలాంటి అభ్యంతరం లేదని, ఒక భారీ తెలుగు ప్రాజెక్ట్‌లో భాగం కావాలనే ఆమె ఈ సినిమాను ఎంచుకుందని అంటున్నారు. సత్య సర్వనాశనం! అయితే, ఈ సినిమా కోసం ఆమె రెమ్యునరేషన్ గురించి సస్పెన్స్ నెలకొంది. లేటెస్ట్ బజ్ ప్రకారం, దీపికాకు ఈ సినిమాలో ఎలాంటి షేర్ ఇవ్వడం లేదని, ఆమె 'కల్కి 2898 ' సినిమాకు తీసుకున్న రెమ్యునరేషన్‌నే ఈ సినిమాకు కూడా తీసుకుంటుందని తెలుస్తోంది. 'కల్కి 2898 ' కోసం ఆమె రూ. 15 కోట్లు తీసుకున్నట్లు వార్తలు వచ్చాయి. అయితే, ఈ రెమ్యునరేషన్ విషయంలో ఆమె ఎందుకు తగ్గిందని అభిమానుల్లో ఆసక్తి నెలకొంది. బహుశా స్పిరిట్ డేట్స్ కంటే 22 సినిమా డేట్స్ తక్కువ అడిగి ఉంటారనే కామెంట్స్ వస్తున్నాయి. అలాగే ఆమె డిమాండ్స్ కి కొన్నింటికి ఓకే చెప్పి ఉండవచ్చని మరో వాదన. ఏదేమైనా స్పిరిట్ తో వచ్చిన నెగిటివ్ వైబ్ ను పోగొట్టుకునేలా.. వెంటనే మరో పెద్ద సినిమా చేయాలని ఆలోచించి ఉండవచ్చు అని మరికొందరు అంటున్నారు.

# నేను ఒక్క దాన్నే అందాలు ఆరబోయడం లేదు.. అందరు చేస్తున్న పని ఇదే !



మాళవిక మీనన్

ఈ రోజుల్లో అందాల ముద్దుగుమ్మలు గ్లామర్ షో చేయడం మనం చూస్తూనే ఉన్నాం. సినిమా ఆఫర్స్ తగ్గిన సమయంలో నిత్యం అందాలు ఆరబోస్తూ రచ్చ చేస్తున్నారు. అయితే గ్లామర్ షో సమయంలో కొందరు దీనిపై పెద్ద ఎత్తున విమర్శలు చేస్తుంటారు. ఈ క్రమంలోనే ఓ ముద్దుగుమ్మని దారుణంగా ట్రోల్ చేయడంతో ఆమె ఇచ్చిన సమాధానం అందరిని ఆశ్చర్యపరిచింది. నేను ఒక్క దానినే అందాలు ఆరబోయడం లేదు.. మిగతా హీరోయిన్స్ కూడా అదే చేస్తున్నారంటూ కామెంట్ చేసింది. ప్రస్తుతం ఈ అమ్మడి కామెంట్స్ నెట్టింట వైరల్ అవుతున్నాయి. ఇంతకు ఆ హీరోయిన్ ఎవరని మీరు అనుకుంటున్నారా. ఆమె మరెవరో కాదు మలయాళం, తమిళం, తెలుగు చిత్రాల్లో నటిస్తూ తన కంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న మాళవిక మీనన్. 2011లో మలయాళ సినిమా ద్వారా ఇండస్ట్రీకి ఎంట్రీ ఇచ్చిన ఈ మలయాళీ ముద్దుగుమ్మ ఇప్పటివరకు 60పైనే సినిమాల్లో కథానాయికగా, క్యారెక్టర్ ఆర్టిస్టుగా నటించి పేరు తెచ్చుకుంది. ఇటీవల ఈ భామ నటించిన రెండు మలయాళ చిత్రాలు తంకమణి , వన్స్ అపాన్ ఏ టైమ్ ఇన్ కొచ్చి విడుదలై మంచి గుర్తింపును తీసుకువచ్చాయి. వరుస సినిమా ఆఫర్స్‌తో ఫుల్ జోరులో ఉన్న ఈ ముద్దుగుమ్మ అందాల వడ్డింపులో ఏ మాత్రం కాంప్రమైజ్ కావడం లేదు. తరచు తన గ్లామర్ షోతో రచ్చ చేస్తూనే ఉంటుంది. అయితే దీనిపై కొందరు నెటిజన్స్ ట్రోల్ చేశారు. అవకాశాల కోసమే మాళవిక అలా తన బాడీ చూపించుకుంటుందని కొందరు కామెంట్స్ చేశారు.దీని గురించి తాజాగా స్పందించిన మాళవిక మీనన్.. నేను ఎప్పుడు కూడా ఛాన్స్‌ల కోసం గ్లామర్ షో చేయలేదు. అయిన అందాలు చూపించడంలో తప్పేంటి. మలయాళ చిత్రాలలో ఎక్స్‌పోజ్ చేసే ఛాన్స్ ఉండదు. తెలుగు, తమిళ భాషలలోనే అలా నటించవచ్చు. ముఖం చూపించకుండా సోషల్ మీడియాలో నా గురించి రాసే వారిని నేను పట్టించుకోను. అయిన నేను ఒక్క దానినే గ్లామర్ ఫొటోలు షేర్ చేయడం లేదు, చాలా మంది హీరోయిన్స్ అలానే చేస్తున్నారు అని పేర్కొంది. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన కామెంట్స్ నెట్టింట వైరల్ అవుతున్నాయి.

# ఎట్టకేలకి ప్రభాస్ రాజా సాబ్ రిలీజ్ డేట్ ఫిక్స్..



యంగ్ రెబల్ స్టార్ ప్రభాస్ నుండి దాదాపు అరడజను చిత్రాలు ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు రెడీగా ఉన్నాయి. వాటిలో మారుతి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ది రాజా సాబ్ చిత్రం ఒకటి. మూవీ ఎప్పుడు రిలీజ్ అవుతుందా అని ఫ్యాన్స్ అంతా ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్న సమయంలో డిసెంబర్ 5 థియేటర్లకు రాబోతోందని పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ అధికారికంగా ప్రకటించింది. వాస్తవానికి ముందు డిసెంబర్ 12 అనే ప్రచారం జోరుగా జరిగాయి. కాని పుష్ప 2 ది రూల్ తేదీని తీసుకుని తెలివైన ఎత్తుగడ వేశారు. బ్లాక్ బస్టర్ టాక్ వస్తే సంక్రాంతి వరకు ఈ సినిమా సక్సెస్ ఫుల్‌గా రన్ అవుతుంది. లాంగ్ రన్‌లో 1500 కోట్లను దాటించవచ్చని ఈ ప్లాన్ వేసినట్టు తెలుస్తుంది.రాజా సాబ్ మూవీలో మాళవిక మోహనన్, నిధి అగర్వాల్ లు కథానాయికలుగా నటిస్తున్నారు. అప్పుడెప్పుడో ఈ చిత్రం నుంచి ప్రభాస్ ఫస్ట్‌లుక్‌ను విడుదల చేయగా దీనికి మంచి స్పందన వచ్చింది. తాజాగా ఈ చిత్ర టీజర్, విడుదల తేదీని కూడా ప్రకటించారు. టీజర్‌ను జూన్ 16న ఉదయం 10 గంటల 52 నిమిషాలకు విడుదల చేయనున్నట్లు చిత్ర బృందం తెలిపింది. ఎప్పుడో విడుదల కావాల్సిన ఈ చిత్రం అనివార్య కారణాల వలన షూటింగ్ ఆలస్యం అవుతూ వచ్చింది. ఇంకా చివరి దశ షూటింగ్‌లోనే ఉండి పోయింది. ఫ్యాన్స్ సినిమాకి సంబంధించిన అప్‌డేట్ ఇవ్వండి అంటూ పదే పదే ఒత్తిడి తేవడంతో మేకర్స్ ఎట్టకేలకు ఈ మూవీ నుంచి అప్డేట్ ఇచ్చారు.సినిమా విడుదల తేదీతో పాటు టీజర్ రిలీజ్ డేట్ కూడా అనౌన్స్ చేశారు. దీంతో ఫ్యాన్స్ ఆనందం అంతా ఇంతా కాదు. ఇక ఈ చిత్రంలో సంజయ్ దత్, మురళి శర్మ, అనుపమ్ ఖేర్, రిద్ధి కుమార్ లు కీలక పాత్రలను పోషిస్తున్నారు. హార్రర్ కామెడీ జోనర్‌లో ఈ చిత్రం రూపుదిద్దుకుండగా తమన్ సంగీతాన్ని అందిస్తున్నారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై టీజీ విశ్వప్రసాద్ ఈ వంూవీని

# ట్రోల్స్‌కు గట్టి కౌంటర్ ఇచ్చిన నయనతార



లేడి సూపర్ స్టార్ నయనతార ఇద్దరు పిల్లలకి తల్లైన కూడా సినిమాలు చేస్తూ ఫుల్ బిజీగా గడుపుతుంది. ప్రస్తుతం ఆమె ఖాతాలో అరడజనుకి పైగా చిత్రాలు ఉన్నాయి. తెలుగు, తమిళంతో పాటు ఇతర భాషలలో కూడా సినిమాలు చేస్తుంది. సీనియర్, జూనియర్ అనే తేడా లేకుండా అందరి హీరోలతో కలిసి పని చేస్తుంది. ఇప్పుడు మెగాస్టార్ చిరంజీవి సరసన నటిస్తుంది. ఈ మూవీని అనీల్ రావిపూడి తెరకెక్కిస్తున్నాడు. అయితే సాధారణంగా నయనతార ప్రమోషన్ కార్యక్రమాలకి చాలా దూరంగా ఉంటుంది. కాని చిరు సినిమాకి ముందు నుండే ప్రమోషన్స్ మొదలు పెట్టింది. ఆ మధ్య అనీల్ రావిపూడి చెన్నైకి వెళ్లి ఆమెతో ఓ ప్రమోషన్ వీడియో చేయించాడు.అది నెట్టింట తెగ వైరల్ అయింది. సాధారణంగా ఎంత పెద్ద హీరో సినిమా అయిన సరే నయనతార పెద్దగా ప్రమోషన్ కార్యక్రమాలలో పాల్గొనదు. వారికి ముందుగానే హింట్ ఇచ్చేస్తుంది. తమిళ సినిమా ప్రమోషన్స్‌లో కూడా ఎప్పుడు పెద్దగా పాల్గొనింది లేదు. కాని చిరు- అనీల్ రావిపూడి సినిమాకి ముందు నుండే ప్రమోషన్ మొదలు పెట్టేసరికి తమిళ సినిమాల ప్రమోషన్లలో ఏనాడూ పాల్గొనని నువ్వు తెలుగు సినిమాకి అదీ షూటింగ్ మొదలు కాకముందే ప్రమోషన్స్ చేస్తున్నావు. తెలుగు సినిమాలంటే అంత ఇష్టం ఉందా.. అయితే టాలీవుడ్‌కే షిఫ్ట్ అయిపోవచ్చు కదా అని కొందరు ట్రోల్ చేస్తున్నారు.ట్రోలర్స్‌కి నయనతార గట్టిగా బదులు ఇచ్చింది. అనవసర విషయాలకి టైమ్ వేస్ట్ చేసుకోవడం నాకు ఇష్టం ఉండదు. నా వీలును బట్టి నిర్మాతలకు సహకరిస్తూనే ఉంటా. ప్రమోషన్లకి వెళ్లాలా?.. వద్దా.. అన్నది కూడా నా పర్సనల్ విషయం. ఈ విషయంలో ఒకరికి సమాధానం చెప్పాల్సిన అవసరం నాకు లేదు అని తనదైన స్టైల్‌లో రిప్లయ్ ఇచ్చింది లేడీ సూపర్‌స్టార్. గతంలో మెగాస్టార్ చిరంజీవితో నయనతార రెండు సినిమాలు చేయగా.. అనిల్ రావిపూడి డైరెక్షన్లో మూడోసారి నటిస్తోంది.ఈ సినిమా హిట్ అయితే నయనతారకి టాలీవుడ్‌లో తిరుగు ఉండదు అని చెప్పాలి.

# హరిహర వీరమల్లు ప్రీ రిలీజ్ ఈవెంట్ డేట్ ఫిక్స్..



పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ నుండి చాలా రోజుల తర్వాత వస్తున్న చిత్రం హరిహర వీరమల్లు. ఈ మూవీ పవన్ కళ్యాణ్ కెరీర్‌లో తొలి పాన్ ఇండియా చిత్రంగా ప్రేక్షకుల ముందుకు వస్తుంది. అయితే ఈ రోజుల్లో ఓ పాన్ ఇండియన్ సినిమా రిలీజ్ అవుతుంది అంటే .. కనీసం 2 నెలల ముందు నుంచే ప్రమోషన్స్ మొదలవుతాయి. కానీ ఇక్కడ హరిహర వీరమల్లు విషయంలో సీన్ రివర్స్‌లో జరుగుతుంది. జూన్ 12న చిత్రం విడుదల కానుంది. ప్రమోషన్స్ హడావిడి పెద్దగా కనిపించడం లేదు. కనీసం ట్రైలర్ కూడా విడుదల కాలేదు. ట్రైలర్ కోసమైతే ఫ్యాన్స్ ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. సినిమా రిలీజ్‌కి ఇంకా 9 రోజుల సమయమే ఉన్న నేపథ్యంలో కీలకమైన ట్రైలర్ విడుదల చేయకపోవడంతో అభిమానులే కాకుండా మిగతా ఆడియెన్స్ కి సినిమాకి దూరాన్ని ఇంకా పెంచినట్టుగా మారుతుంది.

ఇక ప్రీ రిలీజ్ ఈవెంట్ ఎప్పుడు నిర్వహిస్తారా అని అందరు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. సౌత్‌తో పాటు నార్త్‌లో కూడా మూవీ ఈవెంట్ నిర్వహిస్తారనే వార్తలు ఇటీవల వచ్చాయి. అయితే ఈ వారాంతంలో ఒక భారీ ప్రీ-రిలీజ్ వేడుకను నిర్వహించడానికి సన్నాహాలు జరుగుతున్నాయి. తిరుపతిలోని ఎస్వీయూ తారకరామ క్రీడా మైదానంలో జూన్ 8న గ్రాండ్ ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించనున్నారు. దీనికోసం పవన్ కళ్యాణ్ 7వ తేదీన తిరుపతి చేరుకోనున్నట్టు తెలుస్తుంది. తిరుమల శ్రీవారిని దర్శించుకొని అనంతరం ఆయన ప్రీ రిలీజ్ ఈవెంట్‌కి హాజరు కానున్నారని అంటున్నారు. మరోవైపు చెన్నైలో ఇటీవల సాంగ్ లాంచ్ ఈవెంట్‌ను నిర్వహించిన మేకర్స్ ఇప్పుడు ప్రీ రిలీజ్ ఈవెంట్ కూడా భారీ ఎత్తున ప్లాన్ చేస్తున్నట్టు తెలుస్తుంది. ప్రస్తుతం పవన్ కళ్యాణ్ రాజకీయాల్లో బిజీగా ఉండటంతో.. మిగిలిన హీరోల సినిమాల్లా దీన్ని ప్రమోట్ చేయలేకపోతున్నారు. ఉన్న తక్కువ సమయాన్నే వీలైనంత వరకు వాడుకోవాలని చూస్తున్నారు మేకర్స్. ముంబైలోనూ ఓ ఈవెంట్ ప్లాన్ చేయాలని అనుకున్నారు. వారణాసిలో ప్రీ రిలీజ్ అనుకున్నారు. కాని సమయం లేకపోవడంతో ఉన్న సమయాన్ని జాగ్రత్తగా ప్లాన్ చేస్తున్నారు దర్శక నిర్మాతలు. నిధి అగర్వాల్ హీరోయిన్ గా బాబీ డియోల్ ఇంకా తదితర స్టార్ నటీనటుల కలయికలో దర్శకులు క్రిష్ జాగర్లమూడి ,జ్యోతి కృష్ణలు తెరకెక్కించిన భారీ పీరియాడిక్ చిత్రంపై అంచనాలు పీక్స్‌లో ఉన్నాయి.

# వాల్ట్ డిస్నీలో ఉద్యోగుల తొలగింపు .. ఫిల్మ్, టీవీ, ఫైనాన్స్ రంగాల్లో వేటు



ఎంటర్‌టైన్మెంట్ కంపెనీ వాల్ట్ డిస్నీలో వందల సంఖ్యలో ఉద్యోగులను తీసివేస్తున్నారు. ఫిల్మ్, టీవీ, కార్పొరేట్ ఫైనాన్స్ రంగాలకు చెందిన ఉద్యోగులపై వేటు వేశారు. లేఆఫ్స్ వల్ల ఫిల్మ్, టీవీ మార్కెటింగ్, టీవీ పబ్లిసిటీ, క్యాస్టింగ్, డెవలప్మెంట్ రంగాలపై తీవ్ర ప్రభావం పడనున్నది. డిస్నీ ఎంటర్‌టైన్మెంట్ డివిజన్‌లో ఎక్కువ శాతం ఉద్యోగులు తొలగింపు ఉన్నది. లాస్ ఏంజిల్స్‌లో ఉన్న డిస్నీ టీవీ స్టాఫ్‌ను ఎక్కువగా తొలగిస్తున్నట్లు తెలుస్తోంది. ఇటీవల కాలం ఉద్యోగులను తొలగించడం డిస్నీ కంపెనీనికి ఇది నాలుగోసారి. 2023 సంవత్సరంలో డిస్నీ కంపెనీ సుమారు ఏడు వేల మంది ఉద్యోగులను తీసివేసిన విషయం తెలిసిందే. ఆ ఏడాది డిస్నీ కంపెనీ సుమారు 7.5 బిలియన్ల డాలర్ల ఖర్చును తగ్గించాలని నిర్ణయించింది. ఈ ఏడాది మార్చి నెలలో సుమారు 200 మంది ఉద్యోగులను డిస్నీ తొలగించింది.

# బీసీసీఐలో చక్రం తిప్పుతున్న మాజీ జర్నలిస్ట్.. ఈయన బ్యాగ్రౌండ్ తెలుసా?



**న్యూఢిల్లీ-నవభూమి:** భారత క్రికెట్ బోర్డులో గత కొన్నేళ్ల నుంచి జైషా హవా నడుస్తూ వచ్చింది. అటు బీసీసీఐతో పాటు ఇటు ఐపీఎల్ వ్యవహారాల్లోనూ షా మాటే శాసనం అన్నట్లు నడిచింది. అయితే ఐసీసీ చైర్మన్ పోస్ట్ కోసం బీసీసీఐ సెక్రెటరీ పదవి నుంచి తప్పుకున్నారు షా. అయినా ఒకవైపు ఐసీసీ వ్యవహారాలు చూసుకుంటూనే మరోవైపు బీసీసీఐకి సంబంధించిన పనులనూ ఇన్‌డైరెక్ట్‌గా చక్కదిద్దుతూ వచ్చారాయన. బోర్డు అధ్యక్షుడు రోజర్ బిన్నీతో సమన్వయం చేసుకుంటూ వచ్చారు. అయితే వచ్చే నెలలో బిన్నీకి 70 ఏళ్లు నిండుతుండటంతో ఆయన స్థానాన్ని భర్తీ చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. అటు ఐసీసీలో షా బిజీ అయిపోయారు. దీంతో నయా ప్రెసిడెంట్‌ను నియమిం చేందుకు రెడీ అవుతోంది బోర్డు. ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లాకు పగ్గాలు అప్పగించడం ఖాయంగా కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో ఆయన గురించి ఇప్పుడు తెలుసుకుందాం..

**ఎవరీ రాజీవ్ శుక్లా?:** బీసీసీఐ వైస్ ప్రెసిడెంట్‌గా ఉన్న రాజీవ్ శుక్లా ఉత్తర్‌ప్రదేశ్‌లోని కాన్పూర్ నగరంలో జన్మించారు. జర్నలిస్ట్‌గా కెరీర్‌ను మొదలుపెట్టిన ఆయన.. జనసత్తాతో పాటు రవివార్ లాంటి ప్రముఖ మీడియా సంస్థల్లో పనిచేశారు. ఆ తర్వాత ఆయన రాజకీయాల వైపు అడుగులు వేశారు. అఖిల భారతీయ లోక్‌తాంత్రిక్ కాంగ్రెస్‌లో చేరిన ఆయన.. కొన్నాళ్ల తర్వాత కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. తక్కువ కాలంలోనే కాంగ్రెస్ పార్టీ జాతీయ అధికార ప్రతినిధిగా, అనంతరం రాజ్యసభలో ఎంపీ స్థాయికి ఎదిగారు రాజీవ్ శుక్లా.

# ఆర్సీబీ-పంజాబ్ హెడ్ టు హెడ్ రికార్డ్స్.. ఫైనల్‌లో ఫేవరెట్స్ ఎవరు?



**న్యూఢిల్లీ-నవభూమి:** ఐపీఎల్-2025 ఆఖరి దశకు చేరుకుంది. ఇప్పటికే ప్లేఆఫ్స్ కూడా ముగిశాయి. ఇవాళ జరిగే ఫైనల్స్‌తో క్యాష్ రిచ్ లీగ్ మరో సీజన్ పూర్తవుతుంది. అహ్మదాబాద్ వేదికగా ఇంకొన్ని గంటల్లో జరిగే ఫైనల్ ఫైట్‌లో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు, పంజాబ్ కింగ్స్ తాడోపేడో తేల్చుకోనున్నాయి. సమవుజ్జీలుగా ఉన్న ఈ టీమ్స్ మధ్య రసవత్తర పోరు సాగడం ఖాయంగా కనిపిస్తోంది. ఇప్పటివరకు ఒక్క ఐపీఎల్ ట్రోఫీని కూడా కైవసం చేసుకోకపోవడంతో ఎట్టి పరిస్థితుల్లోనూ నెగ్గితీరాలని రెండు జట్లు పంతంతో ఉన్నాయి. కప్పు కోసం 17 ఏళ్లుగా చకోర పక్షిలా ఎదురు చూస్తున్నాయి. ఈసారైనా తమ కలను నెరవేర్చుకోవాలని అనుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో హెడ్ టు హెడ్ రికార్డులు ఎలా ఉన్నాయి..

కప్పు కొట్టేదెవరు..క్యాష్ రిచ్ లీగ్‌లో ఇప్పటివరకు ఆర్సీబీ-పంజాబ్ కింగ్స్ 36 సార్లు తలపడ్డాయి. ఇందులో ఇరు జట్లు చెరో 18 మ్యాచుల్లో విజయాలు నమోదు చేశాయి. ఈ లెక్కన రెండు టీమ్స్ సమవుజ్జీలుగా ఉన్నాయి. ఈ సీజన్‌లో ఈ జట్లు మూడుసార్లు ఎదురుపడ్డాయి. ఇందులో ఆర్సీబీదే హవా నడిచింది. మూడుకు మూడు మ్యాచుల్లోనూ బెంగళూరే విజయం సాధించింది. ప్లేఆఫ్స్‌లో భాగంగా జరిగిన క్వాలిఫయర్-1లో పంజాబ్‌ను చిత్తు చేసింది కోహ్లీ టీమ్. గత మూడు సీజన్లుగా పంజాబ్‌పై తిరుగులేని రీతిలో ఆధిపత్యం చెలాయిస్తోంది ఆర్సీబీ.

నవక్రీడ

# నో టెన్షన్.. కప్పు కొట్టేది ఆర్సీబీనే.. ఈ సెంటిమెంటే సాక్ష్యం!



**న్యూఢిల్లీ-నవభూమి:** రాయల్ చాలెంజర్స్ బెంగళూరు-పంజాబ్ కింగ్స్ మధ్య మంగళవారం సాయంత్రం కప్ ఫైట్ జరగనుంది. ఐపీఎల్-2025లో చాంపియన్‌గా నిలవాలని రెండు జట్లూ పట్టుదలతో ఉన్నాయి. క్యాష్ రిచ్ లీగ్ చరిత్రలో ఒక్కసారి కూడా టైటిల్ గెలుచుకోలేదీ టీమ్స్. దీంతో ఎవరు నెగ్గినా కొత్త చరిత్ర లిఖించిన ట్లవుతుంది. ఈ ఇరు జట్ల అభిమానులు 18 ఏళ్లుగా మొదటి కప్పు కోసం వేచిచూస్తున్నారు. వాళ్ల కోరిక నెరవేరే రోజు కావడంతో మ్యాచ్ కోసం ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారు. ఈ పోరుపై అనలిస్టులు, మాజీ క్రికెటర్లు ప్రిడిక్షన్స్ మొదలుపెట్టేశారు. ఫలానా టీమ్ గెలుస్తుందంటే ఫలానా జట్టుదే విజయమంటూ ఎవరికి తోచినట్లు వాళ్లు జోస్యం చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ఇవాళ ఆర్సీబీదే గెలుపు అని ఆ జట్టు అభిమానులు అంటున్నారు. దీనికి ఓ సెంటిమెంట్‌ను సాక్ష్యంగా చూపిస్తున్నారు.ఈసారి పాయింట్స్ టేబుల్‌లో పంజాబ్ కింగ్స్ అగ్రస్థానంలో నిలిచింది. ఆర్సీబీ రెండో స్థానాన్ని దక్కించుకుంది. దీంతో బెంగళూరుదే విజయమని అభిమానులు ధీమాగా చెబుతున్నారు. ఐపీఎల్ టోర్నమెంట్ చరిత్రను చూసుకుంటే.. పాయింట్స్ టేబుల్‌లో 2వ స్థానంలో నిలిచిన జట్టు.. 8 సార్లు ట్రోఫీని సొంతం చేసుకుంది. ఇది కోహ్లీ టీమ్‌లో జోష్ పెంచుతోంది. మరోవైపు 14 ఐపీఎల్ ఫైనల్స్‌లో క్వాలిఫయర్-1లో గెలిచిన జట్టు ఏకంగా 11 సార్లు చాంపియన్‌గా నిలిచింది.


Printed,Published & Owned by SHAIK SHAHANAZ, Printed at SUPER PRINTERS Web offset Printers 2-3-655/C/118,Azad Nagar,Amberpet Circle 23,HYDERABAD -500113(T.S.), and Published D.No: 10-2-287/1/,Ground Floor,Santhinagar,A.C Guards,Masabtank,HYDERABAD - 500028,State TELANGANA (India). Editor: **SHAIK SHAHANAZ**, Phone: 9246213493,Email : navabhoomidaily@gmail.com,navabhoomi1@gmail.com **RNI No: TEL TEL: 82083**